UNIVERSAL LIBRARY
OU_206273
UNIVERSAL LIBRARY

787—13-6-75—10,000.

OSMANIA UNIVERSITY LIBRARY

lo. 922.946 Accession No. 11458

r L.19G.

k should be returned on or before the date last marked below.

# గురుగోవింద చరిత్ర.

గ్రంథకర్త:

శ్రీ చిలకమర్తి లక్ష్మీనరసింహము పంతులుగారు.

69

పబ్లిషర్సు:

కొండపల్లి వీరవెంకయ్య అండ్ సన్సు

బుక్సెల్లర్స్ అండ్ పబ్లిషర్సు

రాజమండ్రి

1955

[ వెల 1-0-0

లలితా ప్రింటింగు వర్క్సు
ఇన్నీసుపేట, రాజమండ్రి
1955

# గురుగోవిందచరిత్ర.

సీకు మతమునకు స్థాపకుఁడైన నానకు తన్మతమునకు ప్రథమగురువు. ఈమతమునకు గురువులు పదిమందిగలరు. వారిలో గురుగోవిందుఁడు కడపటి గురువు. మొదటిగురువునకుఁ బదియవ గురువునకు నడుమనుండిన గురువుల చరిత్రములఁ దెలియకపోయినచో గురుగోవిందుని చరిత్రము సమగ్రముగాఁ దెలియుటకు వీలులేదు. కావున వారి చరిత్రములను గూడ సంగ్రహముగా నిందుఁ బొందుపరచెదము.

## రెండవగురువు — అంగదుఁడు.

ఈయంగదుని పూర్వవృత్తాంతము చిత్రమైనది. ఈతఁడు క్షత్రియుఁడు పూర్వాశ్రమమునం దితనిపేరు లెహానా: అతఁడొకనాఁడు తీర్థయాత్రాపరుఁడై పోవుచుండ నప్పుడు కర్తారపురమందు గురునానకు వసియించుచున్న వాఁడనియు నాతఁడు మహాత్ముఁడనియు వానికిం దెలిసెను. తెలియుటయు నతఁడు ముందుగఁ నానకు దర్శనము చేయఁదలఁచి కర్తారపురమునకుఁ బోయెను. పోయి యమ్మహాగురుని మతసంబంధోపన్యాసములు విని లెహానా పరవశుఁడై నానకునకుఁ బరమభక్తుఁడై తాను

పోవఁదలఁచిన స్థానము స్వస్థానము, స్వగృహము మఱచి వాని పాదసేవ జేయుచు నచ్చటనే యుండెను. గురునానకు శిష్యుని చిత్తనైర్మల్యము, భక్తి, విశ్వాసము, వినయము, యోగ్యత మొదలగు సద్గుణములకుం గడుంబ్రియుఁడై తన కుమారుల యందలి పక్షపాతము విడిచి తనయనంతరము లెహానా సీకు మతాచార్యుఁడై పీఠ మధిష్ఠింప వలయునని యాజ్ఞాపించెను. నానక్ భార్యయగు చూనీదేవియు కుమారులు దానికొడంబడరైరి. చూనీదేవి పుత్రులలో నొకనికా పీఠాధిపత్యము నీయ వలయునని పలుమారులు భర్తను బ్రార్థించెను. లెహానా యొక్క సుగుణ సంపద తనయిల్లాలికిఁ జూపి తనయోగ్యతను నామె చేత గూడ నొప్పింపవలయునని నానకు తనకుమారులను లెహానాను భార్యయెదుట బరీక్షించుచు లెహానాయొక్క బుద్ధికుశలతను జూపుచు వచ్చెను. చూనీదేవియు లెహానా మిక్కిలి బుద్ధికుశలుఁడని యొప్పుకొనియెను; కాని తనకొడుకులకాపదవి రాలేదని మనసులో విచారించుచు వచ్చెను. నానకు పరమ పదము నొందెడు దినమునఁ గూడ దారపుత్రులు తమ వంశమునందె పీఠాధిపత్యము నిలుపుమని బహువిధములఁ బ్రార్థించిరి. కాని గురువు వారి ప్రార్థనలను బెడ చెవినిఁ బెట్టెను. క్రొత్తవానికిఁ బీఠాధిపత్య మర్పించినందుకు తన యాలుబిడ్డల పోరధికమగుటఁజేసి యతఁడు లెహానాకుఁ గొన్ని బాధలు కలుగునని తలంచి తన కతఁడు దూరముగా నుండుట మంచిదని భావించి లెహానాను వాని స్వగ్రామమునకే బంపెను. లెహానా యచ్చటనే

యుండి గురు మరణానంతరమున నంగదుఁడను బిరుదు వహించి సీకుల రెండవ గురువయ్యెను. అంగదుఁడు తనగురువు చెప్పిన మార్గమునే యనుసరించెను. సీకుల వేదమగు నాదిగ్రంథమున నంగదుఁడు రచించిన భాగములు స్వల్పముగ గలవు. అవి యేకేశ్వరారాధనముం దెలుపుచు మనోహరములుగా నుండును. అమృతసరము మండలములోనున్న ఖాదూరు గ్రామ మతఁడు నివాసముగ నేర్పరచుకొని రేయుంబవళ్ళు భగవత్ప్రార్థనము ధ్యానముఁ జేయుటలోనే కాలము బుచ్చుచుఁ దన్ను సేవింప వచ్చిన వారికి పరిశుద్ధమైన యాస్తిక మతముం దెలుపుచు యెల్లర గౌరవమునకు బాత్రుఁడయ్యెను. అతఁడు గొప్పదాన వానిగృహ మన్నార్తులకు సత్రమై యుండెను. అతని మృదు భాషలను కతన సీమనుషులను దాసీలనుగను లోకులందఱు వేనోళ్ళ బొగడుచు వచ్చిరి. అతఁడు మన గురుస్వాములవలె నేతి పిండివంటలు మొదలగునవి భక్షింపక కొయ్యగోట్టెమాత్రమే తిని దేహపోషణముఁ జేసికొనుచువచ్చెను. గురునానకు విధముననే యంగద గురువుఁ గూడ తనశిష్యులలో నొకనినే యనంతర గురువుగాఁ జేసెను. ఆయన కొడుకులగు వాసుఁడు, దత్తుఁడు మహా చార్య పదమునకుఁ దగినయోగ్యతలు లేనివారైనందున నతఁడు శిష్యునే యేర్పరచవలసివచ్చెను. కుమారులుండి యామహాపదవిని కాంక్షించుచున్నపుడు వారి కాపదవి నొసగక యర్హుఁడైన వానినే తత్పదవినుంచిన నానకుయొక్కయు నంగదునియొక్కయు మహౌదార్యము నిప్పటిస్వార్థబుద్ధి మిక్కిలి శ్లాఘనీయములుగదా! సికుల మతి

గ్రంథములు వ్రాయఁబడిన గురుముఖీ లిపి నీయంగదుఁడే కని పెట్టెనఁట. ఈ లిపి ప్రస్తుతము సంస్కృతభాష వ్రాయఁబడుచున్న నాగర లిపినిఁ బోలియుండును. గురువు జీవించి యుండగనే యంగదుఁడు దానిని నిర్మించెనని కొందఱును వాని పరోక్షముననిర్మించెనని కొందఱును జెప్పుదురు. ఈయంగదుఁడు 2 సంవత్సరముల కొన్ని మాసములు మత గురువై క్రీ॥ శ॥ 1552 సంవత్సరమున గాలధర్మమొందెను. అతఁడు మరణపూర్వ మనేక సంవత్సరముల నుండి కాళ్ళ మంటలబాధపడుచు తుద కారోగము బారింబడియె.

---

## మూడవగురువు — అమరదాసు.

అంగదగురుని యనంతరమున ప్రాధిపత్యమునువహించిన యమరదాసు క్షత్రియుఁడు. నానకుయొక్క మతబోధలు చెవినిఁ బడునప్పటికి వాని కఱువదియేండ్లు నిండెను. అతఁడు గురుపీఠము నధిష్ఠించు క్రింది విధముగా సంభవించెను. సీకుగురువులందఱు సన్యాసులుగాక గృహస్థు లయినందున నంగదుని యింటి యాఁడుపడుచొక్కతె యమరదాసు కుటుంబములోని బాలకునకుఁ బాణిగ్రహణము చేయఁబడెను. అమరదాసు క్రొత్తచుట్టమగు నంగదుఁడు పరిశుద్ధ జీవనముఁ గలవాఁడనియు

మహాభక్తుఁడనియు విని వానిదర్శనము చేయఁబోయెను. అంగదుఁడు చుట్టమును గౌరవించి వానికి గొన్నికానుకలిచ్చెను. అమరదాసు తాను బాంధవ్యభావమున రాలేదనియు శిష్యభావమున వచ్చితిననియుఁజెప్పి కానుకల గ్రహింపఁడయ్యె. అదివిని యంగదుఁడు శిష్యభావమున వచ్చిన పక్షమున బాంధవ్యముమాట తలపెట్టక వెంటనే శుశ్రూష జేయనారంభించు టుచితమని పల్కెను. అమరదాసు సంతసించి తక్షణమే వానిశిష్యుఁడై నాఁడు మొదలు పరమభక్తుఁడై యుండెను. ముసలివాఁడయ్యు నతఁడు మిక్కిలి విధేయుఁడై గురువుం గొల్చెను. అతనిభక్తి యింతింతని వర్ణింప నలవికానిది. ఎంత నీచసేవనైన నతఁడు మనసున లేశమైన సందేహముందక గురునకుం జేయుచుండెను. గురునకుఁ బాదములలో మంటరోగము గలదని యీవఱకే చెప్పియుంటిమి. అతని పాదములపై చల్లనినీరుపోసి కడిగి వానిప్రాణము సుఖపెట్టుటకై యమరదాసు తాము వసియించు ఖాదూరునకు మూఁడు క్రోసులదూరమున నున్న బియాసునదికి బోయి కుండెడునీరు మూపునబెట్టి మోసికొని ప్రతిదినము నడచివచ్చుచుండును ఈపని నతఁడు స్వయముగాఁ జేయ నిచ్చగించెనేకాని గురువాతనియందు నియోగింపలేదు. ఒకనాఁడురాత్రి చీకటిలో నదినుండి వచ్చుచుండ గురుని బసహారుగునున్న సాలెవాని యింటియెదుట నమరదాసు కాలుజారి గుభాలున బడియెను. కుండపగిలెను. వానికి దెబ్బ తగిలెను. సాలెవాఁడు చప్పుడువిని యదరిపడి యదిఏమో

కినుగొని రమ్మని భార్యతోఁ జెప్పెను. అమరదాసు ప్రత్యహముఁబడుశ్రమ యుడిగినదే కావున వాని యిల్లాలు జరిగిన వృత్తాంతముఁజూచి భర్తకిట్లనియె. "ఈపని యిల్లువాకిలి లేని నిర్భాగ్యుఁ డమరదాసు చేసినది." ఈమాటలు ప్రక్క యింట నున్న యంగదుని చెవులం బడుటయు నతఁడు సత్వరము శిష్యుని కడకుం బోయి ప్రేమాతిశయమున వానిం గౌఁగలించి లోకుల యిల్లుసొత్తులకు మనోవేదనమందకుము నేను నీపోషకుఁడను. నాకుఁగల భాగ్యమంతయునీదే యని పలికి యోదార్చెను. ఈపలుకులంబట్టి గురువునకు వృద్ధశిష్యునిమీఁద నెంత వాత్సల్యముఁగలదో తేటపడును. ఇది జరిగిన కొన్నినాళ్ళకే యమరదాసు భవిష్యద్గురువుగా నంగదునిచే నియుక్తుఁడయ్యెను.

అంగదుని మరణానంతర మమరదాసు గురువై [illegible] కతఁడర్హుఁడేయని యెల్లరచే బొగడఁబడెను. అతఁడు సిక్కుమత సిద్ధాంతములను జనుల మనసున కెక్కునట్లు బోధించి చాల మందిని తనమతమునం గలుపుకొనెను. అనేక మహారాజులు, జమీందారులు, భక్తితత్పరులై వానిబోధనలు విని పూర్వ మాధ్యమును విడిచి వాని శిష్యులై బాగుపడిరి. నానకు కుమారులలో నొకఁడగు శ్రీచంద్రుఁడు క్రొత్తగా దాసులపేర గొందఱశిష్యులం జేరఁదీసి వారినొక తెగఁగాఁ నేర్పరచెను. స్థాపకుఁడు గురునానకు పుత్రుఁడగుటచే లోకులు మతముఁ గూడ నానకు కల్పించినదేయని భ్రమించుచు వచ్చిరి. ఆభ్రమ

నివారింపఁదలఁచి యమరదాసు నానకుయొక్క సిక్కుమతస్థులను వానిపుత్రుని దాసులనుండి వేరుపఱచెను. ఈపని యంగదగురువే చేయవలసినది. కాని యతఁడు నానకు మీఁదంగల గౌరవాతిశయమున వాని పుత్రుని మనసు నొప్పించుట కిష్టములేక యూరకుండెను. అందువలన నమ్మహాకార్య మమరదాసు పాలం బడియె.

అమరదాసున కొక కొడుకు నొక కూఁతురుఁ గలరు. కొడుకు పేరు మోహనుఁడు. కూఁతురుపేరు భాని. కొడుకు పీఠాధిపత్యమున కనర్హుఁడని యమరదాసు తయల్లుఁడు రామదాసున కాపదవి నిచ్చెను. అమరదాసు కూఁతును రామదాసుకిచ్చి వివాహము చేయుటనుగూర్చి లోకులీకథను చెప్పుకొనుచున్నారు. అమరదాసు కూఁతురుమీఁద నధికానురాగముఁగలిగి యామెకుఁ దగిన వరునిఁ గూర్చి బహుప్రయత్నములు చేసెను. ఒకనాఁ డతఁడు తన మనోరథమును దనవద్ద పనిఁజేయుచుండిన యొక బ్రాహ్మణున కెఱింగించి మంచివరుని వెదుక నాజ్ఞాపించెను. ఆవిప్రుఁడు కొన్నితావులకరిగి పెండ్లికొడుకుల ననేకులం జూచి యమరదాసుకడకుఁబోయి యన్నివిధముల భానికిం దగినవరుఁడు లభించెనని విన్నవించెను. పెండ్లికొడు కెంతప్రాయపువాఁడ నని గురువు బ్రాహ్మణు నడుగుటయు నతఁడు చుట్టుప్రక్కల గుంపుఁగూడియున్న జనులనందఱ బరికించిచూచి యందొక బాలునిఁజూపి 'పెండ్లికొడుకు సరిగా వీని యంత పొడుగువాఁడని' పలికెను. అదివిని గురువు లావణ్యమును గ్రక్కుచున్న

యాబాలుని మొగమునంక తప్పక చూచి వానిం బలుకరించి "నీపేరేమి? వంశమెద్ది? వృత్తియేమి" యని యడిగెను. ఆబాలుడు తనపేరు రామదాసనియు తాను క్షత్రియుఁడనియు గండ్వాలు గ్రామనివాసియనియు గౌరవముగా జీవనము జరుగుచుండెననియు గురువునకుఁ బదులు చెప్పెను. అమరదాసు వాని వృత్తాంతము విని ముదితహృదయుఁడై బ్రాహ్మణుఁడు తీసుకొని రాఁదలచిన పెండ్లికొడుకును విడిచి యెట్టయెదుటనున్న బాలుఁడగు రామదాసు రూపురేఖా విలాసంబులంబట్టియు వంశముం బట్టియుఁ దనకూఁతునకుఁ దగువరుండని తలంచి వాని కామె నిచ్చి వివాహము చేసెను.

అమరదాసు మతబోధ చేయునప్పుడు సర్వదా సంఘము నందలి దురాచారములను వెలిపుచ్చి ఖండించుచుండును. సహగమనము ఘోరకృత్యమని యతఁడు తెలుపుచుగ గర్హించుచు వచ్చెను. ఢిల్లీచక్రవర్తియగు నక్బరు వానిమీఁద నిష్టముగలవాఁడై పలుమారు వానిని రావించి భూషించెను. అట్లు జగద్వినుతముగ నిరువదిరెండు సంవత్సరముల యెదుమాసముల పదునొకండు రోజులు పీఠాధిపత్యము వహించి క్రీస్తుశకము 1575 వ సంవత్సరమున గండ్వాలగ్రామమున స్థితిపొందెను. అతని శరీరము దహనముచేసి శిష్యులాస్థలమున నొక గొప్ప గోరీని గట్టిరి. ఇప్పటికిని ప్రతిసంవత్సరము సిక్కులాస్థలమునకు యాత్రచేయుదురు.

## నాల్గవగురువు — రామదాసు.

రామదాసు తన మామగారి యాసల వ్యర్థపుచ్చలేదు. పీఠాధిపతి యగు గురువులయొద్ద నుండవలసిన సకలలక్షణములు వానియందుగలవు. అమరదాసుపై భానీదేవి కెంతభక్తియుండెనో రామదాసునకంతియు భక్తిగలదు. రామదాసునకు లోకోపకార పరాయణత దైవభక్తి యాత్మశుద్ధి వానికీర్తినలుదెసల నలము కొనఁ జేసెను. అందువలన వానిచుట్టు ననేకులుచేరి కొలిచి శిష్యులయిరి. అక్బరుచక్రవర్తివాని కీర్తిని యొకసారి చూడఁ గోరి వాని రావించెను. చక్రవర్తి విజ్ఞానసంపన్నుడగుటచేతను, సర్వమతాదరము గలవాఁడగుటచేతను రామదాసు ప్రసంగము లకు జాల ముదితహృదయుఁడై వానికిఁ గొంతభూమి బహు మానముగ నిచ్చెను. ఆనేలగుండ్రముగ నుండినందున లోకులు దానిని రామదాసుచక్రమందురు. ఈభూమిలో రామదాసు కొలను నొకదానిని త్రవ్వించి యమృతసరమని దానికిం బేరు పెట్టెను. ఆసరస్సుచుట్టు నొకపట్టణము తరువాత బయలు దేరెను. దానికె నమృతసరమని పేరువచ్చెను ఈగురువు స్వగ్రా మమగు గాండ్వాలులోను, స్వనిర్మితమగు నమృతసరములోను కూడ నివసించుచువచ్చెను. చక్రవర్తియగు నక్బరు కాశ్మీరము నుండి ఢిల్లీకిఁబోవుచు దారిలో గాండ్వాలువద్ద నొకనాఁడు విడిసి, రామదాసుతోఁ బ్రసంగింప నిచ్ఛగించి వానిని రావిం చెను. గురువువచ్చుటయు, చక్రవర్తి వానిని మిక్కిలి గౌరవించి వారుకావించిన వేదాంతచర్చల కలరి యేమేనొక గోరిక గోరు

మనెను. రామదాసు తన కేకోరికలు లేవని లోకులపక్షమున దానొక వరము చక్రవర్తినడుగ దలపుగలదని విన్నవించెను. చక్రవర్తి యావరము తప్పక నొసంగునట్లు వాగ్దానము చేయుటయు గురు విట్లనియె. "దేవరవారు లాహోరుపురమునయున్న కాలమున సరకు విశేషముగ విక్రయముగుచుండినందున ధాన్యాదులకు మంచిధర లుండెను. ఇప్పుడు దర్బారు లాహోరు విడిచినందున ధర మందమగును. దానివలన పంటకాపులు చెడుదురు, కావున నీసంవత్సరము శిస్తువసూలు చేయవలదని నేను వేడుకొనుచున్నాను. చక్రవర్తి వానియుపదేశము సంగీకరించి దీనబంధునగు నాగురుని వచనప్రకారమాయేడు కాపుల వద్ద శిస్తుగై కొనగూడదని యానతిచ్చి, పలుకానుకలిచ్చి గురువును వీడ్కొనెను అట్లు రామదాసు సుయశము లోకమున వ్యాపింపజేయుచు నేడు సంవత్సరములు పీఠాధిపత్యమువహించి క్రీస్తుశకము 1582 వ సంవత్సరమున బరమపద మొందెను. అతనిగోలీ బీయాసునది యొడ్డున నున్నది.

---

## అయిదవగురువు — అర్జునుడు.

రామదాసు తరువాత పేర మెక్కిన గురువులందఱు రామదాసు సంతతివారే. ఈపీఠాధిపత్యము రామదాసు సంతతి యందే నిలుచుటకు నీక్రిందికారణము ముఖ్యమైనదని లోకమున

వాడుక కలదు. ఒక్కనాఁడమరదాసు స్నానము చేయుటకు నాలుగుకోళ్ళ పీటమీఁద నెప్పటియట్ల కూర్చుండ దానికోడొకటి కుంటఁజొచ్చెను. అది కనిపెట్టి గురువు తనకుపచారము చేయుటకు స్నానవేళ తనవద్ద నిలిచియున్న పుత్రికంబిలిచి కోడుక్రింద నేదైన నొత్తుపెట్టుమని చెప్పెను. భాని రాయినొత్తు పెట్టవలయునని దానికొఱకు వెదకి యెచ్చట దొరకమి తన హస్తమే కుంటుకోడు క్రిందఁ బెట్టెను. అమరదాసది గనిపెట్టక యే కూతురు రాయి నొత్తుపెట్టెనదనుకొని స్నానముచేసి చూచు నప్పటికి పుత్రిక హస్తమునుంచి నెత్తురు దొరఁగుచుండెను. కారణ మూహించి గురువు కాటికి కాళ్ళుచాపుకొనియున్న ముసలి వాని నిమిత్త మట్టిసాహసము చేయవచ్చునాయని కూఁతును మందలించి, యసాధారణమగు నామె యుపచారమునకు మెచ్చి, వర మడుగుమని యామెను బలవంతము చేసెను. బాలికయు "పితృవిషయమున నేను జేయవలసిన పూజయే చేసితినిగాని, యతిశయమేమియు లేదు. మీరు నన్నుం గడుపున గనుటచేతనే గాక యనేకవిధంబుల మీరు నాకు గురువులరుగదా" యని వినయగర్భితముగ బలికి, వరమడుగ బలవంతము చేసినందున జనకున కిట్లనియె. "నాకు వరప్రదానము చేయఁదలతురేని పీఠాధిపత్యము నాసంతతిలో నుండునట్లనుగ్రహింపవలయు" అది విని యమరదాసట్లె యగుగాక యని వరమిచ్చెను. నాఁట గోలె గురుగోవిందునివఱకు పీఠాధిపత్యము భానీసంతతియందె యుండెను.

రామదాసునకు భానీవలన మహాదేవుండు, పృథివి చందుఁడు, నర్జనుఁడు నను మువ్వురు కొడుకులు కలిగిరి. పెద్దవాడు వైరాగులలో గలిసెను. రెండవవాడు లౌకికవ్యవహార తత్పరుడగుటచే దండ్రి మూడవ పుత్రుఁడగు నర్జునునకు బీఠమిచ్చెను. అందువలన పృథివిచందున కర్జునునిమీఁద నీర్ష్యపొడముటయు నతఁడు మతబోధ జేసుకొననీయక సుఖముగ బ్రతుకనీయక తమ్ముని బాధింపబూని తురకలతో మైత్రిజేసి వారిని వానిమీద కుసిగొల్ప జొచ్చెను. గురువగు నర్జనుఁడు శాంతముదాల్చి సోదరునివలన గలిగిన కష్టముల సరకుసేయకుండెను. అంతియెకాక పృథివిచందుఁడు కపటోపాయములచేత గురువునకువచ్చు కానుకలు, మాన్యముల మీఁదవచ్చు సిస్తులను దానె స్వీకరించి యనుభవింపజొచ్చె. గురువుకన్న దానె యెక్కువవాఁడయినట్లు సీకుమతస్థుల నమ్మింపదలంచి పృథివిచందుఁ డాడంబరముగా నొక్క పెద్దమందిరము కట్టింపఁబూని ధనమార్జింపసాగెను. కాని యామందిరము ముగియక, ధననష్టహేతువయ్యెను. సోదరుఁడు చేసిన యీప్రయత్నములచేత గురువుకూడ నిర్ధనుఁడయి మిగుల నిబ్బంది పడవలసి వచ్చెను. అయినను గాలక్రమమున స్థితిగతులించుక బాగుపడియెను. శిష్యులుపృథివిచందుఁడు దురాశాపాతకుఁడని తెలిసికొని కానుకలు వానికీయక స్వయముగ గురువుకడకుబోయి సమర్పింపజొచ్చిరి. అందుచేత నర్జునునకు ధనలాభ మధికమయ్యెను. ఆయనకు గాంధారము, పిషావరు మొదలగు దూరప్రదేశములయందు సైతము శిష్యులు బయలుదేర

విశేషముగ ముడుపుల నంపజొచ్చిరి. ఇట్లు బహుధనప్రాప్తి యగుటచే నర్జునుఁడు రాజయోగంబున మెఱయుచుండె. పృథివి చందుఁడును సోదరునితో సఖ్యము సంపాదించెను. కాని యా నెయ్య మల్పకాలమే యుండెను. అర్జునుని కంతవఱకు సంతానము లేమి యతఁడు పృథివిచందుని కుమారులలో నొకని దగ్గఱ దీసెను కాబట్టి పీఠాధిపత్యము తనవంశముననే యుండునని పృథివిచందు డువ్విళ్ళూరుచుండె. అట్లుండ నాశాపిశాచగ్రస్థుఁ డైన పృథివిచందునకు బుద్ధిచెప్పుటకో యన దైవ మర్జునుని సంతానవంతుని జేసెను. గురువునకు సుందరుడగు కుమారుడు కలిగెను. ఆబాలుడు నానాట నభివృద్ధిజెంది జ్ఞానసంపదచేత, సద్గుణసంపదచేత బృథివిచందుని పుత్రునికన్న మిన్నయై పీఠాధిపత్యమున కరుహుడై యుండెను. పృథివి చందునకు గడుపుమంట తొంటికన్న హెచ్చెను. ఎట్టకేల కర్జునుడు పిత్రార్జితములగు భూములు, ధనములు సోదరున కిచ్చి పీడానివృత్తి జేసికొనెను.

జ్ఞాతిశత్రుత్వము వదలించుకొని యర్జునుడు సుఖంబున నుండదలప సోదరునికంటె నెక్కుడు బలవంతుడును వానికంటె నెక్కువ హానిచేయగలవాడునగు చందూషా గురువునకు శత్రుడయ్యెను. ఈచందూషా లాహోరునగరములో ఢిల్లీచక్రవర్తి యొక్క మంత్రియైయుండెను. గురువునకు వానికిగల వైరకారణ మిది. చందూషాకు మిక్కిలి చక్కని కూతురుండెను. ఆమెకు దగు వరునిదెచ్చి వివాహముచేయ నతడు సంకల్పించి యల్లుని కొఱకు వెదకుచుండ నర్జునుని కుమారుడగు హరిగోవిందుడు

సకలలక్షణ సంపన్నుడని యర్హవరుడని వానికిం దెలిపెను తెలియుటయు నాతడు వానిసంబంధమున కంగీకరింపక బాలుడు లక్షణ సంపన్నుడైననేమి అర్జునుడు పకీరుకాడా ? నేను వానితో వియ్యమొంది నీచపడుదునా ? నేనొక మేడమీద పై యంతస్థు వంటివాడను. అర్జునుడు దానియడుగుననుండు మురికినీళ్ళకాలువ వంటివాడుగదా" యని సమీపవర్తులతో బలికెను. అనంతరము కొన్నాళ్ళకు తన పుత్రికకు మంచివరుడు లభింపమి చందూషా హరిగోవిందుడే యనుకూలవరుడని వానికి గూతునీయ దలచి ప్రధానము చేసికొనుట కర్జునుని వద్దకు వెలలేని కట్నములు కానుకలు పంపెను. చందూషా యంతకుమున్ను పలికిన పలుకులు గురువున కొక్క పరిచారకుడు విన్నవించినందున గురువు కోపభూయిష్ఠుడై తనకుమారునకు చందూషాపుత్రికను బాణిగ్రహణము చేసికొనుటకు దగదని కానుకలం ద్రిప్పివేసి వెండియు నిట్లనియె. “ చందూషా చాలగొప్పవాడు నేనుపకీరును. నాతో వియ్యమందుట కతనికి మతిపోయినదా యేమి. ”

అని సంబంధము నిరాకరించుటయు నావార్తలు విని చందూషా స్వయముగబోయి గురుని దర్శనముజేసి బాంధవ్యమున కంగీకరింపుమని బహువిధముల వానిం బ్రార్థించెను. ఎన్ని విధముల బ్రార్థించినను గురువుతన మనోనిశ్చయమును ద్రిప్పుకొనక వానిం గసరికొట్టెను. మహాకోపోద్దీపితుడై గురునిపై మనమున నక్కసుబూని వాని కేదేని నపకారముజేయ సమయము వెదకుచుండి జహాంగీరు చక్రవర్తివద్దకుబోయి నీకుగురువు

దేశములోనుండుట రాజ్యమునకు నష్టకరమని వానికి నచ్చ జెప్పెను. చక్రవర్తి వానికొండెములు విని యర్జునుని దన యెదుటికి రావించి వానివలనరాష్ట్రమునకు భంగము లేదని గ్రహించి విడిచిపుచ్చదలంచుటయు చందూషా వానిని విడువగూడదని పట్టుబట్టి యర్జునుని దనస్వాధీనము చేసికొని తనయిచ్చవచ్చినట్లు వానిం జేయుటకు ఫాదుషా సెలవు గైకొనెను. ఫాదుషాయట్లు సెలవిచ్చుటయు చందూషా యర్జునుని బ్రతికియుండగ దగుల బెట్టింపవలయునని నిశ్చయించుకొనెను. గురువగు నర్జునుడు తనకు రాదలచిన ఘోరమరణము విని చెక్కుచెదరక భయపడక క్షమాపుమని చందూషాను ప్రార్థింపక సర్వసిద్ధుడై తగుల బెట్టకమునుపు నదిలో స్నానముచేయనిమ్మని వానికి వర్తమానమంపెను.

చందూషా యర్జునుని కడపటి కోరికం దీర్పందలంచి రావి నదిలో స్నానార్థము వాని నరుగనిచ్చెను. గురువు నదిలోమునింగి యదృశ్యుండయ్యెను. ఇది క్రీ॥ శ॥ 1607 సంవత్సరమున జరిగెను. గురువు దారుణమైన యగ్నిమరణముకంటె జలమరణ మెక్కువ సహ్యముగ నుండునని తలంచి లోంతునీట దిగి చచ్చియుండెను. అనంతరము శిష్యులు వెదకి గురుని శవమునుగనుగొని తెచ్చి దహనముచేసిరి. లాహోరు కోటవద్ద సుందరమైన సమాధియొకటి శిష్యులచే నిర్మింపబడి యిప్పుడొక పుణ్యక్షేత్రమయి యున్నది. ఈయర్జునుండే సిక్కుల వేదమని చెప్పందగిన యాదిగ్రంథమును బ్రస్తుతమున్న విధముగా బయటికిం దెచ్చెను. ఈగ్రంథమీయన

రచియింపలేము. నానకు మొదలగు పూర్వగురువులు రచియించిన గ్రంథమును సంస్కరించి తాను కొన్ని భాగముల రచియించి యందుఁజేర్చి దాని కాది గ్రంథమని పేరుపెట్టెను. ఈ గ్రంథ రచన మిక్కిలి యుత్కృష్టము శ్లాఘనీయమును ఏలయన సిక్కు మతమున కాధారమయిన ప్రధానగ్రంథమిదియు లేకపోవుట యొక్క గొప్ప వెలితిగనుండెను. మరియు నాలుగక్షరములు కూర్పజాలిన జ్ఞానలవదుర్విదగ్ధులు కొందఱిదివఱకే బయలువెడలి యర్థములేని పిచ్చిగీతములఁ గొన్నిటి నల్లి వాని కర్తృత్వము నానకున కారోపించి లోకమున నవి వ్యాప్తముఁ జేయుచుండిరి. అందుచేత నిజముగా గురువులు రచించిన భాగము లేవో తదితరులు వ్రాసిన భాగములేవో నిరూపించుట యప్పటికే కష్టసాధ్యముగ నుండెను. అది కారణముగా శిష్యులు గురువగు నర్జునుని సన్నిధికేఁబోయి వానితో నిట్లు మనవి చెప్పిరి. "స్వామీ గురునానకు రచియించినగీతములు వినినప్పుడు మనస్సు ప్రశాంతమై భక్తితత్పరమగును. ఇతరసాధువులనేకులు చాల పద్యములను స్వయముగవ్రాసి వానికి నానకుపేరుఁ జేర్చిరి. ఆ పద్యములం జదువువారికి హృదయముల భక్తిజనియింపదు సరే కదా మీఁదు మిక్కిలి గర్వముకూడ నంకురించును కావున భక్తులకసత్యభేదములఁ దెలిసికొనుటకు నానకు పద్యముల కేదైన నానవాళ్ళు వేయుట సముచితము." అర్జునుఁడు వారి విజ్ఞాపనమాలకించి యట్టికార్య మావశ్యమని తలంచి యాగ్రంథమును గూర్ప నారంభించెను. ఈగ్రంథము గూర్చుటలో నర్జునునకు

భాయి గురుదాసు భల్లుఁడనుకవితా ప్రౌఢిమగల సిక్కుమతస్థుఁ డొకఁడు చాల సాయముఁజేసెను. ఆదిగ్రంథమునందు మొదటి యైదుగురు గురువుల భాషితములుఁ జేర్పఁబడియుండి యొకరి కవిత్వము మఱియొకరి కవిత్వమని జనులు భ్రమింపకుండునట్లు చక్కగా నొనర్పఁబడెను. అర్జునుఁడు నానకు రచియించిన పద్యములు మహల్లపలుని పద్యములని ప్రత్యేకముగ గురుతులు పెట్టి వ్రాసెను. మహల్లపలుఁ డనఁగా ప్రథమ గురువని యర్థము. అర్జునుఁడు, కబీరు మొదలగు నితరభక్తులచే రచియింపఁబడిన భక్తి రసప్రధానములగు గీతములఁ గొన్నిఁటి నాదిగ్రంథమునందుఁజేర్చి యట్టివానికిఁ గృతికర్తల నామములు గురుతులుగా నిడికెను. అనేక సంవత్సరములు పాటుపడి యర్జునుఁడు గ్రంథమును ముగించిన పిదప సిక్కులరావించి యిట్లుపదేశముఁజేసెను. "సోదరులారా! ఈయాదిగ్రంథమునం దేదిగలదో యదియంతయు మీకాదరణీయము ఇందులేనిది గురునానకు చేసినాఁడని నమ్మకగలవారు దృఢముగాఁ జెప్పినను మీకగ్రాహ్యమేయగును" ఆదిగ్రంథ నిర్మాణమే యర్జునుని జీవితమునందుఁ బ్రధానమయినది. అతఁడు కావించిన తదితర లోకోపకారములలో ముఖ్యములుగాఁ జెప్పదగినవి తరంతము గ్రామమున ద్రవ్వించిన కోనేరొకటి. రెండవది అమృతసరమునఁ ద్రవ్వించిన చెఱువు. తరంతర గ్రామమమృతసరమున కేడుమయిళ్ళదూరమున నున్నది. అమృతసరమే తనకు గాఁపురముగఁజేసికొని యందు హరిమందిరమును పేరఁ జక్కని భవనమొకటి కట్టించెను. అతనికి నివాసస్థానమైన

దాదిగ నమృతసరము తోఁటచుట్లు గుడిసెలతో నిండి యుండక క్రమక్రమంబున మేడలకు మిద్దెలకు నిలయమై సిరులకు నెలవై యమృతసరనామము సార్థకముఁ జేసికొనెను.

ఈగురువుఁగూర్చి చిన్న చిత్రకథ యొకటి కలదు. ఆ కథఁ జదివినవారికి సిక్కుమతాచార్యులు పూజ్యులైన పురుషుల యెడ నెంత వినయసంపత్తిఁ గలిగి మెలఁగుచుండిరో సులభముగ దెలియఁగలదు. ఈగురువు పీఠాధిపత్యముఁజేయు కాలమున నానకుయొక్క కుమారులలో నొకఁడగు శ్రీచంద్రుఁడు బ్రతికి యుండెను. అర్జునుఁడు గురుపుత్రుని దర్శనమునకుఁబోయి కాంచి వానియెడ మిక్కిలి ప్రపత్తినెఱపి గౌరవించెను. ప్రసంగవశమున శ్రీచంద్రుఁ డర్జునునితో నీగడ్డ మింతపొడుగుగాఁ బెంచితివేమ నెను. అనవుఁ డర్జునుఁడు నీపాదరక్షలమీఁద దుమ్ముఁ దుడుచుటకు బెంచితినని ప్రత్యుత్తరమిచ్చెను. వినయ గర్భితమైన యామేలి పలుకువిని కడు నక్కజపడి శ్రీచంద్రుఁ డిట్లనియె. "ఈ వినయ సౌజన్యములే నీకును నీపూర్వాచార్యునకును నానకు యొక్క పీఠము నిప్పించినవి. మాగర్వమే మమ్మాపదవికి దూరము చేసెను."

## ఆరవగురువు — హరిగోవిందుడు.

అర్జునుని యనంతరము వాని పుత్రుఁడగు హరిగోవిందుఁడు గురువయ్యెను. పీఠమెక్కు నప్పటికి హరిగోవిందుఁడు పదునొకండేండ్ల ప్రాయము కలవాఁడు. అతిక్రూరమయిన పితృమరణమునకు నతఁడు తద్దయు శోకించి తత్కారణుఁడయిన చందూసా యొడలఁ బగఁబూని తగు సమయము వచ్చినపుడు కసిదీర్చుకొనుటకుఁ గృతనిశ్చయుఁడయ్యెను. ఆతని పినతండ్రియగు పృథివిచందుఁడు తాను గురువు కావలయునని మఱియొకసారి ప్రయత్నించెను; కాని సిక్కులందఱుఁ గట్టుకట్టి యేకకంఠ్యముగ వాని యాధిపత్యము వలదని నిరాకరించుటచే వాని యత్నములు వ్యర్థములయ్యెను. అయినను బృథివిచందుఁడు తన పట్టినపట్టు విడువక చలపాదితనమూని తన యన్నను బీడించినట్లె యన్న కుమారునిఁ గూడ నానాబాధలఁ బెట్టఁదలఁచెను.

హరిగోవిందుఁడు తండ్రివలె మెత్తనివాఁడు గాక దేహబలము మనోబలముఁ గలవాఁడు కావున వెఱపులేక పీఠాధిపత్యమున కడ్డుపెట్ట సంకల్పించిన వారితో సంధిజేసికొనక తుదవఱకుఁ బోరఁదలఁచెను. ఆతనియందు మతాచార్యునియందుండవలసిన పవిత్రత ప్రజ్వలితభక్తి సత్ప్రవర్తనల మొదలగు లక్షణములకు దోడుగ శూరజన చిహ్నములైన బలసాహసములుండుటచేత హరిగోవిందుఁడు స్వమతమును బోధనాధికముచేత వృద్ధిఁజేయుటయెగాక నానకుయొక్క మతవ్యాప్తికి దేశ కాల

విపర్యయములచేత గావలసిన శౌర్యాదిలక్షణములను సిక్కులకుపదే శించి తన్నుఁ జూచి వారు నేర్చుకొనుట కవసరమైనప్పుడు పగ వారితో మొరలుదీర్చి పెనంగొనుచు వీరసహారములు సేయ జొచ్చెను. వయసు ముదిరినకొలఁది హరిగోవిందుఁడు మంచి గుఱ్ఱపురౌతయి బల్లెమును బట్టుటలోను ఖడ్గమును ద్రిప్పుటలో సాటిలేని నేర్పరియై యుద్ధములలో మొనలుదీర్చుటలో గూఢో పాయములం బన్నుటలోఁ బ్రోడయై కడు వేఁటతమకముఁ గలిగి యనుచరులకు హృదయానందముగలుగఁ జేయుచుండెను. వేఁటయందు వానికెంత తమకమోకాని యతఁడు స్వహస్తము లతోఁ జంపిన జంతువుల మాంసమును దినునపుడు మహానంద భరితుఁడై యుండువాఁడట. అట్టి తేజశ్శాలి యనుచరుల హృద యములలో శౌర్యాగ్ని పొడమి ప్రజ్వలించుట యొక యాశ్చ ర్యములోనిది కాదుగద. హరిగోవిందుని శిష్యులగు సిక్కులు మొదటనుండియు మతమే ప్రధానముగాఁ జూచుకొను భక్తు లయ్యు గురువుమార్గము ననుసరించి క్రమక్రమమున వీరరస పూరితులై రణరక్తులై మెలంగఁజొచ్చిరి.

జహాంగీరు చక్రవర్తికి గురువునందుమిక్కిలి గౌరవము జనించెను. ఊరక గౌరవము కుదురుటయేకాదు ఆచక్రవర్తి హరి గోవిందునకు వశవర్తియై మెలంగెను. అట్లు మెలంగుటచే తనే గురువు తండ్రిని బలవన్మరణము పాలుచేసిన చందూషా యల్పకాలములోనే చక్రవర్తి యాగ్రహమునకుఁ బాత్రుఁడై యాతని రక్షణము లేనివాఁడై దిక్కుమాలిన వాఁడయ్యెను.

అనగా హరిగోవిందుఁడు చందూషాను దన యిచ్ఛవచ్చిన తెఱంగునఁ జేయుటకు వీలుకలిగెను. అంతట కొద్దికాలమునకే దురాత్ముఁడగు చందూషాగృహముఁ దోఁచుకొనఁబడెను అతఁడు నీచమైన మరణము నొందెను.

జహంగీరు కాశ్మీరునకుఁ బోవుచు దనవెంట నీ సీకుగురువును దోడ్కొని పోయెను. హరిగోవిందుఁడు స్వతంత్రుఁడు నిర్భయ చేతస్కుఁడు నై నందున జక్రవర్తితో నప్పుడు సయితము నదురుఁ బెదురు లేక మాటలాడుచు వచ్చెను. ఆమొగలాయి దర్బారులో నన్నపుడు వానికి మహమ్మదీయ మతగురువులతో సీకు మహమ్మదీయ మతముల మంచిచెడ్డలను గూర్చి వాదములు సంభవించుటయు నతఁడు చక్రవర్తిని సరకుసేయక తురక గురువులకు జంకక తన యభిప్రాయమును నిర్భయముగ జెప్పుచువచ్చెను. అందుచేత జహంగీరునకు వానిమీఁద నాగ్రహము బొడమెను. అదియునుంగాక యీగురువు తనకు ముడుపుల కానుకల రూపమున వచ్చుధనమున కెవ్వరడిగిన లెక్క సెప్పక యథేచ్ఛముగా వ్యయము సేయుచుండును. వేఁటయందలి తమకము నానాటికి వానికి హెచ్చఁజొచ్చెనే కాని డింపు పడదయ్యె. మతాభిప్రాయభేదములచేత గలిగిన కోపమునకే రెండు కారణములు నెపములు కాఁగా జహంగీరు గురుగోవిందునిఁ జెఱసాలలో బంధింపవలసినదనియు రెండులక్షల రూపాయలు ధనదండన మొప్పడిచ్చు నప్పుడు విడుదలకావలసినదనియు నానతిచ్చెను. అంత మొత్తము లేనందున హరిగోవిందుఁడు

గ్వాలియరు కోటలో బద్ధుడయ్యెను. ఈకోటలో గురువు పండ్రెండు సంవత్సరములు బందియై యనేకకష్టము లనుభవించెనని చెప్పుదురు. కడుపునిండ నన్నము లేదు. పండుకొనుటకు పానుపు లేదు మాటలాడుటకు మనుష్యుఁడు లేడు. ఎంత పీడగలిగినను గురువు తొల్లిటియట్లె పూనిక స్వతంత్రభావము విడువక యుండెను. చక్రవర్తి దేహముమాత్రమె గ్వాలియరుకోటలో బంధించి శిష్యులగు సిక్కులకు వానిని గానఁబడకుండఁ జేయగలిగెనే కాని వారికి మహాగురువునెడగల తీవ్రమయిన భక్తిని గౌరవమును లేశమైనను రూపుమాపజాలఁడయ్యె. గురువు కారాగృహబద్ధుఁడయ్యెనను వార్త చెవినిసోఁకుటతోడనే దేశమందలి నానా భాగములనుండి సిక్కులు గ్వాలియరునకుఁబోయిరి. పోయి నయనానందకరముగాఁ దమగురుమూర్తిం జూడలేకపోయినను వారు వాని యున్నకోటకు దూరమునందుండి సాష్టాంగ నమస్కారముల జేసి వాని పాదముల మనంబుల ధ్యానించి వాని విమోచనమున కనేకవిధముల భగవంతునిఁ బ్రార్థించి స్వదేశముల కరుగుచు వచ్చిరి. ఎట్టకేలకు జహాంగీరున కేమితోఁచినదో దెలియదు. కాని యతఁడు సిక్కుగురువును బంధవిముక్తునిఁ జేసెను. ఆ కాలమున రాజకీయవ్యవహారములు సరిగానుండనందున ఘానుషా సిక్కులకు నుపకారముఁ జేసిన పక్షమున వారు శత్రువులలోఁ గలియక తనపక్షమున నుందురని నమ్మి వారిగురువును విడిచి వారి చిరాభిలాషముఁ దీర్చెను. ఆదినములలో మొగలాయి సేనల కధిపతియైన యుసాపుఖాను మొదలగు నమ్మకరావులు

కొందఱు చక్రవర్తి కహితులయి వానిపై ధ్వజమెత్తఁ జూచు చుండిరి. ఇవి మనంబునం బెట్టుకొనియే చక్రవర్తి యీఘన కార్యముఁ జేసెను. విముక్తుఁడై గురువు మాళవదేశమునకరిగి తన పూర్వవ్యాపారములె చేయనారంభించెను. ఈ యారంభ ములోఁ గొంద ఱనుచరులే బలగముగాఁగల యీమతగురువు మహాసముద్ర తరంగమువలె తరుగని సేనలుగల ఢిల్లీశ్వరునితోఁ బోరవలసివచ్చెను.

ఇంతలో జహాంగీరు మృతినొందుటయు షాజహాను సింహాసన మెక్కుటయు సంభవించెను. షాజహాని పెద్దకొడుకగు దారా పంజాబుదేశమునకు పరిపాలకుఁడుగ నియమింపఁబడెను. అప్పుడు హరిగోవిందుని శిష్యుఁడొకఁడు తురుష్కస్థానమునుండి తన గురువునకు సమర్పింప నుత్తమజాతిగుఱ్ఱములను గొన్నిఁటిఁ దెచ్చెను. కాని యవి గమ్యస్థానమునకుఁ జేరకముందే చక్రవర్తి గారికి గావలసియుండినవను నెపమున మార్గమధ్యమున మహమ్మదీయ సేవకులచే నపహరింపఁబడెను. గురువు దుస్సహమైన యీయపరాధమును భరింపఁజాలక తీవరపడి దానికిఁదగు ప్రతీకారముం జేయఁదగిన యదను వెదుకఁజొచ్చె. తురకలచేతఁ బట్టువడిన గుఱ్ఱములలో నొకటి లాహోరు న్యాయాధిపతియైన ఖాజీకి సమర్పింపఁబడెను. మహమ్మదీయప్రభుత్వములో ఖాజీలే మనకు జడ్జీలుగా నుండిరి. ఆగుఱ్ఱము మంచిది అయినను గురువు విశేష ధనమిచ్చి దానిఁగొనఁ బ్రయత్నించెను. బేరము ముగిసినపిదప గురువు వెలయిచ్చి దానినిఁ దీసుకొనడయ్యె. అప్పుడు సీకు

గురువు తన్నొకతాళి సేయుటకై కుంటిగుఱ్ఱమునిమిత్త మంతధన మునిచ్చునట్లు బేరమాడెనని ఖాజీ తెలిసికొని వానియెడ నలుక వహించెను. ఈయలుక మఱియొక కారణముచే ద్విగుణీకృత మయ్యెను. ఖాజీకుమార్తెయగు కవెలాన్ బీబీ హరిగోవిందుని మోహించెను. అది తండ్రి యెఱిఁగి నివారింపఁ బ్రయత్నింప నామె హరిగోవిందుని శరణువేఁడెను. ఖాజీ మహాకుపితుఁడై తన పరాభవము దీర్పుమని చక్రవర్తిని వేఁడుకొనెను. ఆయన యేడువేల సైనికులను హరిగోవిందుని బట్టుకొను నిమిత్తమంపెను. ఆసైన్యముయొక్క రాకవిని గురువు తన సిక్కుమూఁకలఁ గలియఁగట్టుకొని యెట్టకేలకు యెదువేలమందిని చేర్చి మొగలాయి సేనతో యుద్ధసన్నద్ధుఁడయ్యెను. అమృతసరమువద్ద నుభయసేనలకు సంకులసమర మయ్యెను. అతిసాహసులగు సిక్కుల పరాక్రమము ముందర మహమ్మదీయ ధైర్యస్థైర్యములు జంఝానిలముము ముందరి మేఘములట్లయ్యెను. పరాజితులైన మొగలాయి సైనికులు లాహోరునకు బాఱిపోయిరి. విజయులై సిక్కులు వారిని వెన్నంటి తరిమితరిమి యనేకుల దుత్తునియలుగా ఖండించిరి. కలహహేతువైన కవలాన్ బీబీ హరిగోవిందుని కడనే మరణానంతరమువరకునుండెను. ఆమె నతఁడు వివాహమయ్యెనని తోఁచెడిని. అందుచేతనే గాఁబోలతఁడు ప్రియురాలపేర కవలాన్ సరస్సను నొకకోనేరు నమృతసరపట్టణమున ద్రవ్వించెను. ఇదియైన కొన్నిదినములకే హరిగోవిందుని శిష్యుఁడొకఁడు చాలకాలము దేశద్రిమ్మరియై తిరుగుచు మున్ను

చక్రవర్తి తనగురువు గుఱ్ఱములను హరించినందుకు ప్రతీకారముగా మరల చక్రవర్తిగుఱ్ఱముల రెంటి నపహరించి తెచ్చెను. దైవవశమున నీరెండు గుఱ్ఱములు ద్రోల్లి గురువునిమిత్తము తురుష్కస్థానమునుండి శిష్యుఁడొకఁడు తెచ్చిన హయముల లోనివే యయ్యెను.

ఈవార్త వినినతోడనే మొగలాయిదర్బారు కోపాగ్నిచే ప్రజ్వరిల్లెను. వెంటనే యిరువురు తురక సేనాపతులు మహాసేనాసమేతులై గురువునకు బుద్ధిచెప్పుటకు వచ్చిరి. అది యెరింగి హరిగోవిందుడు సమరసన్నాహముఁ జేసెను. రెండుమొనలకు సందడికయ్యమయ్యె. మరల మొగలాయిలకుఁ బరాజయము సిక్కులకు జయముఁగలిగెను. తురకసేనలు సిక్కులకు వెన్నిచ్చి ప్రాణభీతిని లాహోరునకు బరుగెత్తెను. సేనాను లిరువురు సిక్కులచే రణనిహతులైరి. అనంతరము గురువు తనపేర నిర్మింపఁబడిన హరిగోవిందపురమునకుఁ జనియె. అక్కడ చందూషా బంధువు డొకఁడు గురువును గడతేర్ప, బ్రయత్నించెను. ఈప్రయత్నములో నతఁడె యమపుర కతిథియయ్యెను.

అనంతరము హరిగోవిందుఁడు కొంతకాల మిక్కడ నక్కడతిరిగి యమృతసరమునకుఁ బోయెను. వెంటనే వానికిఁ బగతురతోఁ బోరాటము సిద్ధమయ్యెను. ఈగురుని యనుచరులలో ముఖ్యుఁడు పైండాఖానను నొక పఠానుతురక వానితల్లి చిన్నప్పుడు గురువును బాలిచ్చి పెంచెను. అది కారణముగా గురువు వానిని నమ్మినబంటుగ నేలుకొని తదయు నాదరించెను.

పఠానుఁడు నల్లె గురువునెడ బ్రియభృత్యుఁడై వానికనుసన్నల మెలంగుచుండెను. అటులుండ నొక్కనాఁడు హరిగోవిందుని పెద్దకుమారుని పెంపుడుడేగ పఠానునియింట వ్రాల నతఁడు దానింబట్టి దాఁచె. గురుపుత్రుఁడు దానికడకుఁబోయి దాని నిమ్మని యడిగెను. అక్కఱకు తురక మొదట డేగ తనకడ లేనే లేదని నొక్కిపలికి యెట్టకేలకు తనకడ నుండెననియుఁ దాని నిచ్చుట లేదనియు గరువముతోఁ బలికెను. హరిగోవిందుఁడు తురకను దౌర్జన్యమునకు దండింపవలయునని సంకల్పించెను. కాని యీతలంపు నెరవేరకమున్నె పఠానుఁడు ఢిల్లీకిబోయి చక్రవర్తితో దనపరాభవము విన్నవించుకొని కొంతసేన నిచ్చిన గురువునుం బట్టితెచ్చునట్లుఁ బ్రతిన జేసెను. చక్రవర్తి వాని కోరికను దీర్చి కొంతసేననిచ్చె. హరిగోవిందుఁ డాసేన నెదుర్కొనెను. ఆదళంబులకు పోరు ఘోరంబుగ జరిగెను. ఎప్పటివలె విజయలక్ష్మి హరిగోవిందుని యధీనమయ్యెను. నాఁడు తురకలనేకులు గురుని ఖడ్గమునకెరయైరి. అందు పైండాఖానుముఖ్యుఁడు. ఈయుద్ధమున శత్రుసైనికుఁ డొకఁడు భయంకరముగఁ గత్తిదూసి గురునిమీఁదఁ బడియె. గురు వాయేటుం దప్పించుకొని నవ్వుచు ఖడ్గమెత్తి యోరీ దెబ్బగొట్టుటయిట్లుగాదు ఇదిగో నిట్లుసుమీ యని యొక్కవ్రేటున వానిని రెండు తునియలుజేసె తన పాదముల ముందర బడవేసెను. ఈగురుని చరిత్రము వ్రాసినవారిలో నొకఁడీ సందర్భమున హరిగోవిందుఁడు కోపావేశమున శత్రువును జంపలేదనియు శిష్యుల కన్నివిద్యలు నేర్పుటకో గురు

ధర్మముగుటచే గురువైన యాతఁడు ఖడ్గకౌశలక్రమమును శిష్యులకు నేర్పుటకే యట్లు చేసెననియు వ్రాసెను. క్రొత్తగా గలిగిన యీాజయమునకు గురువు సంతసింపక చక్రవర్తివలన మఱిమఱి యుపద్రవములు కది హేతువగునని గనిపెట్టి యీ దారుణకర్మముల నేవగించి ప్రశాంతచిత్తుఁడై చరమావస్థ నిర్మల ప్రదేశమున భగవత్కైంకర్యమునందు వేదాంతగోష్ఠియందు గడుపఁదలంచి కొంతకాల మొకగ్రామమున నుండి యచ్చోఁ బ్రవాసి పర్వతప్రాంతముల కరిగెను. అచ్చట శత్రువుల కెం దుర్భేద్యముగ నున్న కీర్తిపురము నాకుగాపురముఁ జేసికొనియెను. ఆయూరనే హరిగోవిందుఁడు జీవితాంతము వఱకు గాపురముండి సిక్కుమతము వ్యాపింపఁజేసి నలువది తొమ్మిది యేండ్లప్రాయమున క్రీ॥ శ॥ 1639 వ సం॥వ సిద్ధిపొందెను.

అతనిఁగొందఱు వేదాంతి యందురు. కొందఱు వానిని బహుదేవతా భక్తుఁడందురు. ఎవ్వరేమనుకొన్న నతఁడు సిక్కుమతమునందు స్థిరమైన విశ్వాసము కలవాఁడనియుఁ దనజీవితము దానికే ధారపోసెననియుఁ జెప్పవచ్చును. హరిగోవిందున కైదుగురు కుమారులుండిరి. వారి నామధేయములివి. 1 గురుదత్తుఁడు. 2 తేజబహదూరు. 3 సూరతసింగు. 4 అనిరుద్ధుఁడు. 5 అటలురావు. పెద్దకొడుకు హరిగోవిందుఁ డుండఁగానే కాలధర్మము నొందెను. అతని కొక్క కొడుకు కలఁడు వాని పేరు హరరావు. తండ్రిలేని బిడ్డయగుటచేత హరిగోవిందుఁడు వాని నెక్కువ గారాబముతోఁ బెంచి వానికే తనయనంతరమునఁ బీఠమిచ్చెను.

## ఏడవగురువు — హరరావు.

గురుహరరావు శాంతస్వభావుఁడు. నిరంతర మీశ్వర ధ్యానతత్పరుఁడు ఎల్లవారితో మైత్రియే పాటించెను కాని కలహమున కిష్టపడఁడు. తన జీవితకాలములో నొక్కసారిమాత్రమే యతఁడు లౌకిక వ్యవహారములఁ బ్రవేశించెను. ఢిల్లీసింహాసనము కొఱకు షాజహానుని పెద్దకొడుకు ధర్మస్వరూపుఁడునగు దారా మీఁదికి దుష్టశీలుఁడగు నౌరంగజేబు దండెత్తినప్పుడు హరరావు దారాకు సహాయముజేసెను. యుద్ధములో దారా యోడి పోయిన పిదప నౌరంగజేబు రాజ్యప్రతిష్ఠితుఁడయి హరరావును బెదరించి వాని పెద్దకుమారుఁడగు రామారావును తనవద్ద జామీనుగా నుంచవలసినదని యాజ్ఞాపించెను. చక్రవర్తి నెదిరించుటకుఁదగిన మనోధైర్యముగాని, ధనముగాని, సైన్యము గాని లేనందున హరరావు విధిలేక తనజ్యేష్ఠపుత్రుని ఢిల్లీదర్బారునకు బంపెను. రామారావు దర్బారునకుఁ బోయినప్పుడు చక్రవర్తి వానిమాటల పొందికకు సౌజన్యతకుఁ జాల సంతసించి యాగ్రహమువిడిచి హరరావు మతగురువే కాని యుద్ధప్రియుఁ డైన వీరుఁడు కాఁడని నమ్మి యా కుమారునకు విలువగల వస్త్రాలంకారములు బహుమానముచేసి తగిన పీఠమిచ్చి దర్బారులో నిలిపి గౌరవించెను. హరరావు క్రీస్తుశకము 1863 సంవత్సరమునఁ గీర్తిపురమందు గాలధర్మమొందెను. అతఁడు మృతి నొందకమునుపే తన కనిష్ఠపుత్రుని హరికృష్ణుని (హరికిసన్) పీఠాధిపత్యమున నియమించెను.

## ఎనిమిదవగురువు — హరికృష్ణుఁడు.

తండ్రిపోవునప్పటికి జ్యేష్ఠపుత్రుఁడగు రామారావు ఢిల్లీలోనే యుండెను. జ్యేష్ఠుని దన్నువిడచి కనిష్ఠునకు గురుపదవి తండ్రియిచ్చినందుకు రామారావు మిక్కిలి కినిసి తనకు జరిగిన యన్యాయమునుఁ జక్రవర్తితో మొఱబెట్టుకొనఁ నతఁడు వాని యందనుగ్రహము కలవాఁడై తత్క్షణము తన దర్బారునకు రావల సినదని గురువగు హరికృష్ణున కాజ్ఞాపించెను. గురుపదమునందుట ప్రాపంచక భోగము లనుభవించుటకు, నధికారములు చేయుటకు ననుకొని, యది తనకు లభింపలేదని విచారించి దానివిషయమై విశ్వప్రయత్నము చేయుటచేతనే రామారావట్టిపదవి కనర్హుఁడని చెప్పవచ్చును. అతని కాపదవి నీయక చిన్నకొడుకున కిచ్చుటలో దండ్రి న్యాయముగా నడచుకొనెననియే మన మూహింపవల యును. హరికృష్ణుఁడు ఢిల్లీ మొక్కనప్పటి కేడేండ్ల ప్రాయము వాఁడయినను వానిమొగము కలకలలాడుచు జ్ఞానతేజస్సుతో నిండియుండెను. అతఁడు వచ్చి యెదుటనిలువ నౌరంగజేబు చక్ర వర్తి వాని ముద్దుమొగమును జూచి, ముద్దులమూటఁగట్టు మాటలను విని, వానియందు పక్షము గలవాఁడయ్యెను. ఈపక్ష పాతమునకుఁ దోడుగా హరికృష్ణుని తెలివియే వానికి గొప్ప సాయముఁ జేసెను. ఈతఁడు బాలుఁడగుటచేఁ జక్రవర్తి వాని నొకసారి యంతఃపురమునకు బిలిపించి యంతఃపురస్త్రీల నందఱఁ జూపి తన పట్టపుదేవి యెవ్వరో చూపుమని యడిగెను. హరి

కృష్ణుఁ డదివఱ కెన్నఁడు జూడకపోయినను జక్రవర్తిభార్యను దప్పక చూపెను. తన యంతిపురమైన నెన్నఁడు చూడని యా బాలుఁడు బుద్ధిసంపదచే దనపట్టపు దేవిని నిరూపించుటయందు కాశ్చర్యమునొంది చక్రవర్తి యతఁడే పీఠాధిపత్యమునకుఁ దగిన వాఁడని శాసించెను. ఇట్లుచేయుటకుఁ గారణాంతరముఁగూడ కలదు. ఏది యన హరికృష్ణుని తల్లివలె రామారావు తల్లి సత్కులసంజాతకాదు. ఢిల్లీశ్వరున కనుగ్రహము గల్గినను జగదీశ్వరునకు వానిమీఁద ననుగ్రహము లేకపోయెను. ఆకాలములో ఢిల్లీనగరములో బ్రబలియుండిన మశూచికవ్యాధి యా బాలగురువునకు దగపడి యచిరకాలమున వాని దనపొట్ట బెట్టుకొనియె. అతని శరీరము ఢిల్లీలోనే యమునాతీరమున దహనము చేయఁబడెను. ఆచోట నిపుడొక చిన్న సమాధి యున్నది. చనిపోవునప్పటికి హరికృష్ణుఁడు తొమ్మిది సంవత్సరములవాడు.

---

## తొమ్మిదవగురువు — తేజబహదూరు.

ఈయన సీకుల యాఱవగురువగు హరిగోవిందుని రెండవ కుమారుఁడు. ఈతఁడు బుకాలాయను గ్రామమున వాసము సేయుచుండెను. ఎనిమిదవగురువగు హరికృష్ణుఁడు మృతినొందు నప్పుడు తదనంతరగురు వెవ్వఁడని యడుగఁగా నాబాలుఁడు "బాబాబుకాలా" యని పల్కెనఁట. బుకాలాగ్రామమందు

కాఁపురముండు జనులందఱు సిక్కులే బాలగురువుయొక్క కడపటి పలుకులు తెలిసినతోడనే యాగ్రామమందున్న ప్రతి సిక్కుమతస్థుఁడు గురుపీఠము దనకే హారిక్రష్ణుఁడనియు నుద్దేశించినాఁడని చెప్పి తక్కినవారితో వివాదపడఁజొచ్చెను. గ్రామమంతటఁ గలవరము బయలుదేరెను. తేజబహాదూ రప్పటికే చాల వయసుగడచినవాఁ డయినందునను, మొగటినుండియు నతఁడు లౌకికవ్యాపారములయందు విశేషముగా మనసు నిలుపక యీశ్వరభక్తితత్పరుఁ డయినందునను దక్కినసిక్కులవలెఁ దాను పీఠమాక్రమించుకొనుటకు ప్రయత్నములుసేయక నిర్మలమనస్కుఁడై యుండెను. మతమునకు గురు వేర్పడ లేదని నానాభాగములనుండు సిక్కులు విచారింపఁ జొచ్చిరి. అప్పుడు ఢిల్లీలోఁ గాఁపురముండెడు 'ముఖానుషా' యను సిక్కుఁ డొకఁడు వివాదముఁ బరిష్కరింపదలఁచి యెవరు గురువగుదురో వారికిచ్చుటకు విలువగల కానుకలను దీసికొని బయలువెడలి బకాలాగ్రామమునకుఁ బోయెను. అక్కడ సిక్కులందఱు వానిచుట్టుం జేరిరి. "పీఠాధిపత్యము నాకు రావలయును నాకు రావలయును 'బాబా బులాకా' యనఁగా నేనే నేనే" యని ప్రతిమనుష్యుఁడు తనమాటనే చెప్పుకొనసాగెను. ఆవివాదముల కంతము లేకపోవుటచే ముఖానుషా 'వెనుకటిగురువు కడపటి పలుకులు సరిగాచెప్పుడు. అవి విని నేను పరిష్కరించెద'నని పలికె నాపలుకు లప్పుడు సన్నిధానవర్తులగు మనుష్యులవలన విని యిట్లనియె. "వెనుకటిగురువుమాటల కర్థము మీకు తెలియు లేదా? బాబాబకాలా యనఁగా దన పినతాతయగు తేజబహా

దూరుఁడని వెనుకటి గురువుగారి యర్థము. కాఁబట్టి యతఁడే మనకు గురువు" అని వెంటనే తేజబహదూరునికడకుఁ బోయి మఖానుషా "నీవమాగురువని వానితోఁ జెప్పి తాను తెచ్చిన వెలలేని కానుకల వానికి సమర్పించెను. అతఁడా కానుకలను గ్రహింపక పీఠాధిపత్యము తన కక్కఱలేదనియెను. కాని మఖానుషా తన పట్టువదలక యాతని నెట్టకేల కొడంబఱచెను. అనంతరము పట్టాభిషేక మహోత్సవము మహా వైభవముతో జరిగెను. దేశమందలి సిక్కులందఱు వానిని గురువుగా నంగీకరించి కానుకలంపిరి. పూర్వగురువునకుఁ బరమ శత్రుఁడైన రామారా వప్పటికి ఢిల్లీలోనే యుండి తేజబహదూరు పీఠ మెక్కుట విని మహాదుఃఖము నొంది ధీరమాలుఁడను మిత్రుని సాయంబడసి తేజబహదూరునిమీఁద నక్కసుఁ బూనెను. అట్లుండి యొక సారి యాతఁడు మిత్రసహితముగా నొక చిన్నసేనం గూర్చుకొని తేజబహదూరుని గృహము దోఁచుకొనఁ బోయెను. కయ్యముఁ జేయుట కిష్టము సామర్థ్యముఁగూడ లేనందున గురువగు తేజబహదూరు తనయూరు విడిచి యమృతసరముఁ బాఱి పోయెను. పూర్వసిక్కులచేత స్థాపింపఁబడిన దేవాలయ మొకటి యక్కడ కలదు. ఆకోవెల యధికారులు సహితము తేజబహదూరునిపై నిష్టములేనివారై వానిని గుడి ప్రవేశింపనీయరయిరి అంతలో మఖానుషా మరల గురుదర్శనార్థము వచ్చినందున గురువు వానింజూచి యీర్ష్యచేఁ గొందఱుసిక్కులు తన్నుబాధించి దోచుకొని ప్రాణములఁదీయనుద్యుక్తులై యుండిరనియు నందుచే

దనకు స్వదేశమువిడిచి కొంతకాలము దేశాటనముఁ జేయఁ దలంపు కలిగిన దనియు నాతనితోఁజెప్ప నాతఁడును మంచిదని కొంతపరివారమును వెంటఁబెట్టుకొని గురువుం దీసికొని ఢిల్లీ నగరమునకు బోయెను.

అక్కడ రామారావు చక్రవర్తిన్ యగు నౌరంగజీబు నను్గ్రహంబునకుఁ బాత్రుఁడై యుండి గురువుమీద నేవోకొండె ములు చెప్పి యాతని మనను విరిచెను. అంతట చక్రవర్తిన్ తేజ బహదూరు తన సన్నిధికి రావలసినదని యుత్తరువువ్రాసి పంప సిద్ధముగనుండ గొందఱు కొలువుకాండ్రది యెఱింగి "నీకు గురువు మతిబోధకుఁడేకాని లౌక్యుఁడుకాఁడు. నిరపరాధి" యని విన్నవించి యప్పటి కాపదఁ దొలగించిరి. ఈయాపద గడువంబెట్టిన మహాత్ముఁడు రాజపుత్రశిఖామణియగు జయపుర మహారాజు. ఆమహారాజు తదవసరమున నాసాముదేశమునకు సేనాసమేతుఁడై చక్రవర్తిన్ పనిమీఁదఁ బోవుచు నీకుగురువును దనవెంట రమ్మని పిలిచెను. తేజబహదూరు తనకుటుంబమును పాటలీపురమున విడిచి యామహారాజతోఁ జని కొంతకాల మాసాముదేశమునఁ గొంతకాలము బంగాళమునఁ దిరిగి క్రీ॥ శ॥ 1667 వ సంవత్సర ప్రాంతమున, మరల స్వదేశమున కరిగెను. పాటలీపురమున నున్నపుడే తేజబహదూరు భార్య గురుగోవిం దను కొడుకుం గనియెను. అక్కడ నుండగా వెండియు రామా రావు ప్రేరణమున నౌరంగజబు తన్ను హాజరు కమ్మని యుత్త రువు పంపినట్లువిని తేజబహదూరు స్వగ్రామము విడిచి సట్లెజి

(శతధ్రువు) నదీ తీరమందు నొక చిన్నగ్రామము నైదువందల రూపాయలవెలకుఁ గొని యందుఁ గాపురముండెను. అతఁడా గ్రామమునకు ముఖోదేవి యని పేరుపెట్టెను. గాని యిటీవల దాని కానందపురమను నామము కలిగెను.

ఆయూరఁ గాఁపురమున్నది మొదలు తేజబహాదూరు తన పూర్వశాంతపద్ధతిని విడిచి తండ్రియగు హరిగోవిందుని వలెనే 'ఇదంబ్రాహ్మ్య మిదంక్షాత్ర' మను మాట నిజముగా బ్రహ్మజ్ఞాన సంపత్తికిఁ దోడు పౌరుషముఁ జూపఁజొచ్చెను. ప్రాపగతుఁడగు రామారావు కతమునను మాటిమాటికి వేధించు మహమ్మదీయుల కతమునను గురువు సహజశాంతమును విడువవలసివచ్చె. అటులుండ రామారాయ ప్రేరితుఁడై చక్రవర్తి మరల దన సమ్ముఖమునకు రావలసినదని యాతనికుత్తరువు పంపెను. గురువు వెళ్ళుటకు వీలులేదు. వెళ్ళకుండుటకు వీలు లేదుకదా! వెళ్ళినచో సహజముగా సీకుమతముపై నతిద్వేషము కలిగి నిరంతరము రామారావు చెప్పుకొండెముల నాలకించుటం జేసి యతిక్రోధంబుబూనియున్న చక్రవర్తి తన్నుం బ్రతుకనీయఁడని యాతఁడు స్పష్టముగ నెఱుఁగును. వెళ్ళకున్నచోఁ దొలుదొల్తనే చంపించునని యంతకుమున్నె యెఱుఁగును. కాబట్టి యాతఁడు భయపడుట బ్రతిమాలుకొనుట యనుచితములనుకొని శిష్యులం జేరఁబిలచి "మనలో కొందఱు ప్రాణత్యాగములు జేసినంగాని యీచక్రవర్తి దారుణ పరిపాలనము తుదముట్ట" దని వీరరసావిష్టుడై పలికెను. అప్పలుకులువిని దాపున

నున్న పుత్రుఁడు గోవిందసింగు తండ్రికిట్లనియె. "దేవా! అంతటి సత్కార్యమునకు దేవరవారి ప్రాణత్యాగమే వినియోగించును గాని తదన్యుల ప్రాణపరిత్యాగము కార్యకారియగునా"! అప్పలుకులు విని తేజబహాదూరు తత్క్షణమే బయలుదేఱి సపరివారంబుగ ఢిల్లీకిఁజని క్రీ॥ శ॥ 1680 వ సంవత్సరమున స్వమతసంరక్షణార్థము మహమ్మదీయ చక్రవర్తి క్రోధానలంబునకుఁ దన శరీరమాహుతిగాఁ జేసెను. గురువు దారుణమరణము నొందినను స్వల్ప కాలమునందే యామహాత్ముని శరీరత్యాగము ఫలించినదో యనునట్లు మొగలాయి చక్రవర్తుల దుష్పరిపాలన మడుగంటెను.

---

## పదియవగురువు — గురుగోవిందుడు. — బాల్యము.

తేజబహాదూరు రాజపుత్రులతోఁ గలసి యాసాముదేశములోఁ దిరుగుచు నాపదలోనున్నను దనకర్తవ్యకృత్యముల మరవక జనుల మానస క్షేత్రములు సారవంతములై యున్నవనితోఁచిన చోట్లఁ దన మతబీజముల నాటుచుఁ గృషిచేయుచుండ నాతని భార్యయగు 'గుజరీదేవి' గోవిందసింగను పుత్రునింగనియె. ఈ కుమారసింహమె పంజాబుదేశమున మతసాంఘిక రాజకీయవిషయములందు వెనుకస్థితినిఁ దల్లక్రిందుచేసి సిక్కుమతసౌధము మహమ్మదీయుల మహాద్వేషవాయువులచేఁ బడకుండ నిలిపిన శిలాస్తంభములలోఁ నొకడయ్యెను. స్వసౌఖ్యపరిత్యాగము,

కావలసివచ్చినయెడల ప్రాణత్యాగముజేసి ధర్మమార్గముల విడువని మహాపురుషులు దేశమును విపత్సముద్రమునుండి యుద్ధరింపఁ గలరని యీమహాత్ముని చరిత్రము చదివినవారందఱకుఁ దేట తెల్లమగును.

గురుగోవిందుఁడు క్రీ॥ శ॥ 1666 సంవత్సరమున నొక శనివారమురాత్రి నాలుగవజామునఁ జన్మించెను. ఆసామునకు బోవునప్పుడు తేజబహదూరు నిండుచూలాలగు భార్యను పాటలీపురమున విడిచి తనకుఁ గుమారుఁడుదయించెడు పక్షమున నాతనికి గోవిందుఁడని నామకరణముఁ జేయవలయునని యాన తిచ్చెను. నానకు జననకాలమున కానఁబడినట్లె గోవిందుని జన్మసమయమునం గూడ ననేకమహాద్భుతములు పొడగట్టెనఁట. ఆయనచరిత్రములు వ్రాసినభక్తులా మహాద్భుతములను పరమాణువును బ్రహ్మాండముగఁజేసి వానిని నమ్మి విశేషముగా వర్ణించి యుండిరి. కాని మనమాకథలను నమ్మనక్కరలేదు. నమ్మకపోయినను గోవిందసింగు చరిత్రమునందుమాత్రము గానబడునవి లోకసామాన్యములు ననన్యసాధ్యములునగు మహాకార్యములను జూచి నవనాగరికులమయిన మనముగూడ లోలో నాశ్చర్యము నందకపోము. తలిదండ్రులు దృఢశరీరులగుటచే నాతఁ డారోగ్యముగల దృఢకాయముఁగలిగి పుట్టియేపుగా బెరిఁగెను. తల్లిపాలు విడిచి తొంటిబిడ్డలతో నాడుకొన నేర్చినది మొదలు గోవిందుఁడు తన వంశమునకు ననురూపములగు తెలివితేఁటలను సుగుణసంపదను వ్యక్తము చేయసాగెను. ఆడుకొను

నప్పుడే యతఁడు తన సహకారులను రెండుకక్షులుగాఁదీర్చి పురికొల్పి యొకనితో నొకరి బోరాడించుచుండెను. ఈ కృత్రిమ యుద్ధములోఁ దఱచుగాఁ బోరాటములు తీవ్రముగానె జరుగుచు వచ్చినను గోవిందుఁడే యెల్లప్పుడు విజయము నందుచు వచ్చె. ఒకప్పుడతఁడు విల్లు బాణములు తుపాకులు లేకపోయినను స్వయముగా నట్టివిచేసికొని తోడిబాలకుల వెంటఁబెట్టుకొని వారికా యాయుధములిచ్చి యడవికిఁజని వేఁటసేయును. గోవిందుఁడు తఱచుగా నుపయోగించునది వడిసేల. అతఁడు చేతికొలఁది దానిం ద్రిప్పి రాయి విడిచెనా యా దెబ్బతగిలి యొకటి రెండు పక్షులు నేల రాలవలసినదే. వేరొకప్పుడు గోవిందుఁడు ధర్మాధిపతిగఁగూర్చుండి బాలకుల వివాదములఁ బరిష్కరించి తప్పులు చేసినవారికి దండనలు విధించి మెప్పులుగన్నవారికి బహుమానము లిచ్చుచుండును. బాల్యచాపలముచేత నాతఁడు కావించిన యా సాహసకృత్యము లప్పుడప్పుడు దుండగములగుచు వచ్చినందున యిరుగుపొరుగు వారికి బాధలు కలుగుచునచ్చెను. అతని వడిసేల దెబ్బ నెత్తినిఁబెట్టి తెచ్చుకొను నీటికడవలకు తగులుటయు నవి పగిలిపోవుటయు సంభవించుచు వచ్చినందున బొరుగువారు గోవిందుని తల్లికడకుఁబోయి జగడములాడుచు వచ్చిరి. గుజిరీదేవి కుమారునిఁ గఠినముగా మందలించి వారిం బ్రతిమాలుకొని పంపుచుండును. గోవిందుఁడు భీతియనుమాట నెఱుఁగని ధైర్యశాలి. అతని ధైర్యమెట్టిదో తెలుపుటకొక చిన్నకథగలదు. అతఁడొకనాఁడు సంగడికాండ్రంగలిసి యాడు

కొనుచుండ నక్కడికిఁ బాటలీపురమేలు ప్రభువు వచ్చెను. ఆ ప్రభువు సేవకులు మునుముందు పరుగుపరుగునవచ్చి బాలకులతో నిట్లనిరి. "ప్రభువుగారు వచ్చుచున్నారు. అందఱు సలాములు సేయుఁడు." అప్పలుకులువిని గోవిందుఁడు "వద్దువద్దు వెక్కిరించుఁడు వెక్కిరించుఁడని యానతిచ్చెను. యుక్తాయుక్త మెఱుఁగని బాలకులందఱు తత్క్షణమే వాని యాజ్ఞాప్రకారము జేసిరి. ఆప్రభువు తనయెడల నంత బండతనముజూపిన యాబురులనేమిసేయనగునని యోచించుచుండగనే నిమేషకాలములో వారందఱు నానాభాగములకు బరుగెత్తిరి. చిన్నపిల్ల లేకాలమందైనఁ జిన్నపిల్లలేకదా! ఔచిత్యము వయసు వచ్చినకొలది హెచ్చును. ఎవని గుణాగుణంబులను కాని బాల్యక్రీడలంబట్టి మనము నిర్ణయింపరాదు. విద్యాబుద్ధు లబ్బినపిదప మనుష్యుని నడత యిట్టిదని నిర్ణయింపనగును.

---

## వి వా హ ము.

గోవిందసింగున కేఁడవయేటనే వివాహమయ్యెను. ఈ వివాహమునకు తేజబహదూరు తనరాఁబడికి మించిన సొమ్ము వ్యయముచేసి యతివైభవముగా జరిపెను. గోవిందునిమామ క్షత్రియుఁడు. ఆయనపేరు హరజీమల్లుఁడు. పెండ్లికూఁతురు పేరు జేతు. వివాహము వేదమంత్ర పఠనపూర్వకముగా బ్రాహ్మణులచేతనే చేయింపఁబడెను. ఇది యతిబాల్య వివాహము. పెండ్లికుమారునకే యేఁడేండ్ల వయసున్నప్పుడు పెండ్లికుమార్తె

నాలుగేండ్లదో, యైదేండ్లదో యయి యుండునుగదా! అందు చేత నీవివాహము బొమ్మలపెండ్లియని భావింపనగును. కాని నిజ మయినపెండ్లిగా భావింపఁగూడదు. అనేకవిషయములలో సంస్తవ నీయములగు మార్పులు చేసిన సిక్కుగురువులు బాల్యవివాహ దురాచారమునేల యడుగంట ద్రొక్కలేదో తెలియకున్నది. ఈ దురాచార పిశాచమిప్పటికి మనదేశమున స్థిరముగ నిలిచి యుండి దేశమునకు మితిమీఱిన నష్టమును జేయుచున్నది. ఇది యడుగంటిననే గాని దేశము మంచిస్థితిలోనికి రానేరదు. గోవింద సింగు కాలక్రమమున మఱియిద్దరు కాంతలఁ బెండ్లియాడెను. అందొకరుక పేరు సుందరీదేవి. రెండవయామె పేరు దేవిజీ. ఈ యాచారము పూర్వకాలము విశేషముగాను, నేఁటికాలమున విరళముగాను గానఁబడుచున్నది. ఉత్తరదేశమున నీయాచారము ప్రబలముగా నుండెను. సంపన్నులగువారు మదోన్మత్తులయి తఱుచుగా ననేకభార్యలఁ బరిగ్రహింపుచు వచ్చిరి. బంగాళా దేశమున నీ దురాచారము మొన్నటివఱకు—మొన్నటివఱకననేల కొన్నితావుల నేటివఱకుఁ జరుగుచున్నది. నాగరికులైన పురుషు లందఱు దీనిగర్హింపవలసినదే. గోవిందుఁడు తననాటి యాచార మునుఁబట్టి యది దోషముకాదని యట్లాచరించియుండవచ్చును.

---

## విద్యాభ్యాసము.

తేజబహదూరు తనకుమారుని విద్యాభ్యాసమునుగురించి హెచ్చు శ్రద్ధచేసెను. గోవిందుఁడు కుశాగ్రబుద్ధియై యద్భుత

మగు జ్ఞాపకశక్తికలవాఁడయ్యెను. అది కనిపెట్టి తండ్రి యాకాలమున నేర్పఁదగిన విద్యయంతయుఁ గొడుకునకు నేర్పఁదగిన విద్యయంతయుఁ గొడుకునకు నేర్పింపవలయునని సంకల్పించెను. ఆ కాలములో సీకుమతాచార్యుఁడు కావలసిన పురుషుఁడు మంచి పాండిత్యము, బాహుబలముఁగలవాఁడు కాక తప్పదు. ఏలయన నొకప్రక్క సీకుమత ద్వేషులయిన మహమ్మదీయుల దుండగములు నానాఁటికిఁ బ్రబలుచుండెను. ఒకప్రక్క నెన్నటికి నారక జ్ఞాతివైరమహాగ్ని రవులుచుండెను. తేజబహదూరుని మహోన్నతపదవి రామారావునకు, రామారావు పినతండ్రియగు ధీరమాలునకును హృదయవ్రణమయి యుండుటంజేసి వాగిరువురు తేకబహదూర నంతరమందు వానికొడుకును నెమ్మదిగా బీఠమెక్కనీయరను మాట సిద్ధాంతమే అందుచేతనే తేజబహదూరు కుమారున కాత్మసంరక్షణ సాధకములయిన శస్త్రవిద్యలను మతాచార్యత్వమునకుఁ గావలసిన దేశభాషాగీర్వాణభాషలను నేర్పించుటతోఁ దనివినొందక తమమీఁద విరోధులు చెప్పెడు కొండెములకుఁ, బన్నెడు కుతంత్రములకు స్వయముగ బోయి చక్రవర్తులతో మాట్లాడి ప్రతిక్రియలు నెఱపుటకు వీలుగా నుండునని రాజభాషలగు నరబ్బీ ఫారసీలనుఁగూడ నాతనికిఁ జెప్పించెను. గోవిందునియందు గ్రహణశక్తి ధారణశక్తి యద్భుతముగా నుండినందున నతఁడచిరకాలములోనే యారెండు భాషలలోఁ బండితుఁడయి కవిత్వముఁ జెప్పఁజొచ్చెను. ఆతఁడు కాలాంతరమందు చక్రవర్తియగు నౌరంగజేబునకుఁ బద్యరూపకముగ వ్రాసిన పారిషీ జాబులంబట్టిచూడ నతనికిఁ గవిత్వమెంత

వశవర్తియై యుండునో తేటపడును. గోవిందుఁడు పదునెనిమి దేండ్ల ప్రాయమువాఁడయినప్పుడు పితృమరణమహాపద సంభవించినందున నతఁడు విద్యాభ్యాసము ముగించి పీఠాధిపత్యమును వహింప వలసినవాఁడయ్యెను.

---

## పితృమరణము.

గురుగోవిందుని పితృమరణము మిగుల దారుణమైనది. ఆపదలుఁగూడ నొకప్పుడు ప్రయోజనకారులగునని పెద్దలు చెప్పుమాట యీతని చరిత్రమువలనఁ గొంతవఱకు సత్యమని తోఁచుచున్నది. ఏలయన తేజబహదూరు దుర్మరణము సీకులకు రోసముఁ దల కెక్కించి వారిం బౌరుషవంతులఁజేసి సీకుమతము నిల్చుటకుఁ గారణమై మహమ్మదీయ రాజ్యవిధ్వంసమునకుఁ బ్రధానహేతువులలో నొకటియయ్యెను.

అప్పటిఢిల్లీచక్రవర్తియగు నౌరంగజీబు తనబిడ్డలం దక్కఁ దక్కిన కుటుంబమంతయు నిర్మూలముచేసి గద్దెయెక్కి తాను చేసిన పాపములకు భగవత్ప్రీత్యర్థమయిన ప్రాయశ్చిత్తమో యనునట్లు గాఢమయిన స్వమతాసక్తికలిగి హిందువులమీఁద హింసామతముమీఁద నిష్ఠములేనివాఁడై సాధారణముగ గొప్పయుద్యోగములన్నియు మహమ్మదీయులకే యిచ్చుచు హిందువులకు మనోవ్యథ కలుగునట్లుఁ బ్రవర్తింపఁ దొడఁగెను. అందుచేత

పూర్వచక్రవర్తులగు అక్బరు, జహాంగీరు, షాజహానులమీఁద నున్నంతభక్తివిశ్వాసములు హిందువుల కౌరంగజీబుమీఁద నుండ వయ్యె. స్వమతావేశము ప్రబలముగుటచే నీచక్రవర్తి క్రీ॥ శ॥ 1680 సంవత్సరమునఁ దనయధికారము మహోన్నతదశలోనున్నపుడు కాశ్మీరదేశబ్రాహ్మణులను మహమ్మదీయమతములో గలియవలసినదని బలవంతపెట్టెను. ఆబ్రాహ్మణులు సిక్కుగురువగు తేజబహదూరు కలసినపక్షమున దాముగూడ కలియుట కొడంబడిరి. ఆవిప్రులిట్లనుటకుఁ దగినంత కారణము కనఁబడదు. ఏలయన తేజబహదూరుబ్రాహ్మణులకుగురువుకాఁడు. మీఁదమిక్కిలి బ్రాహ్మణుల మతాచారములకు విరుద్ధములైన కొన్నివిషయములను నానకు మొదలుకొని సిక్కుగురువు లుపదేశించుటంజేసి బ్రాహ్మణులకు వారొక విధముగా ననిష్టులైయుండిరి. చక్కఁగా విచారింపగా బ్రాహ్మణులాతెఱంగున బలుకుట కొక్కకారణము కలదు. తేజబహదూరు తురకయగుట కొడంబడఁడని వారెఱుంగుదురు. అతని తరువాత తాము మ్లేచ్ఛమతస్వీకారముఁ జేయ నొడంబడిరి; కావున నది యెన్నఁడు జరుగదని వారికి నమ్మకముగలదు. విశేషించి తురకలకు సిక్కులకు మహాయుద్ధములు జరిగిన జరుగవచ్చును. ఆపోరాటముల సందడిలో నౌరంగజీబు బ్రాహ్మణులమాట మరచిపోవచ్చును. అదియునుంగాక యుద్ధములో సిక్కులచేత దురకలు నశించినను దురకలచేత సిక్కులు నశించినను వారుభయులుఁ గొంచెము హెచ్చు తగ్గుగాఁ దమ మతమునకు విరుద్ధవర్తనులే యగుటచేత నెట్లైనను బ్రాహ్మణు

లకు సంతోషమే. ఈకపటభావములో నిలుపుకొని బ్రాహ్మ ణులా తెలుంగునఁ జక్రవర్తితోఁ జెప్పియుందురు. చక్రవర్తియు వారిమాటలు సత్యములుకావగచి తత్క్షణము ఢిల్లీకిరమ్మని తేజ బహదూరున కుత్తరువంపెను. అంతలోఁ గొందఱు కాశ్మీర బ్రాహ్మణులు తేజబహదూరు దర్శనముఁజేసి తమయాపద నివా రణ సేయుమని ప్రార్థించిరి. అప్పుడు తేజబదూరు విపన్నివార ణార్థము ప్రాణత్యాగ మావశ్యకమన్నట్లు, కుమారుఁడగు గోవిందుఁడప్పుడు సన్నిధినుండి ప్రాణపరిత్యాగము సేయుమని తండ్రింబురికొల్పినట్లు వెనుక వ్రాసియుంటిని.

రోసమెక్కించునట్టి కొడుకుపలుకులువిని గురువు "భగ వత్సంకల్పము జరుగుగాక" యని ఢిల్లీలోఁ దనకు విరోధులు ప్రబలురై యుండుటచేత దననాశన మనివార్యమని యెఱింగి గోవిందును గురుపదమున నియోగించి ప్రయాణోన్ముఖుఁడై కుమారు నుద్దేశించి యిట్లనియె. "నేను భగవంతుని సంకల్పము నెరవేర్పఁదలఁచి ధర్మమునిమిత్తము నాప్రాణముల విడువ నుద్యు క్తుఁడనై ఢిల్లీకిఁ బోవుచున్నాను. మరణానంతరము నాశరీరమున కవమానము గలుగకుండ నీవుదానికి యథావిధిగ నగ్నిసంస్కా రముఁ జేసి నన్నుఁ జంపువారిమీఁద తప్పక పగదీర్చుకొందువేని నాయాత్మ సంతుష్టిఁజెందు. హిందూమతముయొక్క పక్షము నవలంభించెడు భారముగూడ నీకే విడుచుచున్నాను. నీ ప్రాణ ములు పోయినను సరే మతధర్మముమాత్ర మెన్నడు విడువవద్దు" చైతన్యములేని పదార్థములకైన శౌర్యమును గొలుపు నావీరా

లాపములవిని గురుగోవిందుఁడు తండ్రిపలుకుల కిట్లని ప్రత్యుత్తర మిచ్చెను.

"ఏయాపద వచ్చిన రానిండు. ఏమైనఁగానిండు. నేను మీయాజ్ఞాప్రకారము స్వదేశమునిమిత్తము నారక్తము ధార వోయవలసివచ్చినను మది నేసందేహములేక నట్లు చేయుదు" కొడుకటు ప్రతిజ్ఞఁ జేసినతోడనే తేజబహదూరు సంతుష్టహృదయుఁడై ఢిల్లీకిఁ బోయెను. ఔరంగజేబు గురువును గౌరవించినట్లభినయించి మహమ్మదీయమతము నవలంబింప వలసినదని కోరెను. తేజబహదూరు నిర్భయముగా వానికోరిక నిరాకరించెను. అనంతరము చక్రవర్తి యాతనిని మెత్తనిపలుకులతో లాలించి కొంతసేపు గొప్పబహుమానము నిచ్చునట్లు వాగ్దానముచేసి కొంతసేపు స్వమత స్వీకారముఁ జేయుమని యడిగెను. కాని గురు వెంతమాత్రము లొంగనందున నౌరంగజేబు కాఠిన్యము వహించి "నీవు మహమ్మదీయమతము ను స్వీకరించినను సరే లేక నీ మతమే సర్వోత్తమమైన పక్షమున నీవాదము బలపఱచుట కేవియైన మహాద్భుతములు చేసినను సరే. ఈ రెంటిలో నేదోయొకటి చేయువేని మరణమునకు సిద్ధముక" మ్మని పలికెను. గురువు చక్రవర్తితో వాదముచేసి యాతని మనోనిశ్చితము మార్పఁదలఁచెను గాని యది వ్యర్థమయ్యె. ఔరంగజేబు తేజబహదూరునకుఁ బదునైదుదినములు గడుపిచ్చియాగడువు లోపల నేదోయొక పనిఁజేయవలయునని చెప్పి యాదినములలోనైన నాతని స్వేచ్ఛగా నుండనీయక చెరలోఁ బెట్టించెను. ఆయన చెరకు మిక్కిలి సంతోషముతో దైవముమీఁద భారమువేసి

వెళ్ళి యాగడవుకాలమంతయు నీశ్వరధ్యాన సంకీర్తనములతో గడపెను. పదునైదు దినములు ముగిసినతోడనే చక్రవర్తి యాతని దన సన్నిధికిఁ బిలిపించి మహమ్మదీయమత మంగీకరింతువా యద్భుతమేదేనిఁ జేయుదువాయని యడుగ నాత డేదియుంజేయ ననియె. అదివిని చక్రవర్తి తనక్రోధము ప్రశాంతిఁజెంద చిర కాలమునుండి తేజబహదూరు నాశనమునకై యెడతెగక పాటు పడుచున్న రామారావు కన్నులు చల్లబడ నీకుమతస్థులు శోక సముద్రమున నామహాత్మునకు మరణదండన విధించెను. చక్ర వర్తియాజ్ఞ నెరవేర్చుటకు ఖడ్గము చేతపట్టుకొని హంతకుఁడు వచ్చినప్పుడు తేజబహదూరు వాని సంకల్పమెరిఁగి తలయొగ్గి భగవత్పాదారవిందముల మనస్సున నిలిపి తన్మయుఁడై క్షణ ములో నాన్నృహింసకుని కత్తివేటునఁ దనస్సృష్టికర్త సాన్నిధ్య మును జెందును. ఈమహాత్మునకు మరణమెంత తృణప్రాయమో కదా! దేశాభిమానులకు మతాభిమానులకు నీతిమంతులకు మరణము జనసామాన్యమునకుంబలె దుఃఖావహము గాక సౌఖ్యావహము. గృహము, కారాగృహముఁగూడ వారికి సమా నమే. వారు మృతినొందియు జీవించినవారే.

---

## ఇద్దరు మహాభక్తులు.

తండ్రి శిరశ్ఛేదమగునప్పటికి గురుగోవిందుఁడు ఢిల్లీ కై దుక్రోసుల దూరమున నొక యడవిలో విడిసియుండినందున

నీఘోరవార్త జరిగిన కొలఁదిసేపటికే కొందరు భక్తుల వలన నాయనకు తెలిసెను. దారుణమయిన యాపితృమరణము గురుగోవిందును దుఃఖపూరితునిం జేసెను. అయిన నది దుఃఖమునకు నుదాసీనతకు సమయము కాదుగదా! తేజబహాదూరు మరణానంతరము తన శరీరమును తురకల యధీనమునుండి తెచ్చి దానికి యథావిధిగా నగ్నిసంస్కారముఁ జేయవలసినదని కుమారుని కాజ్ఞాపించినందున నాయాజ్ఞ వెంటనే జరుగవలసియుండెను. కాని యాయనకళేబరము సంపాదించుట దుస్సాధ్యము. చక్రవర్తి యాగ్రహము తేజబహాదూరు చచ్చినను దీరలేదు. కావున నాయనశరీరమును సిక్కుల కియ్యకూడదనియు జచ్చిన చోటనే యది కుళ్ళిపోవలయుననియు నాప్రభువు శాసించెను. ఏలయన హిందూమతమునుబట్టిచూడగా నాతఁడు వర్ణభ్రష్టుఁడు కావున నగ్నిసంస్కారమునకుఁ దగడట. మహమ్మదీయ మతమునుబట్టి చూడఁగా నతఁడందు విశ్వాసము లేనివాఁడు కావున పూడ్చిపెట్టబడుట కనర్హుఁడట. కావున మొదట నెక్కడ తల నరకబడెనో యచ్చటనే యాకళేబరము పడియుండెను. దరికెవ్వరు రాకుండ చెరసాలతలుపులు మూయబడెను. కావలివాండ్రు పరులనెవ్వరిని రానియ్యక వేయికన్నులఁ గాచుచుండిరి కొంతమందిని కూడగట్టుకొని కావలివాండ్రతోఁ బోరి చెరసాల తలుపుల బలిమిందెరచి కళేబరముందెచ్చుట యసాధ్యము. అందుచేత నేగడబిడయు లేకుండ రహస్యమున గురుకళేబరము నవ్వలకు దాటించుట కర్తవ్యమని గురుగోవిందుఁడు దక్కిన

సీకులుఁ దలంచిరి. అట్టికార్యము సాధించువా రెవ్వరని గోవిం
దుఁడు తలపోయుచుండ తండ్రికొడుకులు రంగిరీతవంశస్థులునగు
నిద్దరు సీకులు గురుసన్నిధికిఁ బోయి పవిత్రమైన యమ్మహా
కార్యము సాధించుభారము తమపయిఁ బెట్టుమని వినయమున
నతనిం బ్రార్థించిరి. అదివిని గోవిందుఁ డొక్కనిముసమాలో
చించి "సరే పోయిరండు యీకార్యమున కీశ్వరుఁడు దోడు
పడుగాక" యని పలికెను. ఈమహోపకారము తనకుంజేసినం
దుకు రంగిరీతులు కృతజ్ఞులై మహాభక్తితో గురువునకు నమస్క
రించి యాశీర్వచనముల వడిసిపోయిరి. ఏవిధముగా నాకళేబర
మును నీవలకు తీసుకొని రావలయునో యావిధము నించుకయు
వారువిచారింపలేదు. ఇది సత్కార్యముకదా యీశ్వరుఁ డీపనికి
దోడు పడకపోవునా యనుధైర్యమునసే వారు బయలుదేరిరి.
బయలుదేరి సగముదూరము వచ్చునప్పటికి వారికి గుఱ్ఱపుబండి
దోలు మనుష్యుఁడొక డగపడెను. అతనితో నించుక మాట
లాడునప్పటి కతఁడు పంజాబుదేశస్థుఁడనియు ఢిల్లిలో నొకగొప్ప
యుద్యోగస్థునకు బండిదోలువాఁడనియు విశేషించి సీకుగురువుల
సిద్ధాంతములందు గాఢమయిన నమ్మికగలవాడనియు గురుకార్య
ము నేబాములైనంబడి సాధింప నిచ్ఛగలవాఁడనియుఁ దెలిసెను.
అంతట రంగిరీతులు తమ మనోరథమును వానికెరింగించిరి. ఎరిం
గించుటయు నతఁడు పరమానందభరితుఁడై గురువుకళేబరము
పడియున్న తావునకుఁ బోవుటకుఁ గావలసినన్ని యుపాయములు
గుర్తులు జెప్పుటయేగాక కళేబర మీవలకు వచ్చినతోడనే దానిం

దన బండిమీఁద బెట్టుకొని యెవ్వరి కనుమానముఁ జనింపకుండ వారు కోరిన ప్రదేశమునకుఁ దీసికొనిపోవుటకు దోడ్పడునట్లు వాగ్దానము జేసెను. రంగిరీతు లాతనిపలుకులు విని మహానంద భరితులయిరి. ఏలయన గురుకళేబరము తీసికొనిపోవుట కట్టి శకటము దొరకుట మిక్కిలి యదృష్టము. ఏమన నతడు సిక్కుల భక్తుడు అతఁడు బండిదోలునేని నెవ్వరికి ననుమానము పుట్టదు. పట్టణమందలి తలారులు వానికిం జిరపరిచితులు. అర్ధరాత్రమందు నపరరాత్రమందు నతఁడు తనయజమానునకు బండిఁదోలగా వారు చాలసారులుచూచినవారు కావున, నేవేళ బండిఁదోలినను దానిని శోధింపరు. మరియుఁబట్టణమందలిసందులుగొందులు మారుమూలలు నెరిగినవాఁడగుటచే నతఁడు నిరపాయములగు మార్గముల బండిదోలుకొనిపోయి గమ్యస్థానమునుజేర్పగలడు. ఇట్టి యాసల నెన్నో మనంబునం బెట్టుకొని యయ్యిరువురు వానితో మాట లాడుచు బట్టణముజేరిరి. రంగిరీతు లెట్లెటో కష్టపడి గురు కళేబరమును దెచ్చునట్లును దానిం దెచ్చువరకు బండివాడు చెరసాలకు సమీపమున నొకసందులో బండికట్టుకొని సిద్ధముగా నుండునట్లును కళేబరము బండిలోఁ బడినతోడనే మువ్వురు బయలుదేరి పోవునట్లును వారేర్పాటుఁ జేసికొనిరి. ఆయేర్పాటును బట్టి బండివాడు తానెక్కడ బండి నిలిపి కనిపెట్టుకొని యుండవలెనో యాస్థానమును గురుకళేబరమున్న నెలవును వారికి జూపెను. ఢిల్లీపట్టనము చూడఁదగిన మహానగరమైన మన రంగిరీతుల మనస్సులు పురసౌందర్యముమీఁదికిఁ బోక యే

గోడదాటిన బాగుండు, నితరుల కనుమానముఁ జనింపకుండ నేమూలనుండి యెక్కవలయు నేప్రక్కనుండి కళేబరము దింపుటకు వీలగునను యోజనలతో నిండియుండెను. అట్లు తలఁచుచు రెండుజాముల రాత్రి గడచువఱకు వారు చెఱసాల కెదురుగా నొకమూల నక్కియుండిరి. అంతటఁ జంద్రాస్తమయమయ్యెను. అగుటయు వారు చెఱసాల వెనుకప్రక్కనుండి మెల్లఁగగోడమీఁదికెగఁ బ్రాకఁజొచ్చిరి. పడుచువాడగుటచేఁ గొడుకు గోడ నవలీలగ నెక్కెను. వృద్ధుఁడుకావున తండ్రి దిగజారెను. కుమారుఁడంతట లోపలనుఱికి యొక దొడ్డిగుమ్మము తలుపు తెఱవ జనకుఁడుగూడ లోపల ప్రవేశించెను. అంత నయ్యిరువురు బండివాఁడు తమకిచ్చిన చిన్నదీపపు వెలుతురున బలుతావులు వెదకి యెట్టకేలకు గురుకళేబరమును గనిపెట్టిరి. దుర్వాసనతోఁగూడి ధూళిధూసరితమైన యాకళేబరమును జూచి రంగిరీతులు పట్టరాని దుఃఖమునఁ బరవశులై కొంతసేపు వగచి గురుపాదములకు నమస్కరించి కన్నుల నద్దుకొని దీవనలిమ్మని యాయన యాత్మను బ్రార్థించి కావలివాండ్రు మేలుకొన్న పక్షమున దమకార్యము భగ్నమగునని సత్వరమే పనికిం దొరఁకొనిరి. ఆకళేబర మెత్తబోవ వారి మనసున నొక్క తలంపు బాఱెను. ఆశరీరము నెత్తుకొని పోవుటలో గష్టములేదు. కాని కావలివాండ్రు మేలుకొన్న వెనుక కళేబరము లేకపోవుటచే ననుమానపడరా? పడి నలుదెసలకు బంట్లం బంపరా? బండి రాజభటుల కందక పోయినను వారు గురుకళేబర మెక్కడనున్నదో శోధించి

తెలుసుకొని పూర్తిగ తగులబడకముందె దానిం బట్టుకొని
రెట్టించిన కోపముచేత జరపవలసిన యవమానమును జరపరా?
ఒకవేళ పట్టియిబ్బంది తటస్థింపక నిరాటంకముగా నగ్నిసంస్కార
మైనను, ఔరంగజేబు సీకులే యీసాహస కార్యమును జేసిరని
తెలిసికొనకపోవునా? తెలిసికొని గురుభక్తులను కుమారుని నానా
హింసల పాలుసేయకపోవునా? అనుతలంపులు మనస్సులందు
మల్లడిగొన నయ్యిరువురుఁ జక్రవర్తి కెంతమాత్రము నవమా
నము పొడమకుండునట్లు సీకులకు నిరపాయ మగునట్లు గళేబరము
గొంపోవుట యుచితమని నిశ్చయించిరి. దాని కొక్కటే యుపా
యముగలదు. అది యేదన గురుకళేబరమునుదీసి దానిస్థానమున
మఱియొకశవము నక్కడ బెట్టుటయే యని వారనుకొనిరి. అను
కొనుటయే తడవుగఁ గుమారుఁడు భక్తితత్పరుఁడై మొగమం
తయు నుత్సాహమున జేవురింప "నన్నుజంపి యిక్కడ పడ
వేయు" మని తండ్రితోఁ బలికి తలయొగ్గెను. ఒగ్గినతోడనే
కొడుకు తల ద్రెవ్వనేయక తండ్రి యాతని శిరస్సుపై హస్తము
వేసి యాశీర్వదించి "బిడ్డా నీవు కావు గురువు ననుసరింపదగిన
వాడను నేను నిలు నిలు" మని వారించి తనశిరస్సు ఖండింపు
మని కొడుకు నెన్నోవిధముల బ్రతిమాలెను. కుమారుఁ డావని
జేయుట కొప్పుకొనఁడయ్యె. అందుచేత గురుకార్యార్థము మృతి
నొందు గౌరవముసంపాదించు విషయమునఁ దండ్రికొడుకుల
కప్పుడు వివాదము కలిగెను. పుత్రస్నేహమున దండ్రి కొడుకుం
జంపనొల్లడు. పితృభక్తిచే కొడుకు తండ్రి జంపనొల్లఁడు. ఇరు

వుర హృదయముల గురుభక్తి యతిశయముగ నెలకొని యుండు టచే "నేనుబోవుటమంచిది నేనుబోవుటమంచి" దని తగవు లాడిరి. కొంతతడవట్లు వాదమైనపిదప తండ్రియిట్లనియె. "నీవు నాకంటె బలముగలవాఁడవు. నేను పోయినను నీ వీ కార్యము నెక్కువసులభముగాఁ జేయగలవు. మఱియు నేను గురువుతో సమానవయస్కుఁడను. నాకళేబర మిక్కడ పడియుండెనా యది గురువుదేయని భ్రమపడి యనుమానపడరు. ముసలిశరీరమునకు బదులు ముసలిశరీరమే యుండవలయును గాని పడుచుశరీర ముండుట యనుమానమునకు హేతువు" అనవుడు తండ్రి యుక్తులు, ముఖ్యముగానందలి చివరపలుకులు కార్యసాధనమే ప్రధానముగాఁగల కుమారునకు నచ్చెను. నచ్చుటయు నతఁడే మియుఁ బలుకక యూరకుండెను. అంతట వృద్ధుఁడు నఱుకు మని తనతలయొగ్గెను. కుమారుఁడు చేయునది తోఁచక వెఱ్ఱి వెఱ్ఱిచూపులఁ జూడసాగెను. తండ్రిశిరస్సు ఖండించుటకు వాని చేతు లాడవయ్యె. కుమారుని మనస్సు కరఁగిపోవుట దెలిసి కొని వృద్ధుఁడు భగవంతునిఁ బ్రార్థించి ఖడ్గము చేతఁబూని యొక్కపెట్టున తనతలఁదానే నఱుకుకొనెను. ఆదెబ్బతోఁదల తెగి నేలఁబడెను. అంతటఁ గుమారుఁడు తండ్రినిమిత్తము కన్నీరు విడిచి పితృపాదములకుఁ బ్రణామముఁజేసి ముద్దుపెట్టుకొని గురు కళేబరము నెత్తుకొని యాయమూల్యపదార్థమును బండిలోఁ బడవేసెను. అనంతరము పట్టణము దాఁటువఱకు బండి మెల్ల మెల్లగ నడచి యవ్వల వేగమునబోయి గమ్యస్థానమును జేరెను.

కావలివాండ్రుకాని చక్రవర్తికాని యెన్నటికా రహస్యమును దెలిసికొనఁజాలరైరి. అహాహా! వృద్ధరంగిరీతునియొక్కయుఁ బడుచురంగిరీతునియొక్కయు భక్తి, కార్యనిర్వాహణాశక్తి, ప్రాణములయందలి నిరపేక్ష తనకుండవలయునని యేమనుష్యుఁడు కోరఁడు.

---

## మనోనిర్ధారణ.

జనకుని ధైర్యము, కార్యశూరత బాలుఁడగు గురుగోవిందుని మెత్తని మనసుమీఁద నాఁటుకొని యాతని కధికోత్సాహముఁ గలిగించెను. ఆయుత్సాహమునందు గురుగోవిందుఁడిట్లుపలికెనఁట. ఇవ్విధంబున ధర్మసంరక్షణార్థ మాత్మబలియిచ్చిన మహాత్ముఁడు, ప్రాణమిచ్చి, యిచ్చినందుకు విచారింపఁడు. మతమునిమిత్తము ప్రాణత్యాగముఁజేసిన మహాయోగి, శిరస్సును బాసినేకాని తన మనోనిశ్చయమును బాయలేదు. తేజబహాదూరు స్వమతరక్షణార్థము ప్రాణములు విడువ ఢిల్లీకి బయలుదేఱినది మొదలు గురుగోవిందుఁడు భవిష్యత్కాలమునఁ దాను చేయవలసినకార్య మేదో యదిచక్కఁగా గుర్తెఱిఁగియుండెను. ఆకార్యమేమనఁ జిరకాలమునుండి యన్యమతస్థులచేత నణగద్రొక్కబడియున్న హిందువుల నుద్ధరించి తన్మతమును గాపాడి వారికి జరుగు పరాభవంబులకుఁ దగిన ప్రతీకారముల వీలగునపుడెల్లఁ జేయుట పితృపరాభవము నిమిత్తము మహమ్మదీయుల

మీఁద పగదీర్చుకొనుట యాయన ముఖ్యోద్దేశమైనను గురుగోవిందుఁడు కేవలము తనపంతమే నెగ్గించుకొనుటకు చూడక యార్యమతము నిమిత్తము హిందూజాతి నిమిత్తముఁ దననెత్తురు ధారవోయఁదలంచెను. కాని మహమ్మదీయుల యధికారము దేశమునందు సర్వవ్యాప్తమై దుర్నిరీక్ష్యమై యుండుటచే నది యసాధ్యమని యతఁడెఱుంగును. తురకసేనలు తెఱపిలేని సముద్ర తరంగము లనియు నతఁడెఱుంగును. హిందూరాజులు లేశమైన సిగ్గుఁగాని యాత్మగౌరవముగాని లేక మతాచారములకు విరుద్ధ పద్ధతుల నవలంబించి విదేశీయులగు మ్లేచ్ఛులకే సాయమై వత్తురనియు నతఁ డెఱుంగును. సామాన్యులగు హిందూజనులు మతముకొఱకుగాని మతసంస్కర్తయగు తనకొఱకుగాని యించుకయు విచారింపరనియు వారికేగొడవ లక్కఱలేదనియు నెఱుంగును. అంత ఢిల్లీశ్వరునితోఁ బగసాధింపఁదలంచిన తాను మొగలాయి రాజ్యమందున్న చిన్నజమీందారునైన నెదురించుపాటి ధనముగాని బలముగాని లేని బాలుఁడనుమాట మఱియు ననేక విషయముల నతఁడు బాగుగ నెఱుంగును. ఎఱిఁగియు నొక పాచికవేసి చూడవలయునని సంకల్పించెను. రాజకీయవ్యవహారములలోఁగాని సాంఘికసంస్కరణములలోఁగాని మతవిషయికములగు మార్పులలోఁగాని చొరబడి పోరాడఁదలఁచునతఁడు దానికిందగు ప్రయత్నముల ముందుచేసి స్వబలపరబలంబుల గణియించి నేర్పుతో మెలగవలయుకాని తొందఱపడగూడదుగదా! అట్లు చేయు నతఁడు తనకుగల బుద్ధియు బలంబును నొక్కచోఁ జేర్చి పోరు గడపినచో గృతకృత్యుండగును. ఈసాధకబాధకములను

స్థిమితముగ విచారించి తన యాలోచనలను జక్కఁగాఁ బొదుగుటకు గురుగోవిందుఁడు మఖోవాలను నామాంతరముగల యానందపురమున వసియింపఁబోయెను. అప్పటి కాయనను సీకులందఱు తేజబహదూరుని వారసునిగా దమకుం బరమగురువుగా నంగీకరించిరి. అంగీకరించినను గురువునకు దేశమం దుండవలసినంత పలుకుబడియు బలమును నుఁడవయ్యె. యుద్ధములలో యోధులకు బ్రతియోధు లుండవలయు నట్టియోధులను సంపాదించుటకు కొండలనడుమనున్న యానందపురమున నివసించుట గురువునకుఁ బ్రయోజనకారియే యయ్యెను. ఏలయన నచట నుండఁగా శూరులనేకులు కాలక్రమమున నాయనచుట్టుం జేరిరి. అందుచేత క్రమక్రమంబున దనపక్షము బలపడుననియు గార్యసాధక మగుననియు నతఁడాశపడఁజొచ్చెను. ప్రపంచముతో విశేషసంబంధములేని మాఱుమూల కొండలలో నతఁడున్నను గురుగోవిందుని యానాటిజీవిత మాయనకు విసువు పుట్టింపలేదు. ఏమన గురుగోవిందుఁడు నిరంతర మొక్క యీశ్వరధ్యానములోనే కాలక్షేపము సేయలేదు. శిష్యులకు గేవలము మతబోధయే సేయుచు ప్రొద్దుగడపలేదు. ఎల్లయప్పు డనుచరులనే సంపాదించుటకు బ్రయత్నములు చేయలేదు. ఇందేపని ప్రత్యేకముగా నొనర్చినను విసువుపుట్టించునని యతఁడా మూఁడు పనులంగూడ నప్పుడప్పుడు సేయుచు వచ్చెను. ధ్యానము వలసినప్పుడు ధ్యానము చేసికొనును. తన దేశస్థుల పునర్జీవనము సేయుమార్గంబుల నెడనెడఁ దలపోయుచుండును. భక్తితో విన దలంచు శిష్యులకు నానకునియొక్క మతసిద్ధాంతములను విగ్రహా

రాధనముం దిరస్కరించి పరమేశ్వరారాధనమును స్థిరపరచు తన సిద్ధాంతముల నెడనెడ బోధించుచుండును. కత్తిఁగట్టి మహమ్మదీయులతోఁ బోరనోపిన వీరు లగపడినప్పుడు స్వసైన్యమునఁ జేర్చుచుండును. ఇన్నిఁటిని జరుపుచు గురుగోవిందుఁడు చిన్ననాట నుండియుఁ దనకభిమానక్రీడయైన వేఁటలోఁగొంత ప్రొద్దుపుచ్చుచు వినోదించుచుండును. గుఱ్ఱపుసవారుఁ జేయుటలో నతఁ డాకాలమం దసమానుఁడు. అతని లాయమునందు శ్రేష్ఠజాతి గుఱ్ఱములనేకములుండునవి. వేఁటసేయునపుడు పులులు సింగములు మొదలగు ఘోరసత్త్వములతో నతఁడు కలియఁబడి పోరాడి యెట్టకేలకు వానిం జంపుచు వచ్చెను. ఇన్నివిధములుగ వేలువేలు కృత్యములందగిలియున్నను గురుగోవిందుఁడు విద్యావ్యాసంగముమాన లేదు. మహమ్మదీయ మతగ్రంథములు వ్రాయఁబడిన అరబ్బీ, పారసీ భాషలనేర్చికొని యాతఁ డంతలోఁ దనివినొందక యార్యుల జ్ఞాననిక్షేపములున్న సంస్కృతభాషనుఁగూడ నభ్యసించెను. తీరికగా నున్నపు డాయనకు రామాయణము, మహాభారతము మొదలగుగీర్వాణ గ్రంథములఁ జదివి వినిపించుటకుఁ గొప్పపండితులుచాలమంది యాయనకడనుండిరి.

---

## ప్రథమ ప్రయత్నము.

గురుగోవిందుఁడు కొండలనడుమ నొకపల్లియలోఁ గూర్చుండి దేశస్థితినిఁ బరికించుచుఁ దనబలంబు నభివృద్ధిఁజేసికొనుచు

నుండఁగా ముందుముందు చేయవలసిన గొప్ప యుద్ధములకు నభ్యాసముంబోలె నాకస్మికముగాఁ బ్రథమప్రయత్నము సేయవలసి వచ్చెను. అది యీ విధమున సంభవించెను. ఆసాముదేశపు రాజు, తేజబహదూరుని ప్రియశిష్యుఁడునగు రత్నరాయలనునతఁడు గురుగోవిందుని దర్శనముసేయఁ దలఁచి వెలలేని యనేక బహుమానములం దీసికొని పంజాబునకుఁబోయెను. గురుని నిమిత్త మతఁడు తెచ్చిన కానుకలలోఁ దెల్ల యేనుఁగొకటి, యరబ్బీ గుఱ్ఱమొకటి, తెల్లడేగయొకటి, ఖడ్గమొకటి, బంగరు స్తంభములుగల గుడారమొకటి యుండెను. చుట్టుప్రక్కలనున్న జమీందారులీయపురూపపుఁ గానుకలంజూచి ముచ్చటపడి యవియెట్లయినఁ దాము హరియింప వలయునని తలంచిరి. విలాసపుర ప్రభువగు భీమచంద్రుఁడు తెల్లయేనుఁగును, గుడారమును జేకొనఁదలఁచె. హిందారుప్రభువగు హరిచంద్రుఁడు డేగ, ఖడ్గము, గుఱ్ఱముఁ దనకుఁ గావలయునని మనసుపడియె. హరిచంద్రుఁడు తాను కోరిన పదార్థముల స్వీకరించుట కెంతో తొందరపడి, వస్తువులు తెచ్చిన రత్నరాయలను గాని, వస్తువుల యజమానుడగు గురుగోవిందునిగాని యడుగక యూరక కత్తి నాదియని చేతఁబట్టుకొనెను. సూక్ష్మబుద్ధిగల గురుగోవిందుఁడు వారియుద్దేశముఁ గనిపెట్టి తగినట్లు వారికి బుద్ధిచెప్ప సంకల్పించెను. అందుచేత హరిచంద్రుఁడు ఖడ్గముఁజేకొనఁగానే యతఁడు పరిహాస గర్భితమైన చిరునవ్వు నవ్వి యాతని కిట్లనియె. "అవి నా శిష్యుఁడు తెచ్చిన వస్తువులు కావున నావి. అవిమీకుఁ గావలసిన మీరు పుచ్చుకొనవచ్చును. కాని

నేజెప్పిన నిబంధనల కొడంబడవలయును. ఆ నిబంధనలివి. ' మొట్ట మొదట నేను ఖడ్గము నడుమునకుఁ గట్టుకొని, డేగను జేతఁబట్టుకొని తెల్లయేనుఁగుమీఁద నంబారీలోఁ గూర్చుండి, యరబ్బీ గుఱ్ఱ మెదుటనడువ నూరేగవలయును ఊరేగింపు ముగిసిన వెనుక గుడారములోఁ గొలువుండెదను." అప్పలుకువిని, గురువనుకొన్నట్లే జమీందారులు కోపోద్దీపితులయిరి. అయిన యాతఁడు తమయెడఁ జూపిన ధైర్యస్థైర్యముల కచ్చెరువొంది, కోపము పట్టరానిదగుటచే నెట్టయెదుట నాతనిఁ దిట్టనారంభించిరి. ఆ తిట్లను సరకుసేయక గురువు నిశ్చలుఁడై యుండి వినుచు " నేనుచెప్పిన పద్ధతులు వినినారుకదా ! నే నుపయోగించినపిదప మీరావస్తువుల నుపయోగించుకొనవచ్చు " నని మరల బల్కెను. ఈ పలుకులు వారిని శాంతింపఁజేయుటకు మాఱు, కోపాగ్నిం బ్రజ్వాలింపఁ జేయు సమిధలయ్యెను. అందుచే నా జమీందారులు తమ యనుచరులతోఁ గూడి ఖడ్గములెత్తి గురువుపైఁ బడ నుద్యమించిరి. కాని రెండు మూఁడడుగులైన వేయకమునుపే యదివఱ కెంతో కష్టముమీఁద నోపిక పట్టియున్న సిక్కులు తత్క్షణమే యాయుధపాణులై " గురువునకు జయము గురువునకు జయ " మని కేకలు వేయుచు కసిఁదీర్చుకొనుటకు గురువునుఁ బరాభవించిన కొండరాజులపైఁ గవిసిరి, అంతట గొప్పకళవళముపుట్టెను. ఉభయ పక్షములవారి కంఠధ్వనులు నింగిముట్టెను. కొండదొరల ప్రాణములు మిక్కిలి యపాయములోఁ జిక్కెను. కాని, కార్యము పాకము తప్పనిచ్చుట్ల కిష్టములేనందున గురువు తన యనుచరుల నొక్క

మాటతో నివారించెను. గురువుయాన శిరసా వహించి సీకులు ఝుళిపించినకత్తుల మరల నొరలలోఁ బెట్టిరి. అంతట సద్దడఁగెను. జమీందారులు బుద్ధితెచ్చుకొని యచ్చోటువాసిపోయిరి. కాని, పోవునప్పుడు కడుపుమంటతీఱక గురువును నోటికివచ్చినట్లు తిట్టి, బెదిరించిరి. సీకులాతిట్లను, వెఱపింపులను వడ్డీతో నప్పచెప్పిరి.

జమీందారు లచ్చోటువాసి చన్నపిదప గురుగోవిందుఁడు తన యనుచరుల కిట్లనియె "మీకు నాయెడలఁ గలపక్షపాతము నకుఁ బరులు నన్నవమానింప సంకల్పించినపుడు మా గౌరవముఁ గాపాడుటలో మీకుఁగల ప్రాణికకు నాకుమిక్కిలి సంతోషముగా నున్నది. మీవిశ్వాసమింతంతయని నేను పొగడజాలను. అయి నను నేను మీక్షేమముఁ గోరువాఁడను. తమగురువు నగుటచేత జమీందారుల యెడల మీరు నోటరానిచ్చిన దుర్భాషలను విని నే నెంతమాత్రము సంతోషింపలేదు. ఇదినాకు బొత్తుగ నిష్టము లేదు. ఇఁక ముందైన మీరు పలుషవాక్యములాడకుండ జాగ్ర త్తగ సంభాషింతురని కోరుచున్నాను."

మఱునాఁడు జమీందారులు తమకు జరిగిన పరాభవము మఱవదలఁపక క్రోధాగ్నిచే రవిలెడు మనసులతో నానందపురము విడిచిపోయిరి. పలుమాటలేల? గురుగోవిందుని, తదనుచరులగు సీకులను నిర్మూలము చేసినఁగాని తనకుసంతుష్టి యుండదని యట్లు చేయుటకు భీమచంద్రుఁడు ప్రమాణముచేసెను. నిర్నిమిత్తముగా నిట్టి కలహము సంభవించినందుకు గురువుకాని యామన్నె దొరలు

గాని యించుకేనియు విచారింపలేదనుట నిస్సందేహవిషయము. జమీందారు లెంతిధనవంతులై యెంతపలుకుబడి గలవారైనను దాను వారి కించుకేనియుఁ దీసిపోవుటలేదని యాదొరలకు స్పష్టముగాఁ దెలియఁజేయ గురుగోవిందుఁడు సంకల్పించెను. ఇంక జమీందారులో గురుగోవిందుఁడు తండ్రియంతటి శాంతస్వభావముఁ గలవాఁడు కాఁడనియు గరువము పొగరు గలవాఁడనియుఁ దలంచి మొదటినుండియు నాతనియెడ ద్వేషమునే పూని యీ సమయమున నాతని పూర్ణముగా నడఁగఁద్రొక్కవలయునని సంకల్పించిరి. అన్నిటికంటె గురువుమీఁద జమీందారుల కొక విషయమున నెక్కువ కోపము చిరకాలమునుండి యుండెను. గురుగోవిందుఁ డెక్కడికైన బయలుదేఱునప్పుడు రాజఠీవితో గుఱ్ఱముమీఁద నెక్కి చుట్టుప్రక్కల కొండలు ప్రతిధ్వనులు చేయునట్లు తనభేరి ముందు వేయించుచు దనరాకఁ దెలియఁజేయు చుండును. జమీందారుల మతమున నీభేరీలు వేయించుకొనుట రాజచిహ్నముకాని గురువుల కనుచితము. అందుచేతవారు గురుగోవిందుఁడు రాజనాంఛనములను స్వీకరించుటలోఁ దనతలకుఁ దగనిపని ప్రారంభించినాఁడనియు నతఁడాచిహ్నములఁ దాల్చుట రాజుల నవమానించుటనియు మొదట నుండియు భావించి చిరకాలమునుండి యాతనిమీఁద కడుపులలో నక్కస్సుఁబూని గర్వభంజనము చేయుటకదను నిమిత్తమెదురు చూచుచుండిరి. అంతలో నీయదనువచ్చినందున వారు పరమానంద భరితులై యది దాటిపోకుండఁ గసిఁ దీర్చుకొనదలఁచిరి. భీమచంద్రుఁడు తన రాజధానిఁ

జేరినతోడనే చేసిన మొట్టమొదటిపని యేమనఁగా నానందపురము విడిచి తత్క్షణము వెళ్ళవలసినదనియు నట్లు విడవకుండిన దన కాగ్రహము కలుగుననియు గురువున కొక జాబు వ్రాసిపంపెను. ఆ జాబుచూచి గోవిందుఁడు చిఱునవ్వు నవ్వి దానికి ఖడ్గముతోనే ప్రత్యుత్తరమీయఁదలంచెను. కాని మాటలతో నీయఁదలఁపడయ్యె. అనంతరము భీమచంద్రుఁడు యుద్ధసన్నద్ధుఁడయ్యెను. కాని యుభయసైన్యములు రణరంగముఁ జేరకమునుపు నాహానుదేశపురాజగు మేదినీప్రకాశుఁడు గురువుం గలిసికొని యానందపురము విడిచి తనరాజ్యమునకు వచ్చి యచ్చట కాఁపురముండుమని గురువుం బ్రార్థించెను. యుద్ధమువలన నష్టము గలుఁగునను భయమువలనో యారాజు ప్రార్థనము నిరాకరింప నిష్టములేకనో గురుగోవిందుఁ డందుకు సమ్మతించెను. గురుగోవిందుఁడు భీమచంద్రునితోఁ బోరాడుట కసమర్థుఁడై యుండుటం జేసి యట్లొనర్చి యుండవచ్చునని మహమ్మదీయ చరిత్రకారులు వ్రాసిరి. మహమ్మదీయులు గురుగోవిందునియెడ నెల్లప్పుడు ద్వేషభావమునే జూపువారు కావున వారిమాటలయం దెంత యాదర మునుచవలయునో చదువరులే యెఱుంగుదురు. మేదినీప్రకాశుఁడు తనకీర్తికి గురుకీర్తికిఁ దగునట్లు గురువును సమ్మానించెను. ఆరాజు తనయెడఁ జూపిన భక్తికి సంతసించి యాతని కవసరమైనప్పుడేఁబదివేల రణశూరులను దాను బంపునట్లు గురుగోవిందుఁడు వానికి వాగ్దానము జేసెను. నాహానరాజు దేశములో నున్నపుడు గోవిందుఁడు తాను స్వయముగ

శంకుస్థాపనఁజేసి యొకగ్రామము కట్టించి పౌంతయని దానికి పేరు బెట్టెను. ఇది 1741 వ సంవత్సరమున కార్తీకమాసమునఁ జరిగెను. ఈనడుమ భీమచందుని కుమారుని వివాహముహూర్తము సమీపించెను. భీమచందుఁడు కుమారరాజుతోడను చుట్టములతోడను విశేష పరివారముతోడను వివాహనిమిత్తము కాశ్మీరరాజధానియగు శ్రీనగరమునకు దరలిపోయెను. ఆకాలమున శ్రీనగరమునకుఁ బ్రభువు ఫతేషా. ఈయన కుమార్తెయే భీమచందుని కుమారున కీయదలఁచిన బాలిక. ఫతేషాకు గురుగోవిందునకుఁ బూర్వపరిచయ ముండుటచే గోవిందుఁడు వివాహకాలమునఁ బెండ్లికూఁతున కీయవలసినదని కొన్ని బహుమానములను దనదివానగు నందచందునిచేతఁ బంపెను. ఫతేషా యాబహుమానములను నిరాకరించి తిరుగగొట్టెను. ఫతేషాచేత భీమచందుడట్లు చేయించి యుండునుగాని స్వయముగా నతడిట్లు చేయడని యూహించి గురువప్పటి కూరకుండి కార్యగతులు ముందుముందెట్లగునో కనిపెట్టుచుండెను.

ఈవివాహమైన తరువాత భీమచందుఁడు బహురాజుల సహాయముఁ బడసి ప్రబలుడయ్యెను. శ్రీనగరప్రభువగు ఫతేషాయుఁ గొటోచియా ప్రభువగు గురురాజకృపాళచందుఁడు జస్వాలియాప్రభువగు కేసరిచందుఁడు రాజా సుబ్రియాలుఁడు రాజాపృథిపచందుఁడు మున్నగు నృపాలురు భీమచందునిపక్షము వహించిరి. మొట్టమొదట గురువునకు గొన్ని చిన్నచిక్కులు కలిగించి భీమచందుఁడు క్రొత్తమిత్రుల సేనఁగూర్చుకొని 1742 వ

సంవత్సర వైశాఖమాసమున గురువుమీఁద దండెత్తిపోయెను. గురుగోవిందుఁడు వారి నెదుర్కొన సన్నద్ధుఁడయ్యెను. యుద్ధమారంభించుటకు సిద్ధముగనుండఁగ నదివఱకు గొంతకాలము నుండి మఠమునఁజేరి హాయిగఁ పంచభక్ష్యపరమాన్నంబుల నారగించుచు గురువునకుఁ దమప్రాణములైన ధారవోయునట్లు ప్రతిజ్ఞ చేసిన యైదువందలమంది సన్యాసులు శత్రుసైన్యముఁ జూడగానే పిక్కబలమే శరణముగ క్షణములో నదృశ్యులైరి. వీరికి కండలు గల యీతిండిపోతులు తన్ను విడిచినంతమాత్రమున గురువు విచారింపలేదు. కాని యాతనికి విచారము గలుగఁజేయు సంగతి యొకటి జరిగెను. అంతకుమున్ను గురువు నాశ్రయించి జీతములు తినుచుండిన పటానుజాతి తురకలు గురువుకడకుబోయి సిగ్గరవంతయులేక 'మేము కొలువు చాలించుకొనదలఁచితిమి. మాకు రావలసిన జీతములిచ్చి పంపివేయు' డని యతి కఠినమైన యాసమయమున నడిగిరి. ప్రాణముమీఁదికి వచ్చిన యదనునందు మిక్కిలి కృతజ్ఞులై యుండవలసిన మహమ్మదీయులు కృతఘ్నులైనందుకు గురువు మిక్కిలి మనఃఖేదము నొందెను. ఈ తురక లీయనకడ కెట్టిదుస్థితిలో వచ్చిరో చూడుఁడు. కొండొక కారణమున నీపటాను లౌరంగజీబు చక్రవర్తి యాగ్రహమునకుఁ బాత్రులై కుడువఁగూడు నిలువ నీడ లేక యొక యూరినుండి యొకయూరికి దిరుగుచు నెక్కడదలఁదాఁచుకొనుటకు నెలవులేక నానాకష్టములం బడుచుండ గురువు వారి దురవస్థం జూచి జాలినొంది చక్రవర్తి విరోధులకు దాను శరణమిచ్చుట

యుపాయములైన వెనుదీయక వారిం దనకొలువులో నిలుపుకొని యాదరించెను. ఆదురాత్ములా యుపకారమెల్ల మఱచి మోసము చేయఁదలఁచినప్పుడు గురుగోవిందుఁడు వారికి వెనుక దానుచేసిన మహోపకారమును దలపించి యట్టిఘాతుకకార్యమును జేయుటకు మనసెట్లువొప్పెనని యడిగి యాసమయమున వారు విశ్వాసవంతులై నిలిచిన పక్షమున మునుపటికంటె నెక్కువ జీతములు నెక్కువ బహుమానములు నిచ్చునట్లు వాగ్దానముఁజేసి నిలిచియున్న పక్షమున వారికే యెక్కువ లాభములు కలుగునని యుపదేశము చేసెను. ఆయుపదేశము లన్నిటిని వారు పెడచెవిం బెట్టినందున నీగురువు జీతములిచ్చివేసి వారింబంపెను. ఈస్థితిలో ననేక రాజ్యసైన్యముల బాసటజేసికొని వచ్చిన భీమచందుని యెదుటనిలిచి పోరుటకు గొంతమంచి సైన్యమున్నను గురువు సమర్థుఁడని చెప్పుటకు వీలులేదు. అయినను గురువట్టి సమయముల జంకువాఁడు కాఁడుగదా!

పటానులు సైన్యము విడిచిపోవుటవలనఁ దక్కిన సైనికులుకూడ దుర్నీతిపరులై వారిమార్గమునే యనుసరింతురేమో యనుభయమున గురుగోవిందుఁడు మిగిలిన సైనికుల కుత్సాహముఁ గలుగఁజేయఁదలఁచి సమయభంగులై పాఱిపోయిన పటానులు నమ్మఁదగని పరమపాతకులనియు వారు పోవుటయే లాభకరమనియు వారు పోవకయుండినను మంచి యుద్ధసమయమున నింతకంటె నెక్కువనష్టము గలిగించిపోయెడువారేయనియు జాలసేపు నొక్కిచెప్పి భగవంతునినమ్మఁదనే భారమువేసిన పక్ష

మున సమస్తము శుభపరిణామమగును. గావున నట్లుచేయవల యునని యుపదేశించెను. యుద్ధము మఱునాఁడు జరుగవలసి యుండెను. అందుచేత ప్రతిసైనికుఁడు తనశక్తివంచనలేకుండ గురుపక్షమున నిలిచి పోరవలయునని కృతనిశ్చయుఁ డయ్యెను. గురువుచేసిన యీ యుపన్యాసముతోనే సైనికుల మనస్సులెల్ల వీరావేశము గలిగియుండ నంతలో సయ్యదు బుద్ధూషాయను నొకతురక వారిమనస్సులను మరిపదిరెట్లు వీరరసభూయిష్ఠము లుగఁ జేసెను. పారిపోయిన పటానులు నానావస్తలంబడుచుండ జూచి యీబుద్ధూషాయను నతఁడు జాలినొంది వారిని గురు గోవిందు కొలువులోఁ బ్రవేశపెట్టెను. తాను ప్రవేశపెట్టిన మను ష్యులు కృతఘ్నులైనందున నతఁడు మిక్కిలి విచారించి తన బలగముతో గురువుకడకుఁబోయి యాయన పక్షముపోరుట కంగీకరించెను. పారిపోయిన పటానులలో నైదుగురు మనసు మార్చుకొని మరల గురుపక్షముఁ జేరఁదలఁచిరి. కాని సిక్కులు వారి వెన్నంటి తరిమి వధించిరి.

గురువనుకొన్నట్లె మఱునాఁడుదయమున యమునానదికి గిరియను నేఱునకు నడుమనున్న బయలుమీఁద నుభయసైన్య ములు యుద్ధము నిమిత్తము గలుసుకొనెను. ఈయుద్ధ మేఁడు దినము లెడతెరపి లేక జరిగెను. రెండుప్రక్కల సైనికులు మహా శౌర్యముతోఁ బోరాడిరి. భీమచందుని సైన్యమధికసంఖ్యగలది. సైనికులు చక్కనిశిక్షఁగల వారగుటచే నెంతోనేర్పున యుద్ధము చేయగలిగిరి. గురుగోవిందుని సేనలోనున్న జోదులు మంచి శిక్ష

లేనివారై దేవుఁడొక్కఁడేయని యాతనిపాదపద్మములనే నమ్ముకొని దైవసమానుఁడుగా గురువునుభావించి యాతని మాటలచేత నుత్సాహముఁగలిగి పోరవలసినవారైరి. గురుగోవిందుఁడు స్వయముగ రణరంగముఁజొచ్చి యుద్ధమును వేయిగన్నులం గనిపెట్టుచు సైన్యమునకు వలయు నుత్తరువులిచ్చుచు స్వయముగ బోరుచు యోధులం బురికొల్పుచు శతావధానము చేసినట్లు విహరించెను. గురువుజూపిన మహాశౌర్యము ధైర్యము సైనికుల మనంబులమీఁదఁ బనిచేసెను. కాని వ్యర్థముగఁ బోలేదు. హిందారుప్రభువగు హరిచంద్రుఁడు గురునిందాకి యాయనగుఱ్ఱమును గొప్పగాయము తగులునట్లుకొట్టి గురువుమీఁది కురికెను. కాని సంకల్పించినపని నెరవేరకమునుపే గురువువింటినుండి వెడలిన యొకక్రూరబాణముచేత నిహతుఁడై హరిచంద్రుఁడు నేలంగూలెను. తమనాయకులలో నొక్కఁడు నేలపాలగుటఁజూచి శత్రుసైనికులు భయభ్రాంతులై మృతినొందినవారిని గాయములు తగిలినవారిని వెనుక విడిచి ముందుదృష్టియేకాని వెనుక దృష్టి లేక పారిపోయిరి. శత్రుసేనలోనున్న తక్కిన నాయకులు సహజభీరులయ్యుఁ జేయునదేమియులేక పలాయనమునే శరణము జేసికొనిరి. తక్కువసేనతో గెలిచిన యీగెలుపు గురువును బరమానంద భరితునిఁ జేయుటయేగాక యాతనికెంతో పేరుతెచ్చి యాతనిపక్షముఁ బ్రబలమగునట్లు జేసెను. ఈవిజయము భగవదనుగ్రహమువలన గలిగెనని గురుగోవిందుఁడు తన గ్రామమగు పౌంతకుంబోయి యీశ్వరప్రార్థనలఁజేసి తనకు నమ్మినబంటులై తన

పక్షమునంబోరి రణమున నొకకుమారునిం గోల్పోయిన సయ్యాదు బుద్ధూషాను మిగుల గౌరవించి వానికొకపట్టా వ్రాసియిచ్చి తన తలపాగలో సగముచించి వానికి బహుమానముగ నిచ్చెను. అతఁడు చేసిన యుపకారమును గురువాతనికిఁజేసిన సమ్మాన మును మనసులో నుంచుకొని సీకులు నేఁడు సైతము బుద్ధూషా కుటుంబమును మిక్కిలి గౌరవముతోఁ జూచుచున్నారు.

అనంతరము గురుగోవిందుఁడు పౌంత గ్రామమునుండి యానందపురమునకుఁబోయి తనవిజయము చాటించి వైభవముతో మరలఁ దండ్రిపీఠము నధిష్ఠించి యూరకుండక మరలనేవేళ కే యుపద్రవము మూఁడిన నప్పుడు చిక్కుపడకుండ ముందు కాఁపుదల నిమిత్త మానందపురమునకు రక్షకసేనను బలపఱచెను. ఆ పట్ట ణముచుట్టు నాలుగుకోటలుకట్టెను. అందు మొదటిదానిపేరు ఘురు. రెండవది పతేఘురు. మూడవది లోహాఘురు. నాల్గవది బోల ఘురు. ఈ నాలుగు కోటలలో నతఁడాయుధములను నిలువచేసెను.

---

## ద్వితీయ ప్రయత్నము.

ఈ కొండరాజులతో యుద్ధమైన కొన్ని మాసములకే గురువు తన కత్తి మరల నొఱలోనుండి తీయవలసివచ్చెను. ఈ సారి యాతఁడు కత్తిఁగట్టుట కొండరాజులను శిక్షించుటకుఁ గాక వారిని రక్షించుటకయ్యెను. సర్ హింద్ పరగణాసుబేదారు,

భీమచంద్రుఁడు మొదలగు మన్నెదొరలు సర్కారు ఖజానాకు బంపవలసిన కప్పముసరిగా బంపలేదను వంకబెట్టి వారిమీఁద గుపితుఁడై వారిని దండించుట కొఱకు గొప్పసైన్యముం బంపెను. కప్పము సరిగా గట్టలేదనుట కొంతవఱకు నిజమే. నిజమైనను కొండరాజులు బాకీయున్న కప్పమునుబంపక ప్రాణములు పోయి ననుసరే చిట్టచివఱకు శత్రుసైన్యము నెదిరింపవలయునే కాని కప్పము చెల్లించకూడదని కృతనిశ్చయులైరి. అందుచేత సర్హిందు సుబేదారు సైన్యముం గూర్చుకొని వారిమీఁదికెత్తి పోయెను. శత్రుసైన్యము సమీపింపగానే కొండరాజుల ధైర్యములు డీలువడ భయకంపితులై గురువు నాశ్రయింపదలఁచి వెనుకటి మనస్పర్థలు మఱవవలసినదనియుఁ దమకెల్ల సామాన్యశత్రుఁడగు మహమ్మదీయుని బారదోలుటకు సాయపడవలసినదనియుఁ బ్రార్థనపూర్వకముగా నాయనకు రాయబారమంపిరి. గురుగోవిందుఁడు దేశోపకారము నిమిత్తము తన పరాభవములన్నియు మఱచెడు స్వభావము గలవాఁడగుటచే కొండరాజుల సందేశమును గౌరవముగ నాలకించి తన సేనానాయకులగు మొహరీచందు దయారాములకు నైదునందల సైనికుల నప్పగించి యారాజులకుం దోడ్పడఁబంపెను. కొండరాజుల యదృష్టము పండుటచే గురుసహాయమున మహమ్మదీయసైన్యము పరాజయమొందెను. కాని యింతమాత్రము పరాజయముతో మహమ్మదీయసేన యడఁగి యూరకుండునది కాదు.

ఈయుద్ధమైన స్వల్పకాలమునకే యనఁగా శాలివాహన శకము 1745 సంవత్సరమున లాహూరుసుబేదారు కొండరాజు

లను దండించుటకొరకు సైన్యమును గురుగోవిందునకు బుద్ధిచెప్పఁ దలఁచి మరియొక సైన్యమును బంపెను. దైవనిర్ణయమున నీ సారికూడ బరాజయము తురకలదే యయ్యెను. అది వర్షకాల మగుటచే మ్లేచ్ఛసేన పొంగియుండిన నదులందాటలేక సరిగా బయనములు సలుపలేక చెడిపోయెను. మహమ్మదీయ సేనా నాయకుఁడగు రుస్తుముఖాను పరాభవముచే నినుమడించిన రోష మున వర్షకాలము గడచినతోడనే మరల సేనంగూర్చుకొని పర్వతరాజులపైఁ బడెను. గురువు భాయిసంగీతుఁడను నొక శిష్యునకు మూడువందల సిక్కుల నప్పగించి వారికి సాయమం పెను. పాపము విధివశమున జయలక్ష్మి యీసారికూడ హిందు వుల పక్షముననే యుండెను.

మహమ్మదీయ సైనికులకు నొకదానివెంట నొకటిగ జరుగుచున్న గొప్పపరాభవముల వార్తలువిని చక్రవర్తియైన నౌరంగజేబు మండిపడి కొండరాజులకు వారి చెలికాఁడగు గురు గోవిందునకు గట్టిగా బుద్ధిఁజెప్ప తీరవలయునని సంకల్పించి గొప్ప సైన్యమిచ్చి తన కుమారుఁడగు మువజ్జముషాను వారిమీఁదికిఁ బంపెను. ఈరాజకుమారుఁడు కొండలలోనికిఁ దాను స్వయముగ వెళ్ళవలసిన యావశ్యకత లేదనుకొని తన సేనానాయకుఁడగు నమీరు మీర్జాబేగును బుత్తెంచెను. అతఁడు లెక్కమీరిన సైని కులను సామానులు మోయు జంతువులను దీసికొని కొండలలోఁ జొరఁబడి నాశనముజేయ నారంభించెను. కొండరాజులు దుర్బల సైన్యములతో వాని నెదుర్కొనిరి. కాని వారి ప్రయత్నములు

నిష్ఫలములగుటచే నేమియుం జేయలేక శత్రువుఁడు తన మనసార దోఁచుకొని నాశనము జేయుటకు దముపట్టణములు వల్లెలువిడిచి పారిపోయిరి. గురుగోవిందుఁడు సయితము తన యానందపుర మును శత్రువులబారి కప్పగించి దూరపుటడవులకుం బారిపోయెను. మీర్జాబేగుయొక్క సైన్యము దుర్జయమగుట దానియెదుట కొండరాజులయొక్కయుఁ దనయొక్కయు సైన్యము నిలువఁ జాలదని గ్రహించి యట్టిసమయమున శత్రువునిచేత నిర్మూలింప బడుటకంటె గొంతకాల మెందేని యొదిగియుండి యదనువచ్చి నప్పుడు విక్రమించుట మంచిదని గోవిందుఁడా తెలుంగునఁజేసెను.

గురుగోవిందుఁడట్లు లానందపురము విడిచి శత్రుభీతిచే వనాంతరంబుల నివసించు కాలమున నొక చిత్రకథ జరిగెను. అది మనము నమ్మదగినది కాకపోయినను గురునిచారిత్ర కారులం దఱుఁ దచ్చరిత్రములందు వ్రాసిరి. కావున మనముగూడ దాని నిట తెలిసికొనుట యవశ్యమని యావృత్తాంతము వ్రాయఁదొర కొన్నారము. గురువొకనాఁడు పురాణములయందు నితిహాసము లయందు మహాప్రౌఢుఁడైన యొకబ్రాహ్మణునితోఁ బ్రసంగిం చుచు సందర్భవశమున 'నయా! అర్జునకంత బలమెట్లు కలిగె' నని యడిగెను. ఆ ప్రశ్నకు బ్రాహ్మణుఁ డిట్లని యుత్తరమిచ్చెను. 'మీవంశకర్తయైన యర్జునుఁడు దేవీప్రసాదమునఁ బడసి మహా తేజశ్శాలి యయ్యెను. శత్రునర్గమును నిశ్శేషముగ నిర్మూలించు టకుఁ బార్థునివలెనే దేవతా ప్రసాదమును బడయవలయు.' ఇందుకు మీ రొక యజ్ఞముఁ జేయవలయును. అప్పుడు పఠింపఁ

బడునట్టి యాగము మంత్రముల ప్రభావమున హోమగుండములో నగ్నిమధ్యమునుండి యొక మహాదేవి ప్రత్యక్షమై మీకు వరంబు లిచ్చును. దానంజేసి సీకులు దుర్నిరీక్ష్యప్రతాపులై శత్రువులం బారదోలుదురు. ఈయుపదేశము గురువునకునచ్చుటయు నతఁడు సత్వరమే యీ యాగముం జేయింపుమని యడిగెను. కాని యాగమమంత్రకోవిదులగు బ్రాహ్మణోత్తములు చాలమంది కావలయును అట్టివారు కాశ్మీరమునందులేరు. యాగము నిర్విఘ్నముగఁ బ్రశాంతముగఁ దుదముట్టింపఁ దలఁచిన పక్షమునఁ బ్రయోగ పద్ధతులయందుఁ గుశలురగు బ్రాహ్మణోత్తములు కావలసి యుందురనియు నట్టివారు కాశీకానగరమందే కాని తదితర స్థలముల లభింపరనియు బరమపావనమగు నాదివ్యక్షేత్రమున కెవ్వరినేనిఁ దగు బ్రాహ్మణులఁబంపి వారిని రప్పింపవలయుననియు, గురుని సన్నిధినున్న బ్రాహ్మణులు పలికిరి. అప్పలుకులువిని గురుగోవిందుఁడు మంచి బ్రాహ్మణునొకనిని వాం గాశికిం బంప, నతఁడు వెదకివెదకి శ్రోత్రియులగు భూసురులను దోడ్కొని గురుని సన్నిధికిం బోయెను.

కాశీదాసు కేశవదాసు విశ్వంబరదాసు ననుమువ్వురు బ్రాహ్మణులు గురుసముఖమునకుఁబోయి యాగముచేయింపఁ గలమని పలికిరి. యాగభారమంతయు వారిపయివైచి గురువు తగు ప్రయత్నములఁజేయించి యజ్ఞదీక్షితుఁడయ్యెను. యాగము జరిగెను. హోమగుండమందలి మంటలలోనుండి యొకఖడ్గము పయికెగిరి పడెనట. అదిచూచి గురువు దాని భావమేమని

బ్రాహ్మణులనడిగెనట. అందుకు బ్రాహ్మణులిట్లనిరట. ఇది మంచి శకునము. మీరు తొందరపడవద్దు. దేవియే మీకు ప్రత్యక్షము కావలయునన్న మీరు నిశ్శంకముగా మీ శిరస్సుగోసి హోమము చేయవలయు." అనవుడు గురుగోవిందుడు "నేను చేయవలసినపని విస్తారముగ నున్నది. నేను శిరస్సుగోసి యియ్యజాలనని యుత్తరమిచ్చెనట. అందుకు బ్రాహ్మణులు మీకుమారులలో నొకని శిరస్సిచ్చినం జాలునని బదులు చెప్పిరట. అంతట గురువు తన కుమారులం బిలువనంప గోవిందునితల్లి ప్రపంచమంతయుం దలక్రిందైననుసరే తన మనుమలలో నొకని నైననిచ్చుటలేదని నిర్భయముగం బ్రత్యుత్తరమిచ్చెను. ఆహాహా ! ఆశ యెంతపనిం జేయించును. గురుగోవిందుని యంతవాడుకూడ దేవీ సాక్షాత్కారమున శత్రునాశన మగునని బ్రాహ్మణు లాశపెట్టినమాత్రమున వారి వలలలోంబడి కుమారునిం జంపంజూచెగదా ? ఈమాట నిజమేయైన పక్షమున నీయనకంటె నాడుదియైన నీయనతల్లియే యెక్కువ వివేకముతోం బనిచేసెనని చెప్పవచ్చును. అప్పుడు చేయున దేమియు లేక గోవిందుడు యాగవిధాయకులగు బ్రాహ్మణులంజూచి "వీరె నా ప్రియశిష్యులగు సిక్కు లిరువదినలుగురు తమశిరస్సుల నర్పింప సిద్ధముగనున్నారు. ఇందెవ్వని తలయైనం బనికివచ్చునాయని పలికెను. బ్రాహ్మణులు దీనికొక విధముగ నిష్టపడిరి అంతట నొక సిక్కునిశిరస్సు కొబ్బరిపువ్వువలె నఱుకంబడెను. హోమము యథావిధిగ జరిగెను.

ఈకథనే కొందఱు చరిత్రకారు లీలాగునం జెప్పుచున్నారు. గురుగోవిందుడు దేవీబలినిమిత్తము తనకొడుకులలో

నొకని పంపుమని తన తల్లికి వర్తమాన మంపెనట. "ఆమె నా కొడుకు పిచ్చివాఁడు వాని పిచ్చిచేతలకొఱకు నామనుమలఁ జంపు కొందునా" యని తన నలుగురు మనుమలం దీసికొనిపోయి మొఖోవాలుకోటలో దాగుకొనియెనఁట. అదివిని గోవిందుఁడు బిడ్డలలో నొక్కనిఁ బంపనిపక్షమున ముసలమ్మ యెదుట చిన్న బిడ్డల నలువురను జంపివేయుదునని వర్తమానమంపెను. ఆయవ్వ యప్పటికిని బిడ్డల నప్పగింపనందున గురుగోవిందుఁడు చేయునది లేక తన యనుచరులం బురికొల్పెను. ఎంత పురికొల్పినను మరణమున కొప్పుకొనువాఁడు సాధారణముగ నుండఁడు. కావున కొంత కాలమువఱ కెవ్వరును సాహసించి రాలేదు. అప్పుడు గురువు కోపించి యనేకులను శపించెను. పిమ్మట యిరువదినలువురు సిక్కులు సిద్ధమైరి. అందొక్కని శిరస్సు దేవికర్పింపఁబడెను. అట్లు యాగము ముగించి గురువు బ్రాహ్మణులకు భూరిదక్షిణలిచ్చి పంపెను. ఈ కథ నమ్మువారు గురుగోవిందుఁడు సంపూర్ణముగ గాకపోయినను గొంతవఱకైనఁ దనమనోరథసిద్ధిని బొందెనని యూహింపవచ్చును. ఈ యాగమునుగూర్చి యింకను మఱికొన్ని కథలుగలవు. అందొకటి ఈక్రింద జెప్పఁబడును. ఈయాగము బహుదినములు జరిగినపిదపఁగూడ దేవిప్రత్యక్షము కానందున గురుగోవిందుఁడు బ్రాహ్మణులంబిలిచి యేల దేవి కానఁబడలేదని యడిగెను. పరమపవిత్రుఁడగు మనుష్యుఁడొకఁడు తనశిరస్సు బలియిచ్చినంగాని దేవి సాక్షాత్కరింపదని బ్రాహ్మణులుత్తర మిచ్చిరి. అదివిని గురుఁడిట్లు బదులుచెప్పెను. "అట్లయిన మీలో

నొకరుశిరస్సు బలియిందు. మీకన్నఁ బరమపవిత్రులగుమనుష్యు లెవరున్నారు ? ఈపలుకులు బ్రాహ్మణులకుఁ గర్ణకఠోరములుగ నున్నందున వారందు కియ్యకొనక క్రమక్రమమున నొక్కరొక్క రుగ జారిరి. అందుచేత యజ్ఞము సమాప్తమొందలేదట.

దేవి గురుగోవిందునకు స్వప్నమున సాక్షాత్కరించి కొంత బలము ప్రసాదించెనని మూఁడవకథ. బ్రాహ్మణులు తిరిగి రానందున గురుగోవిందుఁడు కోపించి యజ్ఞము నిమిత్తము దెప్పించిన సంబారము లన్నియు హోమకుండమున బడవైచె ననియు నందువలన జగద్భయంకరముగ మంటలు బయలుదేఱె ననియు బరిసరగ్రామవాసు లాజ్వాలలు చూచి దేవి జాజ్వల్యమాన రూపముధరించి గురువునకు బ్రత్యక్షమైనట్లు తలంచి రనియు నాల్గవకథ. గురుగోవిందుఁడు భగవంతుఁ డొక్కఁడే యనియు నతఁడే సృష్టిస్థితిలయకారణభూతుఁడనియు ధృఢవిశ్వాసము గలిగిన యాస్తికుఁడయ్యుఁ గొన్ని కామ్యముల నొసంగునట్టి క్షుద్రదేవత లున్నవనియు మంత్రాంతర సాధనాంతరములచే వాని నారాధించినపక్షమున నవి యభీష్టముల దీర్పగలవనియు నతడు నమ్మెను. భగవంతు డొక్కడే యనియు నతనికంటె నితర దైవతములు లేవనియు విశ్వసించునట్టి మహానుభావులకుగూడ నిట్టి పిచ్చినమ్మకములు గలవని ప్రపంచచరిత్రలు చదివినవారికందఱకు దెలియును. ఏకేశ్వరారాధనతత్పరుఁడైన యేసుక్రీస్తు దయ్యము లున్నవని నమ్మెను. మహమ్మదు వారికిగూడ నిట్టినమ్మకము గలదు. భగవంతుఁడే లేఁడని బోధించిన బుద్ధదేవుఁడు సయితము

మారుఁడు ప్రజాపతి మహేంద్రుఁడు మొదలగు దేవతలున్నా రని నమ్మి శిష్యులకు బోధించెను. మనదేశమందున్న మహమ్మదీయ క్రైస్తవులలో గొందఱు తాము వర్ణభేదములేని మతములలో జేరినవారయ్యు స్వమతములకు విరుద్ధముగ వర్ణభేదము పాటించుచు గ్రామదేవత మొదలగువాని నారాధించుచుండ మనమెఱింగిన విషయమె. ఆపదవచ్చినప్పుడు తన్నివారణార్థమొ భయముచేతనొ మహాస్తికులుగూడ క్షుద్రదేవతారాధన తత్పరులగుదురు. ప్రథమ గురువైన నానకునకిట్టి నమ్మికలు లేవు. గురుగోవిందున కెందుచేతనో యిట్టి నమ్మికలు కలిగెను. గురుగోవిందున కిట్టివానియందు విశ్వాసములేదు. కాని యతనికి మహమ్మదీయులతో వైరము సంభవించుటచేతను శత్రువిజయమునిమిత్తము సేనలు కావలసివచ్చుటచేత హిందువులు సైనికులుగ జేరవలసివచ్చుటచేతను హిందువులను సంతోషపెట్టి వారిని విశేషముగ సైన్యములో జేర్చుకొని వారిసాయమున బగతుర సాధింపవలెనని గురుగోవిందుఁడీ క్షుద్రదేవతారాధన మారంభించెనని కొందఱు చెప్పుచున్నారు. రాజనీతికోవిదులు కాలానుసారముగ లేని నమ్మికలు తెచ్చిపెట్టుకొని పనిచేయవలసియుండును. కావున నాకాలమున మతవ్యాప్తికి నాత్మసంరక్షణమునకు రాజనీతియు శస్త్రప్రయోగము గావలసివచ్చినందున గురుగోవిందుఁ డాయజ్ఞము చేసియుండవచ్చును. నానకు కాలమున మతమింత ప్రబలము కాలేదు. గావున శత్రువులు లేకపోయిరి. శత్రువులు లేనప్పుడు కత్తిదూయుట రాజనీతి ప్రయోగించుట యనవసరములుగదా. పదియవ గురువునాటికి సిక్కుమతము ప్రబ

లమై యనేకులకు గన్నెఱ్ఱగావించెను. అందుచేత గురుగోవిందుఁడు కొన్ని క్రొత్తపుంతలు త్రొక్కవలసి వచ్చెను.

---

౨ ౨.

యాజ్ఞమువలన గురుగోవిందున కేమియులాభము గలుగ లేదు. యజ్ఞానంతరమున గొన్నివందలమంది యతనిచుట్టుం జేరిరి. కాని పోరాడవలసిన పగతురు వేనవేలున్నప్పుడు కొన్నివందల మంది యేమిచేయగలరు. పని చేసినను చేయకపోయినను వారి వేషభాషలు వారియాచార వ్యవహారములు గురువునకు వారి యందు ప్రీతి గలిగింపలేదు. గురుగోవిందునకు దేవి సాక్షాత్క రించి వరము లిచ్చెనను నమ్మకతో వారు తన సైన్యమున జేరిరి. కావున వారు మూఢవిశ్వాసములుగల మూర్ఖులు. విశేషించి విగ్రహారాధకులు. గురుగోవిందుఁ డేకేశ్వరారాధనపరుఁడు. మూఢవిశ్వాసములులేనివాఁడు. విశ్వాసములకేమిగాని క్రొత్తగా జేరినవీరు మహాబలసంపన్నులైన వీరులేమో చూతమన్న విక్ర మముగూడ వారికడనేఱ సున్నయయ్యెను. కొండలలో నివ సించునట్టి వారియొక్క దేహస్థితి సంపూర్ణారోగ్యముగలది కాక పోయెను. వారు తినునట్టియాహారము బలవృద్ధిచేయునది కాదు. క్రీడలుగాని వ్యాయామములుగాని వారెఱుఁగరు వారు శూరుల వంశములనుండి వచ్చినవారు కాకపోవుటచే మంచి సాంప్రదాయ

ములులేవు. ఎట్లయిననేమి అతనిని సేవింపవచ్చినజోదులు మత విషయమునను దేహబలవిషయముననుగూడ బనికిరానివారైరి. అందుచేత నానకు సంస్థాపించిన యేకేశ్వరమతమునందు విశ్వాసము గలిగినట్టియు దన యాశతప్ప నితరులయాశకు లోబడినట్టియు గట్టిసేవయు లావును గలిగి నిండుమగంటిమిగలిగి రణరంగమున వెనుకంజయిడక పోరాడునట్టియు మహావీరులను జేర్పవలెనని యతఁడు సంకల్పించెను. ఇట్టివీరులు వర్ణభేదముచేతను జాతిభేదముచేతను కులభేదముచేతను మతభేదముచేతను మిక్కిలి చెడిపోయియున్న హిందూమతమునుండి దొరకుట దుర్లభమని గురువు తలంచెను. జాతిమతభేదములుగలవారు చేరునప్పుడు మహావినయము గలిగియు లేనిపోనిపట్టింపులు పట్టుకొని మనస్సుల వైరములు పెంచుకొని సమయమువచ్చినప్పుడు కార్యభంగము చేయుదురని గురువునకుఁ దోఁచెను. కావున వర్ణభేదములులేకుండ తనయొద్ద జేరినతరువాత నొక్కటేవర్ణముగ నుండదలఁచినవారినే యతఁడు జేర్చుకోదలఁచెను. ఒక్కవర్ణమువారినే జేర్చుకొన్న పక్షమున వర్ణభేదము పోవదని యతఁడెఱుఁగును. అందుచేత నీవర్ణ మావర్ణ మనక సకలవర్ణములలోని హిందువులను జేర్చుకొని యతఁడొకవర్ణము చేయఁదలఁచెను. అతఁడు గుణమేప్రధానము చేసికొనెను. మంత్రాంతర దేవతాంతర సాధనాంతరములులేక దేవుఁడొక్కఁడేయని నమ్మినవాఁడు. దృఢమైనబాహువులుగలవాఁడు. గురువునెడల విశ్వాసముగలవాఁడు. శౌర్యముగలవాఁడు మాత్రమేదానికర్హుఁడు. అతఁడేజాతివాఁడైనను క్షత్రియు

డగును. శూద్రుఁడే క్షత్రియుఁడగును. ఈవిధముగ మతవృద్ధి చేయఁదలఁచి 1756 వ సంవత్సరము వైశాఖమాసమున నతఁడు దేశమందున్న సీకుల నందఱ రావించి యొక మహాసభ చేసెను. గురుని యాజ్ఞాప్రకారము నానాభాగములనుండి సీకు లనేకులు వచ్చిరి. ఆ సభ యొకగొప్పబయలుమీఁద జరిగెను. ఆ బయలు మీఁద నొక గురువుల గుడారము వేయబడెను. గుడారముల యొక్క ద్వారములకు దట్టములైన తెర లడ్డుగా గట్టబడెను. లోపల నేమి జరుగుచున్నదో పైకి దెలియకుండ యాపని చేయ వలెనని యతఁడు చేసెను. సభాప్రారంభసమయమున గురుగోవిందుఁడు దారుణఖడ్గపాణియై యతిభయంకరరూపముదాల్చి గుడారము వెడలివచ్చెను. వచ్చి విస్మితులై దన్నుజూచుచున్న సభాసదులజూచి యిట్లనియె. అమృతస్వరూపుఁడగు పరమేశ్వరుఁడు హిందూధర్మము యొక్కయు హిందూజాతియొక్కయు నిరంతరాయువృద్ధినిమిత్తము క్షేమమునిమిత్తము నా భక్తులైన సీకులలో నొకని శిరస్సు బలియొసంగవలసినదని యాజ్ఞాపించియు న్నాఁడు అది ముందురాగల దేశాభిమానులను బురికొల్పునట్టి దేశక్షేమకరుల హృదయములయందు ధైర్యోత్సాహములు కలిగించియు వాడిపోయిన శౌర్యాగ్ని వెండియు రవులుకొనజేయువలయు. ఈ మహాకార్యముకొఱకు జంకుగొంకులేక ముందువెనుకలు విచారింపక దనశిరస్సుసమర్పింపఁ గలశూరుఁడెవఁడైన నీ సభలో నున్నాఁడా! పిట్టపిడుగులవంటి యప్పలుకులు వీనులం బడినతోడనే మొట్టమొదట సభయెల్ల నిశ్శబ్దమయ్యెను. క్షణ

కాలములో మహాత్మా! నేనున్నాను. అనియొక మూలనుండి యొకధ్వని వినబడెను. లాహోరునుండి వచ్చిన యొకసీకుక్షత్రియుఁడు సభనుండిలేచి చేతులు జోడించి గురుసన్నిధికిబోయి దేవా! నాయాత్మయు నాశరీరము నీయధీనము జేసితిని. అవి నీయిచ్చవచ్చిన తెఱంగున జేసికొనుము అని చెక్కు చెదరక నిలువంబడెను. గురువరుని చేయిబట్టుకొని విసవిస గుడారములోని కీడ్చుకొనిపోయెను. పోయినతోడనే కత్తిగోటు సభాసదులకు వినఁబడెను. గుడారపుగుడ్డ యెఱ్ఱబడునట్లు రక్తము స్రవించెను. సభలో హాహాకారము చెలఁగెను. దయాసింగుజన్మ కృతార్థమైనదని యక్కడివారందరుఁ దలంచిరి. అంతట గురువు రక్తసిక్తమైనఖడ్గముతో మేనెల్ల చిందిననెత్తురుబొట్లతో గుడారము వెడలివచ్చి దయాసింగు ధన్యుఁడయ్యెను. మఱియొకడు కావలయును. ఈసభలో నిప్పటికి వచ్చువాడు మరియొకడు కలడా యని యడిగెను. హస్తినాపురవాసియైన ధర్మసింగులేచి గురుని యాజ్ఞకు బద్ధుఁడయ్యెను. అతనుకూడ గుడారమునకు దీసికొని పోబడెను. మొదటివానికట్లే జరుగవలసినపని వీనికింజరిగెను. కాని బలి సమాప్తము కాలేదు. మఱిమూఁడుతలలు కావలసి యుండెను. మఱియొకఁడు కావలెను. మఱియొకఁడు కావలెనని గురువు పిలువగానె నిర్భయముగ నొకొక్కఁడు వచ్చెను. కుమ్మరి హేమత్సింగు చాకలిమోఖంసింగు మంగలిసాహేబు సింగు గురునియానతికి విధేయులై గుడారములోనికి బోయిరి. ఆయేవురిగతి తలంచినపుడా సభాసదుల మనస్సున నేరీతిగనుం

డెనో యెవరువర్ణింపఁగలరు. పలువురుఁ పలువిధంబులఁ దలంచిరి. మన మేకార్యము గావించినను భళీయనువారు కొందఱు సీయను వారుకొందఱు నుండకపోరు గురువుఁ మఱికొందఱుకావలెనని పిలిచినపక్షమున నిశ్శంకముగాబోయిఁ కృతకృత్యులుఁ గాదల చినవారు మఱికొందఱుండిరి. దేవబలిసిమి త్రము తమప్రాణముల దృణప్రాయముగ నర్పించిన యమ్మహావీరుల కళేబరములు చూడవలయుఁనని సభాసదులుఁకోరిరి. అట్టికోరిక నిరాకరించుట ధర్మముఁకాదని గురువు గుండారపుందెరల నెత్తించెను. అప్పుడు సభాస్థారుల యాశ్చర్యమేమఁవచ్చును. పరలోకమున ప్రాత కాపులై యున్నవారనుకొన్న యయ్యైవురువీరులు చెక్కు చెదరక యుక్కుకంభములవలె యాసభాస్థారుల యెట్టయెదుట నిలువంబడిరి. మిక్కిలి యక్కఱంపడుచున్న యమ్మహాజనులతో గోవిందుఁడిట్లనియె. ఇటువంటి మహాత్ములకు బరమపద మెప్పుడును సులభమే కాని వీరికీలోకముననే ప్రస్తుత మెక్కుడుపని గలదు. మహామనస్కులై వీరు తమ సృష్టికర్తకడకు బోవక మున్నిక్కడ నున్నపని సంపూర్తిగ జేయువలయును. అందుచేత వీరిని సంహరింపలేదు. వారిం దెగవేయఁపోయినయెడల నంత క్రొన్నెత్తు రెచ్చటనుండి వచ్చెనని సభ్యులకు గలిగెడు ననుమానము దొలఁగింపఁ దనఖడ్గమున కెరయై తెగిపడిన యెదుమేకల దెప్పించి వారికిచూపి యనుమానము నణంచెను. మన సీకుమతస్థులలో నెవ్వరెవ్వరికడ నెంతెంతసామర్థ్యమున్నదో బహిరంగమున సభామధ్యమున నరయుటకై నేనిసభ గావించితిని.

కొందఱు సామర్థ్యము గనుగొంటిని. మన మతమును తగిన మహోన్నతస్థితిలోనికిఁ దీసికొని పోవుటకును యీనాటి యద్భుత చర్య చిరస్థాయిగ నుండునట్లు చేయుటకును మనము గొప్పసన్నాహము చేయవలయు" నని గురువువిరమించెను. అనంతరము గురువు సభ చాలించి తననివాసమున కరిగెను. సభాసదులందరు నతనివెంట కాష్ఠురునకు జనిరి.

---

## సన్నాహము.

కాష్ఠురునకు జనినపిదప గురువొక పెద్దదర్బారుచేసెను. అతఁడు మహాయోధువేషముదాలిచి యాయుధపాణియై యున్న తాసనమున నిజపరివారపరివేష్టితుఁడై కూర్చుండెను. మృత్యుముఖమునుండి తప్పించుకొనిన యేవురుపీరులు గురునివిధంబున యోధవేషములతో నాతనికెదుట కనంబడిరి. అట్లుకూర్చుండి యతఁడు కంఠమెత్తి గంభీరస్వరముతో నమ్మహాసభయొక్క ముఖ్యోద్దేశములను స్పష్టముగ జెప్పెను. సిక్కుమతముయొక్క సంరక్షణనిమిత్తమును సిక్కుమతము హిందూమతములో నొక భాగమేగనుక హిందూమత సంరక్షణమునిమిత్తమును, నాట నుండి సిక్కులు తమకు సంభవించునట్టి మనస్సంకటములను దేహపీడలను నిర్భయముగ ననుభవింపవలసినదని యు వెనకటితొమ్మం

ద్రుగురు గురువులు చేశిన బోధామృతముయొక్క సారమె తానుపదేశించుటజేసి పదియవగురువైన తనయాజ్ఞను సిక్కులెవ్వరు నుల్లంఘింపఁ గూడదనియునట్లు చేయువారెందరుందురో కను గొనుటకె యమ్మహాసభ కూర్పఁబడినదనియు నితఁడుచెప్పెను. ఈ కార్యము కొనసాగుటకును సన్నాహము సాంగముగ నెఱ వేరుటకును పవిత్రమైన యొకానొకకర్మవలన వారందఱుపునీతులు గావలయుననియు వారు పునీతులైనపిదప మహాయోధులగుదు రనియు నతఁడు సెలవిచ్చెను. అట్లు చెప్పి యాపవిత్రకర్మమేదో వెంటనే తెలియఁజేయఁదలఁచి యినుపపాత్రయొకటి తెప్పించి బెల్లము తెల్లపంచదార యెఱ్ఱపంచదార పటికబెల్లము తేనెగూడ తెప్పించి యాయినుప పాత్రములో మంత్రపూతమైన జలము పోయించి యందీమధురపదార్థములైదును బడవైచి గుడశర్క రలు కరగి పానకముగుదాక నూరకుండి యాదిమగురువైననానకు రచియించిన గ్రంథమునుండి కొంతభాగము చదివి తనఖడ్గమా పానకమునముంచి యాపానకమున కమృతమనిపెట్టి నాలుగు చుక్కలు తననాల్కమీదను మరికొన్ని చుక్కలు కన్నుగవ మీదను తలమీఁదను వైచికొని యాయేవురు సిక్కులను దగ్గరు మనిచెప్పి యొక్కొక్కఁడు పుక్కిసెడమృతము ద్రాగవలసినదని యానతిచ్చెను. అట్లువారు త్రాగినపిదప వారిచేత గురుజీకీఫతే యనుమాట లనిపించెను. గురువునకు జయముగలుగుగాకయని యామాటల యర్థము. ఈకర్మపేరు పహూలు. ఈసన్నాహము పేరు ఖాల్సా. ఖాల్సాయనగా క్రొత్తమతము. అనగా గురు

గోవిందుఁడు నూతనముగ నేర్పఱచిన మతదీక్ష. అటమీఁద సిక్కులకందఱకు దమతమనామధేయములతుదను శింగులనుశబ్ద ముండవలయునని యతఁడు శాసించెను. ఈశాసనములబట్టి మున్న గురుగోవిందరాయ లనుతనపేరు గురుగోవిందసింగని మార్చెను. ఈఖాల్సాయొక్క సిద్ధాంతములివి.

1. ఖాల్సామతములో జేర్చుకొనునప్పుడు చేయవలసిన కర్మనాడు గురుగోవిందుఁడు దయాసింగు మొదలైనయేవురను జేర్చుకొనునప్పుడు చేసినకర్మమే. అనగా క్రొత్తగానెవరైన నీమతమున జేరునపుడాకర్మచేసి చేరవలెను.

2. ఈవిధముగాజేరినప్రతివాఁడు సింగనుపేరుధరింపవలెను.

3. అయిదుగురుసింగు లెచ్చటనుందురో నచ్చటఖాల్సామతము సంపూర్ణముగ నున్నట్లె భావించవలెను. ఆసింగు లేవురు నేవర్ణములవారైన యుండవచ్చును.

4. ప్రతిసింగుజుట్టుపొడుగుగా పెంచుకొనవలెను. ఎల్లప్పుడాయుధ మేదోయొకటి ధరించియుండవలెను. పొట్టిలాగులు తొడుగుకొనవలెను. ఒకయినుపకడియము దువ్వెనయు సర్వదా తనదగ్గఱనుంచుకొనవలెను.

5. ఖాల్సామతస్థులలో వర్ణభేద ముండగూడదు. అందఱేకవర్ణమువారై యుండవలెను. ఒకరికన్న నొకరెక్కువతక్కువయను భేదములుండక నందఱు సమానస్థితిలో నుండవలెను.

6. ఖాల్సామతస్థుఁడు ప్రతివాఁడు వృత్తినాశకుఁడు కులనాశకుఁడు ధర్మనాశకుఁడు కర్మనాశకుఁడునై యుండవలెను. అనగా నిది గొప్పవృత్తి యిది నీచవృత్తియనక యన్నివృత్తులు సమానములని పాటింపవలయును. వాఁడు గొప్పకులమువాఁడని వీఁడు నీచకులమువాఁడని భేదమెన్నకుండ నందఱును సమానముగ జూడవలయును. కులధర్మములు పిచ్చిపిచ్చి కర్మలు మానవలయును.

7. ప్రతిఖాల్సా మతస్థుఁడు నాయుధములయందుమిక్కిలి ప్రీతియు గౌరవము గలిగి యుద్ధము పండుగగ దలంపవలయును. ఎవ్వఁడు యుద్ధములో శత్రువును జయించునో తానోడిపోయి నను నిరుత్సాహుఁడు గాక యుండునో యతఁ డీలోకమున బర లోకమునఁగూడ మహోన్నతుఁడగును.

8. ప్రతిసింగు నిష్కళంకమైన నడత గలిగి యుండవలెను.

9. ప్రతిసింగు చాలా మతవిశ్వాసమే మోక్షసాధనమని నమ్మవలెను.

10. ప్రతి ఖాల్సామతస్థుఁడు జననమరణ రహితుఁడై యవాఙ్మానస గోచరుఁడై సత్యస్వరూపుఁడైన పరమేశ్వరుచే మానసికముగ నారాధింపవలయును గాని బ్రతికియుండిన జంతువునుగాని చచ్చిన జంతువునుగాని విగ్రహములనుగాని పూజింపఁగూడదు.

11. ఈ మహాత్ములందఱు గురునానకును నతని యనంతరము వచ్చిన తక్కినగురువులను మిక్కిలిగౌరవింపవలెను. వారి సిద్ధాంతములుగల యాదిగ్రంథము పరమప్రమాణముగ నెంచుకొనవలెను.

12. హిందువులాచరించుకర్మలు సీకు లాచరింపఁగూడదు కాని వారి పుణ్యక్షేత్రములు తీర్థములు వారి సిద్ధాంతములు మొదలగువానిలో సీకులు తమకుగూఁడ భాగ మున్నదని తెలిసికొని వానిని గౌరవించవలెను. హిందువులయొక్కయు హిందువుల ధర్మములయొక్కయు సంరక్షణమునిమిత్తమై సింగులు తమ యర్థప్రాణములనిచ్చి పోరాడుట విధియని గ్రహింపవలెను.

13. తురుష్కులను నిర్మూలనముచేయుట ప్రతిసింగునకును నుత్కృష్టమైన ధర్మవిధి.

14. సీకులు పొగాకు నేవిధముగ నుపయోగింపగూడదు.

15. ఖాల్సామతమునందు సర్వనియామకుఁడైన భగవంతు డెల్లపుడు నిలిచి యుండునని గ్రహింపవలెను.

16. ప్రతిఖాల్సామతస్థుఁడు దనకు వీలగునప్పు డమృతసరు పట్టణమునకు బోయి యచ్చటి సరోవరంబునంగల పుణ్యజలంబుల స్నానమాడుచుండవలెను.

17. సీకు లొండొరులం గలిసికొన్నపుడుఁ "నాగురుకాఖాల్సాను గురుజీకీ ఫతే" యని సలాములు చేసికొనవలెను. మఱొకవిధమైన మర్యాద వారు చేసికొనగూడఁదు.

నాడు సభలో నుండిన సీకు లందఱు గురుగోవింద ప్రోక్తములైన ధర్మములన్నియు ప్రమాణములని నమ్మి వాని ప్రకారము నడచుకొనునట్లు శపథము చేసిరి. సింగుశబ్దమునకు సింహార్థము. సింహమని పేరుపెట్టుకొని రణమున మేకవలె బాఱిపోవుట కెవ్వనికి మనసొప్పదని యతఁడు ప్రతివాని కానామ మిచ్చెను. కత్తి పాసకమున నుంచుటవలన నిజముగ శౌర్యము ప్రతివాని హృదయమున నెలకొనదు. కాని హిందూదేశమున నట్టి సనాతనాచార మొకటి పూర్వకాలమునుండియు గలదు. పూర్వము రాజపుత్రులలోను బెలూచి స్థానవాసులైన హిందువులలోను మగశిశువు గలిగినతోడనే గిన్నెలో నీళ్ళుపోసి కత్తి కొనయందు నుంచి యానీటిచుక్కలు రెండు శిశువునోట బోసెడి యాచార మొకటి యుండెను. సీకు లీయాచారము భయభక్తులతో జేయుటకై గోవిందుఁడు దానిని మతసిద్ధాంతముగ మార్చెను. ఎల్లప్పుడాయుధములు ధరించవలసినదని చెప్పుటవలన సీకు లటుమీఁద నెల్లప్పుడు యుద్ధమునకు సిద్ధముగనుండ వలసినదని యాతని యభిప్రాయము. అట్లు వారిని వీరులుగ జేయకపోయినపక్షమున మహమ్మదీయుల బాఁటిపడి సీకుమతము నశించునని భయపడి యట్లు చేసెను.

## వెలియైనవారు.

సర్వవర్ణములవారు నెల్లతెగలవారు సీకుమతమున జేర వచ్చుననుటచేత గురుగోవిందుఁడు గుణదోషములు విచారింపక యందఱు దనమతమున గలుపుకొనియెనని మనము తలంపరాదు. ఏలయన నతఁడు కొన్ని తెగలువారిని స్వమతంబునం జేర్చు కొనక వెలివాండ్రుగఁ జేసెను. అందు మొదటివారు ధర్మశాలా పరిపాలకులు. అనగా సీకుదేవాలయముల యొక్కయు ధర్మసత్ర ములయొక్కయు ధర్మకర్తలు. సీకులు విగ్రహారాధనము సేయక పోయినను మహమ్మదీయులకు మసీదులు, క్రైస్తవులకు చర్చిలు నుండినట్లే వీరికిగూఁడ కొన్ని పావనస్థానములు గలవు. అవే ధర్మ శాలలనియు దేవాలయములనియు జెప్పఁబడును. ఈధర్మశాలాధి కారులు సోమరులు; భోగపరాయణులు; దుర్బలులు. అది కారణముగ వారు యుద్ధమున కనర్హులు. మఱియు గురుగో విందుని తండ్రియగు తేజబహదూరు శత్రుపీడితుఁడై యమృత సరమందున్న “దర్బారుసాహేబు” అను పేరుగల బంగారు గుడికిబోయి దానిలో దాను తలదాచుకోవలెనని ప్రయత్నింప నాయాలయ పరిపాలకులు స్వమతాచార్యుఁడను నభిమానమైన లేక లోపల నడుగు పెట్టనీయరైరి. అప్పు డాయన స్థలాంతర మున కరిగి బహుకష్టముమీఁద బ్రాణరక్షణము చేసికొనియెను. ఈరెండు కారణములచేత ధర్మశాలా పరిపాలకులు స్వలాభపరా యణులై మతాభిమానశూన్యులై స్వార్థత్యాగవిముఖులై నెం

దుకుం బనికిరాక యుండిరని యెంచి యతఁడు వారిని శిష్యు లుగ బరిగ్రహించుట కంగీకరింపలేదు. ధరమల్లు రామరాయలు యొక్క యనుచరులు బహిష్కృతులలో రెండవవారు. ఆయిరు వురు తేజబహదూరుతో చిరకాలము వైరముగలిగి యతనిని గుమారునిగూడ ద్వేషించి వారికి బలుసంకటములు గలిగించిరి. కలిగించుటయేగాక నిరంతరము సిక్కుమతమునకు శత్రువులై దానిని నాశనము చేయదలంచిన వారి నాశ్రయించి వార యను గ్రహామునకు బాత్రములై యుండుటంజేసి వారు మతస్వీకార మున కనర్హులని యతఁడు భావించెను. గురువీ బహిష్కారము ద్వేషముచేత చేసెనని మన మనగూడదు. ఇందు ద్వేష మేమియు లేదు. ప్రక్కలో బల్లెములట్టులుండి పలుసిలుగులు పెట్టుచున్న నగవాండ్రను జేరదీసినయెడల వారు సంఘములో నంతఃకలహ ములు గల్పించి మొదటికే మోసము దెత్తురని గోవిందుఁడు దూరమాలోచించి యీపని జేసెను. వణిజులు బహిష్కరింపఁ బడినవారిలో మూఁడవవారు. వణిజులు సాధారణముగ నీలో కపు మనుష్యులు గాని యాలోకపు మనుష్యులుకారు. ఏదో వ్యాపారము చేసికొని ధనమార్జించుటయే పురుషార్థమని వారు భావించుటచేతనో వారు పిరికివాండ్రని లోకులు చెప్పుకొనుట చేతనో వణిజులు మతస్వీకారమునకుఁ బనికిరారని యతఁడు శాసించెను. కాని యతఁడు పొరబాటు పడెనని మనమూహింప వలెను. ఏలయన మనుజుఁడు తరతరములనుండి యేవృత్తి కల వాడుపడునో యావృత్తి యందు మిక్కిలి నేర్పరి యగును. క్షత్రి

యుఁడు పితృపితామహులనాఁటంగోలె కత్తిపట్టి పోరాడుట కల
వడుటంజేసి యతఁడు పోటుమానిసియయ్యె. వ్యాపారమున కల
వడుటంజేసి వణిజుఁడు రణపరాఙ్ముఖుఁడయ్యె. అంతియెగాని
జన్మముచేతనె పిరికి కండవారు పోటుమానసులు నుండరు. ఎట్ల
యిననేమి గురువు వారిని జేపట్టలేదు. జనులు వెలివాండ్రలో
నాల్గవవారు. వారును వణిజులట్లే వాణిజ్యపరాయణులు. అదియుం
గాక వారికి వెఱ్ఱిభూతదయ గలదు. మంచము నల్లులుపట్టి పుచ్చి
పోయినను వారొక్క నల్లినైన జంపరు. తలనిండ పేలు కోల
కోలలాడుచున్నను పేలుచచ్చునను భయమున తలదువ్వుకొనరు.
ఈగలు మొదలైనవాటి కాహారము దొరకదని జాలిపడి మేనం
బుట్టిన పుండ్లు కుదుర్చుకొనరు. పగలీగలు పీకుచున్నను రాత్రి
నల్లులు కుట్టుచున్నను తమమేని నెత్తురు ధారవోసి యాజంతు
వులను బోషించి పుణ్యమార్జించుచున్నామని తలంతురే కాని
తమకార్యము జనవిరుద్ధమని వారు తలంపరు. అట్టిబాధలు
తాము పడలేనప్పుడు పెద్దచుట్టములం బిలిపించి వారు కోరిన
రొక్కమిచ్చి యానల్లులమంచముమీఁద వారిం బండుకొనబెట్టి
నల్లులపోటులు బడలేక నడిరేయి వారు మంచముఁ దక్క విడిచి
పారిపోవుదురని శంకించి వారి కాలుచేతులు గట్టిగా మంచము
లకుగట్టి తాము చేయుచున్న భూతతృప్తి కానందించుచుందురు.
మనుష్యుని బాధించి మత్కుణములం బోషించుట కాకులను
గొట్టి గ్రద్దలకు వైచుట యనుమాట వారెఱుఁగుదురు. ఇట్టి
మూఢవిశ్వాసములకు దాసులైన జనులను శిష్యులం జేసుకొన్న

యెడల వారు నెత్తురు చూడగానే మొగము దిరిగిపడి పారి పోవుటయేగాక పిరికితనముమాత్రలు తోడివారికందఱకు వైచి కోఁపతీయవచ్చునని భయపడి గోవిందసింగు వారిబహిష్కృతులం జేసెను. ఇట్టివారినే యామ్నున తనసంఘమునకు వెలివాం డ్రుగఁజేసెను. ఇది యౌచిత్యము పాటించి చేసినపనిగాని విమ ర్శింపక వేగిరపడి చేసినకార్యముకాదు.

---

## కొండదొరలతో కలహము.

గురుగోవిందుని నూతనమతము పొరుగుననున్న కొండ రాజుల కాగ్రహము గలిగించెను. హిందూమతసంరక్షణార్థమును సిక్కుమతరక్షణమునకును నతఁడు కంకణము గట్టుకొని యంతవఱకు నిర్జీవములైన మనుష్యులహృదయములలో జీవముపోసి యుత్సా హము కల్పించి వారిని సత్కార్యములకుఁ బురిగొల్పుచుండ దాని ప్రభావము వారు గ్రహింపలేక గురుగోవిందుఁడు తాను జగదేకగురుఁడై ప్రతిష్ఠ సంపాదింపవలెనని స్వలాభపరాయణుఁడై యట్లు చేసెననియు బైకి హిందూమతసంరక్షణమని చెప్పుచున్నా డేకాని నిజముగా వర్ణసాంకర్యముచేసి హిందూమతము పాడు చేయ నంతరంగమున దలఁపెట్టినాఁడనియు నూతనముగ నతఁడు కనిపెట్టిన పంచామృతపాన సిద్ధాంతము పాపహేతు వనియు నతని సాహచర్యముకూడ దగదయు తలంచి యతనిం దూషించి

యతనితో గిల్లికయ్యము బెట్టుకొన జూచుచుండిరి. తనకట్టి దురుద్దేశము లేదని యతఁడెన్నిసారులు నొక్కి-చెప్పినను వారా యన మాటలు పెడచెవిని బెట్టి యతనిమాటలు కల్లలనియుఁ దన క్రొత్తసైనికులచేత ముందుగా నిరుగుపొరుగుననున్న దమ్ము నిర్మూలనము చేయించుననియు నీచవర్ణములలోనుండి వచ్చి కృత్రిమక్షత్రియులుగా జేయబడిన యాసంకరసైనికులు పురాతన రాజవంశములు నిర్మూలించుటకు వెనుదీయరనియుఁ దమ్ము కుంకటివేళ్ళతో నిర్మూలించి గొప్పరాజ్యము స్థాపించుట కీపన్నుగడ పన్నెననియు వారు సిద్ధాంతీకరించిరి. కావున గురుగోవిందుని సంకల్పము పండకమున్న మొగ్గగా నున్నపుడె త్రుంచివైచుట సముచితంబని యాకొండరాజులె ముందు నెయ్యమును భేదించి కయ్యమారంభించిరి. దేశాభిమాన పరాయణుఁడైన గురుగోవిందుఁడుఁ తనసైన్యమును ద్రవ్యమును హిందూసిక్కు మతములకుఁ విరోధులైనవారియెడ వినియోగించుటకై నిశ్చయించుకొనెను. కాని స్వప్నమందైన స్వదేశస్థులతోఁ బోరాడ వలసివచ్చునని తలంపలేదు. అట్టి పోరాట మెంతమాత్ర మతని కిష్టములేదు. కాని యతఁడెవ్వరిసఖ్యము గోరెనో వారికి దేశాభిమానములో నూరోవంతైన లేదు. వారిహృదయములు లసూయకు నాగ్రహమునకుఁ దావలము లయ్యెను. కాని దేశోద్ధరణహేతువులైన యుదారభావములకు నెలవులు కాకపోయెను. తనతో మైత్రి పాటింపవలసినదనియు దనమతమునఁ జేరవలసినదనియు నతఁడు వారికి సందేశమంప నది పరాభవముగఁ దలం

చిరి. అందువలన గురుగోవిందుఁడు పరులను నమ్ముకొనుట నిష్ప్రయోజన మనియు స్వసైన్యమునే నమ్ముకొని తనపై నెత్తివచ్చిన వారి నెదుర్కొనవలసి యుండుననియు నెంచి తాను సమర సన్నాహముఁ జేసెను. ఆనందపురము విడువవలసినదనియుఁ దమచుట్టుపట్ల నెచ్చట నుండక విదేశములకుఁ బోవలసినదనియు గోవిందుఁడా దేశమున నుండుటవలన దమకు గలిగిన నష్టమునకుఁ బ్రతిఫలముగ గొంతద్రవ్యము దమకీయవలసిన దనియుఁ గొండదొరలు సందేశమంపిరి. ఆనందపురము తన సొంతమనియు నవ్వీడు కట్టినస్థలము తనధనముతోనే నిలిచెననియు నంతియగాక విశేషద్రవ్యము వ్యయముచేసి కోటలు గృహములు కట్టింపఁబడెననియు నందుచేత నది విడుచుటకు వీలులేదనియు నతఁడు మరల రాయబారమంపెను. ఒకనాడు గురుగోవిందుఁడు స్వల్ప పరివారముతో వేఁట కరిగియుండ నతనిగెల్చుట కదియె మంచి సమయమని యలంచందుఁ డనునొక రాజును బలియుఁడను మఱి యొకరాజును గలిసి కుట్రపన్ని యెక్కువ పరివారముతో నతని మీఁద దుమికిరి. కాని గోవిందుని సైనికులు స్వల్పసంఖ్యాకులయ్యు మిక్కిలి శౌర్యముతో బోరాడిరి. కొండరాజులు తలఁచిన దొకటి దైవము చేసిన దొకటి యయ్యెను. గోవిందుని యల్పపరివారముచేఁ గొండదొరల యధికపరివారము పరాజయమునొందెను. విశేషించి బలియుఁడను నతఁడు కొందఱనుచరులతో నాకయ్యమున బ్రాణములు విడిచెను. ఈపరాభవాగ్ని హృదయమును దాల్చుటచే హతశేషులైన మన్నెదొరలు

తక్కిన కొండరాజులం గలియగట్టుకొని సర్ హిందూదేశపరి పాలకుఁడైన తురకతో నెయ్యముగావించి యాతని సహాయముం గూడఁ బడసి రెండవసారి గురుగోవిందునిమీఁదికి బోయిరి. ఈసారికూడ జయము గురునిదే యయ్యెను. తురకలు కాంది సీకులై సీక్కులముందర నిలువలేక పలాయితులైరి. ఈకయ్యమున గోవిందుని జ్యేష్ఠపుత్రుఁడైన యజితసింగు మేటిమగంటిమి జూపి యెల్లర కాశ్చర్యము గలిగించెను. శత్రుపక్షమున వచ్చిన వారిలో నొకఁడగు రాజా కేసరిసింగు రణనిహతుఁ డయ్యెను. తక్కువజాతులను దనమతంబున గలుపుకొనుటచే గోవిందునకు గలిగిన యమితలాభ మీరణమునం గనబడెను. తక్కువజాతివాఁడైన విచిత్రారుసింగు గురువుచేత క్షత్రియుఁడుగఁ జేయబడి గౌరవము గాంచియుండి యానాటి పోరాటములో మిక్కిలి వన్నెకెక్కెను. ఆనందపురము కోటతలుపులు భేదించుటకై పగతురు మదపుటేనుగు నొకదానిం బంపిరి. అది దుర్నిరీక్ష్యతేజముతో నేల యదురుఁట్లు కవాటపాటవమునకై యురుదెంచుచుండ విచిత్రారసింగునకు గురువు కనుసన్నఁ జేసెను. తోడనే యాసింగు సింగమువలె మత్తేభముమీఁదఁబడి తన ఖడ్గముతో దానిమొడలెల్ల గాయములు చేసెను. అకైనువు పోటులు తిన లేక యాదంతావళము వెనుకకు మరలి స్వసైన్యముమీఁదబడి నాశనము జేసెను. ఈవిజయమైన తరువాత గురువానందపురము విడిచి కొండమీఁదనున్న కీర్తిపురము జేరెను. కీర్తిపురముఁజేర కీర్తిమంతుఁడై యున్న యా గోవిందుని జూచి పరాజయంబున

నపకీర్తిమంతు లయిన కొండరాజులును మహమ్మదీయులును మిక్కిలి యసూయచే బీడితులై యుభయులుఁ దనసైన్యములం గూర్చుకొని మూఁడవసారి గురువుమీఁదికి దండువెడలిరి. సీకులు దుర్వారవిక్రమముతోఁ బోరినను జయముమాత్రమీసారి శత్రువులకెదక్కెను. గోవిందుఁడు పరాజయమునొంది యానందపురికి బాఱిపోయెను. ఆపురమును శత్రువులు ముట్టడించినందున నతఁడు హతశేషులైన పరివారముతోఁ వారిబారిపడి నాశనము నొందకుండ వారికన్న ప్రాబి మిక్కిలి నేర్పుతోఁ షాహిలీ పరగణాలకు బాఱిపోయెను. ఇట్లాతఁడు పరాజయమునొందుటకు రెండు మూఁడు కారణములు గలవు. ఆతని బంటులలోఁ గొందఱు పగతులయొద్ద లంచములుతిని వారిలోఁ జేరిరి. కొందఱు ద్రోహులై మంచిసమయమున వారినివిడిచి పారిపోయిరి. శత్రుసేన వాని సేనకంటె నధికముగ నుండెను. ఈయుద్ధసంబంధమున నొకచిన్న కథ చెప్పవలసి యున్నది. పిషావరు పురవాసియైన జోగిసింగను నతఁడు నెఱజెవ్వనంబునందున్న దండిమగఁడు యుద్ధమాసన్నమగు నప్పటికి వానికి వివాహము సమీపించెను. అందుకు రమ్మని తలిదండ్రులు జాబువ్రాసిరి. అతఁడాజాబు గురువునకుఁ జూపి నాకిప్పుడేమి యాజ్ఞయని యడిగెను. వివాహదీక్షితుఁడవై యాకార్యము ముగిసిన వెంటనే యిక్కడకురమ్మని గురువానతిచ్చెను. ఆయన శిరసావహించి యతఁడు నిజనివాసమున కరిగి వివాహదీక్ష ముగిసినతోడనే తలిదండ్రులు చుట్టములు వెళ్ళవలదని బతి

మాలుచున్నను, వారిమాటలు వినక పసుపుబట్టలతోడనె గురువు వద్దకుఁ బోయెను. సమయభంగులై మహాద్రోహులై గురువును మంచి సమయమున విడిచినవారును గలరు. ఈవిధముగ ధర్మబద్ధులై స్వార్థత్యాగముఁ జేసినవారును గలరు.

---

## గోవిందుని విజయము.

ఆ పరాజయమైన వెనుక ననంతరకర్తవ్యమేమిని గోవిందుఁడు దీర్ఘవిచారముఁజేసి మరల దగిన సైన్యమును గూర్చుకొని స్వమతమునకు దేశమునకు శత్రువులైన వారిని భంగపెట్టి హృదయవ్రణము మాన్పుకోవలెనని నిశ్చయించుకొనెను. సోవారి రాజునొద్ద కొన్నిదినములుండి యచ్చోటువాసి మఱియొద్దఱు రాజులకడకుఁబోయి కతిపయదివసములచ్చటనుండి తరువాత మండిసంస్థానాధిపతియైన దోహారసేనుఁ డాహ్వానము సేయ నతనిదేశమున కరిగి యతని యాదరమువడసి యచ్చటనొకకోట గట్టుకొని యందుండెను. అతఁడాకోటలో నుండగా నొందఱు సీకులు వానినిమిత్తము కొన్నికానుకలం బట్టుకొని పోవుచుండిరి. గాల్మోటసంస్థానాధిపతి యదియెఱిఁగి తనబంట్లంబంపి యాకానుకలు దోఁపించుకొని పోయెను. సీకులావార్త గోవిందునకు విన్నవింప నతఁడు మిక్కిలి యలిగి యారాజును దండింపుమని

కుమారుఁడైన యజితసింగును గొంతసైన్యమిచ్చి పంపెను. కాలోట్రరాజును యుద్ధసన్నద్ధుఁడై తనమిత్రుఁడైన జ్వాలాముఖిమహాంతును పిలిచెను. జ్వాలాముఖిమహాంతు పూర్వాచారపరాయణుఁడు. నూతనమతస్థాపకుఁడైన గోవిందునిమీఁద నతని కమితాగ్రహముఁ గలిగెను. గోవిందుఁడు నాస్తికుఁడనియు నతఁడు వధ్యుఁడనియు దలంచి పగదీర్చుకొనుట కెదురుచూచుచుండెను. అంతలో మిత్రుఁడను కాలోట్రరాజు పిలిచినందున నైదువందల సైనికులతో నతఁడు వానిని జేరెను. స్వసైన్యముకంటె శత్రుసైన్య మధికముగ నున్నదనివిని గోవిందుఁడు కుమారునకు సాయము జేయఁదలంచి స్వయముగ రణరంగమున కరిగెను. యుద్ధము భయంకరముగఁ జరిగెను. కాలోట్రరాజు మహాంతు పరాజయము నొందిరి. మహాంతుయొక్క గ్రామము కొల్లపెట్టబడెను. తన బుద్ధితక్కువకు మహాంతు పశ్చాత్తాపము నొందెను. కాని ప్రయోజనము లేకపోయెను. ఈవిజయము కలిగినపిదప గోవిందుఁడు పూర్వనివాసమైన యానందపురమునకుఁ బోయెను. అప్పటికాకోట శిథిలావస్థలోనుండెను. కూలిన గోడలు పోయిన బురుజులు మున్నగునవి బాగుచేయుటకై గురుగోవిందుఁడు విశేషద్రవ్యము వ్యయము చేయవలసివచ్చెను. ఆకోట మరమ్మతుచేసి యాక్రమించి తన నలుగురుకొడుకులకు పహులువులు దక్షిణలిచ్చి స్వమతమున గలుపుకొనెను. అప్పుడు కురుక్షేత్రమున గొప్పతీర్థము జరుగబోవుచున్నదని యతఁడు విని యచ్చోటికతఁడు పోవదలంచెను. హిందూదేశముయొక్క

నానాభాగములకు ముఖ్యముగ వేనవేలుజనులు చేరునట్టి తీర్థములకుఁబోయి యచ్చట స్వమతవ్యాప్తి చేయవలయునని యతనిసంకల్పము. ఆసంకల్పసిద్ధి కతఁడు కురుక్షేత్రమున కరిగెను. అరిగి పూజ్యులగు బ్రాహ్మణోత్తములకు భూరిసంభావనలిచ్చి వారి మెప్పువడసి పిమ్మట స్వమతము బోధించెను. అతఁడెందఱిని దనమతములోఁ గలుపుకొనెనో తెలియదు. పదపడి యతఁడు కురుక్షేత్రమునువిడిచి స్వస్థానమున కరిగి తనవ్యవహారములు చక్కజేసికొనఁజొచ్చెను.

కొండరాజు లప్పుడైనను తమదుండగమును మానలేదు. తాము మున్ను గెలిచిన గెలుపులు తమ కెంతమాత్రమును బ్రయోజనకారులు గాకపోయె ననియు గురుగోవిందుఁడు మున్ను పరాజితుఁడైనను వానికి దేశమునగల పలుకుబడి గౌరవము తగ్గలేదు; గావున వాని నెట్లయిన నాశనము జేయవలయునని కృతనిశ్చయులైరి. కాని మనోరథసిద్ధికిఁ దగినబలము కాని ద్రవ్యము కాని వానికడ లేకపోయినందున హిందూమతమునకును గురుగోవిందునకును వానితండ్రికిని గూడ శత్రువైన యౌరంగజేబు పాదుషా నాశ్రయింపదలఁచి తమకు సహాయముఁ జేయుమని వేడుచు వానికడకొక రాయబారినంపిరి. ఆదూత చక్రవర్తి సన్నిధి కరిగి గురుగోవిందునిమీఁద నెన్నో నేరస్థాపనలు కల్పించి కృతకృత్యుఁడయ్యెను. అందు ముఖ్యమైన వివి. "గురుగోవిందుఁడు దొంగమతము గల్పించి మూఢులను మందబుద్ధులను దానిలో జేర్చికొని దేశపరిపాలకులమీఁద వారికి ద్వేషము గలిగించుచు

న్నాఁడు. అతనిబలము క్రమక్రమముగ వృద్ధియగుటజేసి ముందు ముందు మొగలాయిరాజ్యమునకె భంగము కలుగవచ్చును. అతని గర్వోన్మత్తత యెంతదూరము వెళ్ళినదనగా "నేనే హిందూస్థానమంతకు బాదుషాను నాకన్న బాదుషాలులేరు. ఇప్పటికి ఢిల్లీ చక్రవర్తి పనికిమాలినవాఁడు వానిని నేనూడబెరికెద" నని కారులఱచుచున్నాఁడు. మహమ్మదీయమతము హిందూదేశములోనుండి కుంకటివేళ్ళంతో వెల్లగించివైతు నని యతఁడు ప్రతిదినము డప్పులుపెట్టి చాటించుచున్నాడు.

అనిచెప్పి చక్రవర్తిం బురికొల్పి యాగ్రహము తెప్పించి కొండరాజులకు సహాయముగ గొంతసైన్యము పంపుమనియు దొంగల దొరయగు గురుగోవిందుని నాశనము జేయవలసినదనియు వేడుకొనెను. చక్రవర్తి యావేడికోలు మన్నించి యచిరకాలములోనె కొండరాజులకు సహాయముగ గురుగోవిందుని దండించుటకై కొంతసైన్యమునుబంప వాగ్దానము చేసెను. ఆరాయబారి యరిగిన కొలఁది కాలమునకె గురుగోవిందుని బట్టుకొని బ్రతికియుండఁగా ఢిల్లీకి బంపవలసినదని యౌరంగజేబుచక్రవర్తి సర్హిందుపరగణా సుబేదారైన బయుజీదుసింగు పేర వ్రాసెను. ఒకవేళ సైన్యము చాలకున్న ఢిల్లీనుండి పదివేలసేననిచ్చి యమీరుఖానును బంపుచున్నట్లుగూడ నాలేఖలో వ్రాసి యాప్రకార మతనిని పంపెను. చక్రవర్తిసైన్యము కొండరాజులసేనం గూడి యానందపురము ముట్టడించెను.

శత్రుసేన మిక్కిలి గొప్పదిగా నుండుటచే గోవిందుఁడు వారి నెదుర్కొనక మంచియదను చిక్కువఱకు తనకోటలోనె యుండి వలయునప్పుడు పగతురపైఁబడి చెరుపవచ్చునని తలంచి లోపలనె యుండెను. ఆఱుదినములు పగతురు కోటముట్టడించిరి. కాని కోటంబట్టుకొనలేకపోయిరి. గోవిందుని సైనికులుగూడ పలువురు నిహతులైరి. ఆఱవనాఁడు మంచియదను గలిగినందున కోటలోనుండి యాతఁడు సేనాసమేతుఁడై బయలుదేఱి మొగలాయి సైన్యమును బటాపంచలు చేసెను. పేరువడిన యిద్దఱు తురకదళవాయిలు గురుని కత్తికె యెరయైరి. తురక సేనాపతియైన యజమీరుఖందునకు గొప్పగాయము తగిలెను. తురకలు తిరిగి చూడక పాఱిపోయిరి. సీకులు వారిని దరిమితరిమి కొట్టిరి.

---

## గోవిందుని పరాజయము.

తనసైన్యము గురుగోవిందునిచేత పరాజయము నొందెనని విని చక్రవర్తి మేరమీఱిన కోపముఁజెంది యెట్లయిన గురుగోవిందుని సంపూర్ణముగ నాశనము చేయవలయునని నిశ్చయించుకొని మహాసైన్య సమేతులై గురుగోవిందునిమీఁదికి దాడి వెడలవలసినదని కాశ్మీరపరిపాలకుని నియోగించెను. అట్లు నియోగించుటలో గోవిందసింగును వాని యాలుబిడ్డలను వాని యనుచరులను నిర్మూలింప వలసినదని యాజ్ఞాపించెను. ఆపరి

పాలకు లిద్దఱు సర్ హిందూపరిపాలకునిగూడ గలిసికొని కొండ రాజులం గూర్చుకొని మహాసేనా సమేతులై యానందపురము ముట్టడించిరి. గోవిందుఁడు తనసైన్యమును ముందు నాలుగు భాగములుగ విభజించి నలుదెసలం బెట్టఁదలఁచెను. కాని మొగలాయిసేన మహాసముద్రమువలె మేరమీఱియుండుటచే దన దళ మొక్కచోటనే యుండుట సముచితమని దాని నానందపురమునసే నిలిపెను. మొట్టమొదటినాఁడు తురకలు మిక్కిలి విజృంభించిరి. ఆవిజృంభణ మాపుటకై గురుగోవిందుఁడు తన జ్యేష్ఠపుత్రుఁడగు నజితసింగును గూడుకొని శత్రువుల నతిఘోరముగ దాఁకెను. మొగలాయిసైనికులు మహోగ్రమూర్తులగు నా రెండు సింగంబులయెదుట నిలువలేక చెల్లాచెదరై పరుగెత్తిరి. మొదటి నాఁడు పరాభవము జరుగుటచే మొగలాయీలు రెండవనాఁడు తమఫిరంగుల బారుపెట్టి కోటం దాకిరి. పట్టపగలు వారిం దాకుట కవకాశము లేనందున గోవిందుఁడు నిశాసమయమున మహమ్మదీయ సైన్యములు నిద్రాముద్రితములైన కాలమున తనయల్ప సైన్యములతో గోటవెడలి ప్రమత్తులై యున్న పగతురపై బడి పలాయితుల జేసెను. అంతట మహమ్మదీయ సైనికులు తమకు సాయముగ ఢిల్లీనుండి మరల బలంబులు వచ్చునందాక కలహ మాపివైచిరి. 1761 వ సం॥ రము చైత్రమాసమున మహమ్మదీయ సైన్యమునకు మరల సహాయముగ గొంతసేన వచ్చుటం జేసి వారు మునుపటికన్న దిట్టముగ నానందపురముకోట ముట్టడించిరి. గోవిందునిసేన క్రమక్రమముగ క్షీణించెను. భోజనసామ

గ్రులు సన్నగిల్లిపోయెను. సరుకులుపైనుండి వచ్చుట కవకాశము లేదు. గోవిందుఁడు నమ్మినబంటు లందఱుఁ దమకింక జయము చేకూరదని దిగులుజెంది కూలబడి యటుమీఁద నెంతమాత్రము జాగుచేయక శత్రువులపైఁబడి వారిని నాశనము చేయువఱకు తాము నాశనమగువఱకు పోరుదుమని గురువుతో జెప్పిరి. సాహసించుట స్వనాశనహేతువనియు దగుకాలమునచ్చునవఱకు నిరీక్షించుట మంచిదనియు గురువు బహువిధముల నుపదేశించెను. కాని వారామాటలు పెడచెవింబెట్టిరి. గురువు వారిమొండితనముజూచి విసిగి యెవరియిష్టమువచ్చినట్లు వారుచేయవచ్చును. కాని నన్ను విడిచినవాఁడు నామతము విడిచినవాఁడె యగునని కఠినముగ బలికెను. ఆపలుకులువిని సిక్కులలో ననేకులు భయము, భక్తి, రోషముఁ దమ్ము బురికొల్ప మేనులయందుఁ బ్రాణము లున్నత కాలము పిఱికి కండలుగల కొందఱు మేము సిక్కులముగాము పోవుచున్నామని యాయనను విడిచి పోయిరి. ఆ యల్పసైన్యముతోడనే గురువు కోట సంరక్షించుకొనుచు దగుకాలముకొఱకునిరీక్షించుచుండెను. కోట నేలగూలకపోవుటకు గోవిందుఁడు కోట వెడలి యెంతకాలమునకు నీవలకు రాకపోవుటకు గొండరాజులకు విసుఁగుపుట్టెను. అందుచేత వారు గురుగోవిందున కొక బ్రాహ్మణునిచేత నిట్లు సందేశ మంపిరి. మీరు కోటవిడిచి మీ యిచ్చవచ్చిన తావునకు బోయినపక్షమున మీ కుటుంబమునకు మీకు హానిచేయకుండ మేము నడలెదము. ఇట్లు చేయకపోయిన పక్షమున మేము గోహత్య చేసినట్లే. ఆ సందేశార్థములు సత్యములని నిష్కపటియైన గురుగోవిందుఁడు నమ్మి తనకుటుంబమును

వెంటబెట్టుకొని కోటవెడలెను. అతఁడు కోటవెడలగానె హిందువులు మహమ్మదీయులుగూడ తాముచేసినబాసలు దప్పి యూరెల్ల గొల్లపెట్టి కోట గూలంద్రోసి తమమాట నమ్మి శిశువులతోడను స్త్రీలతోడను వృద్ధులతోడను బోవుచున్న గోవిందుని వెంబడించిరి. అతఁడు వారికందక నిరంతరప్రయాణములుచేసి కొంతదవ్వరిగెను. కాని యక్కడ సర్సానది యడ్డువచ్చెను. ఆ నది నిండు వఱదమీఁద నుండుటంజేసి సేన దాటుటకు వీలులేకపోయెను. శత్రువులు సమీపించిరి. అప్పుడు గోవిందుని చిన్నబిడ్డలను భార్యలను దక్కిన యతఃపురాంగనలను నెట్టులో గుఱ్ఱములమీఁదను నేనుఁగులమీఁదను నెక్కించి యావలకు దాటించిరి. అప్పుడు సింగులకును మొగలాయిసైనికులకును సందడికయ్యము జరిగెను. సింగులందఱు దాదాపుగ నశించిరి. అప్పుడు గురుగోవిందుఁడు హతశేషులైన స్వల్పసైనికులతో వెన్నిచ్చిపఱుగెత్తి చంకర్ కోట జేరెను. ఆకోట చేరునప్పటికతనివెంటఁ దనకుమారులుగాక నలువదిమందిసైనికులు మాత్రమేయుండిరి. గురుగోవిందు నెట్లయినఁ బట్టుకొని ప్రాణములతో ఢిల్లీచక్రవర్తికడకుఁ బంపి యతనిచేతఁ జిత్రవధచేయింపవలెనని కొండరాజులు సంకల్పించి మరల మాయోపాయమువన్ని కోటవెడలించి యతని నావలకు దీసికొని రావలయునని నిశ్చయించి యిట్లు సందేశమంపిరి. "మీరాకోట విడిచి మావెంట మీరాజ్యమునకు మరల వత్తురేని మీకేయపాయము లేకుండదీసికొని పోవుదుము." ఆరాయబారము దెచ్చినయతఁడు తాను మొగలాయీల దూతనని గర్వించి తనయంతర మెఱుఁగక

యహంభావమూన సందేశము మిక్కిలి కఠినోక్తులతో జరిగించి గురువునెడల దుర్వినయము ప్రకటించెను. గోవిందుని జ్యేష్ఠతనూజున కాదుర్వర్తనము దుస్సహమగుటయు నతఁడతిబాల్యకోపప్రేరితుఁడై ఖడ్గమెత్తి యా సందేశము దెచ్చిన రాయబారి తల యొక్కయేటున దెగవేసెను. తెగవేసి కొండరాజులకు బరాభవము గలుగునట్టి మాటలతో నతఁడు మరల సందేశ మంపెను. తమరాయబారి నిహతుండగుటయు దుస్సహమైనసందేశము మరల వచ్చుటయు విని శత్రువులు గురుగోవిందుని నాశనమునందు గృతనిశ్చయులై కోటముట్టడించిరి. సింగులు సింహములట్లు పోరాడిరి. కాని వేనవేలు కరకుతురకలమీఁద నలువదిమంది యేమి చేయగలరు. సాయంకాలమగు నప్పటికి ముప్పదియెనమండ్రుగురు సింగులు నేలపాలైరి. అందులో నతనిపెద్దకొమరులిద్దఱు నుండిరి. జ్యేష్ఠతనూజుఁడగు నజితసింగు నిహతుఁడు కాఁగానే రెండవకుమారుడగు జాజహారసింగు పదునైదేండ్లప్రాయము వాఁడు. పగతురపై దుముకబోవుచు త్రాగుటకు కొంచెము మంచినీరిమ్మని యడిగెను. శూరశిఖామణియైన యాకొడుకుంజూచి గురుగోవిందుఁ డిట్లనియె. "నీవు త్రాగవలసిన దీ నీరుగాదు. ఇంతకంటె నుత్కృష్టమైన జలము మృత్యుదేవత యిచ్చు పానకము త్రాగుము. పో" మ్మని పంచుటయు నా బాలవరుఁడు పగతురం దాఁకి వీరశైన మలంకరించెను. శౌర్యభూషణులును వంశాలంకారులునైన కుమారసింహము లిద్దఱొక్కనాఁడు తనకన్నుల ముందట గతించినప్పుడా దుఃఖము సామాన్య మానవులు భరింప

గలరా! గురుగోవిందుఁడు హిమవత్పర్వతమువంటి ధైర్యసారము గలవాఁడగుటచేతను జననమరణములతత్త్వ మెఱిఁగినవాఁడగుటచేతను శుభాశుభముల పర్యాయము దైవమే కలుగఁజేయుచుండుననువిశ్వాసము గలవాఁడగుటచేతను దుర్భరమైన యీపుత్రశోకమును పరమశాంతముతో సహించెను. కుమారద్వయ మరణానంతరమున మిగిలిన నలువురు మువ్వురతో నటమీఁదగ కర్తవ్యమేమని యాలోచింపఁ జగద్వంచకులైన పగతురను వంచనచేతనే నిర్జించుట రాజనీతియనియు నాపద్ధర్మమనియు జెప్పిరి. అదే కట్టకడపటియుపాయమని యట్లుచేయుటకు గురువొడంబడెను. చీకటిపడినతరువాత గోవిందుఁడు పాఱిపోవుచున్నాఁడు. పాఱిపోవుచున్నాఁడని కోటయొక్క యొకద్వారముకడ శబ్దము వినఁబడెను. వెంటనే గుఱ్ఱములనెక్కి మొగలాయీ సైనికులు వానింబట్టుకొన నరిగిరి. కాని యెంతదూర మరిగినను సింగులదొర కనబడలేదు. అది యరణ్యమార్గమగుటచేతను గాలి చీకటులు క్రమ్ముటచేతను తురకలుముందునకు సాగిపోవలేక వెనుకకు మరలిరి. గోవిందుఁడు పాఱిపోయినదొకవైపు వెఱ్ఱితురకలు వెదకిన దొకవైపు. గోవిందునిబంట్లు తురకలం దప్పుదారిని బెట్టదలఁచి యతని నొకద్వారమునుండి బంపి మఱియొకద్వారము దీసికొని యతఁడు పాఱిపోవుచున్నాఁడని కేకలువైచిరి. ఎట్టకేలకు మహమ్మదీయులు తమతప్పుం దెలిసికొని గురువుచనుదారిని వెంబడించిరి. కాని యాతఁడాలోపున గడుదవ్వరుగుటంజేసి వారి ప్రయత్నములు వ్యర్థములయ్యెను. అట్లు గురువు నలుగురైదుగురు పరాజనులతో నట్టడవులంబడి కన్నుకన్ను గనబడని చిమ్మ

చీకటిలో దైవము మీఁదనే భారముంచి పోయి తెల్లవారునప్పటికి శత్రువులకు దుస్సాధ్యమైన స్థానము జేరెను. కాని మార్గాయాసమునను నిద్రాభావమునను పుత్రశోకమునను నతఁడు కడుం డస్సిపోయెను. పలుగురాలు గ్రుచ్చుకొనియు ముండ్లు దిగియు కాళ్లు నెత్తురువఱదలయ్యెను. ముండ్లుదాఁకి యొడలెల్ల గీచికొనిపోయి గాయములకు నిలయమయ్యెను. కాని శరీరాయాసము నతఁడు సరకుసేయలేదు. ఆదుష్కాలమును దెల్లవారినతోడనే తన్నెవ్వరైన గుర్తించి యొరుల కప్పగింతురేమో యని యతనికి భయము తోఁచెను. భయము తోఁచినట్లుగానె గుజారుజాతివారైన యిరువురు తుచ్ఛులాయనంజూచి యిదుగో గోవిందుఁ డిదుగో గోవిందుఁడని యరచిరి. అదివిని యామహానీయుఁడు మనోధైర్యము చిక్కఁబట్టి మెల్లగా వారికడకుఁబోయి యూరకుండుడని బతిమాలి కొన్ని బంగారు నాణెములు తీసి వారికియ్యఁబోయెను. అవి వారు గ్రహింపక గట్టిగా నరవజొచ్చిరి. వారికేకలు వారిమిత్రులకు వినఁబడకమున్నె గోవిందుఁడొనలోనుండి ఖడ్గమూడబెరికి వారిరువుర శిరస్సులుఁ జెరయొకయేటున నేలంగూల్చెను. అనంతరమతఁడు నిజానుచరులతో మిక్కిలి నాచాటు చోటునకుంజని కటికిరాలు తెలగడగ జేసికొని నేలంబండుకొని తన యవస్థంగూర్చి విచారించుచుండఁగా నన్నము నీరు లేక మిక్కిలి యాయాసపడినందున నతనికి గాఢమైన నిద్ర పట్టెను. మరల రాత్రివఱకు నతనికి మెలఁకువ రాలేదు. నిద్ర సుఖమెఱుఁగ దన్నమాట నిక్కముగదా.

---

## మాళవదేశ ప్రవేశము.

ఆ యడవిలో గురుగోవిందుఁడు తెల్లవారుజామువఱకు నుండి యప్పుడు బయలుదేరి తెల్లవారునప్పటికి మచ్చివారను నొకగ్రామముఁజేరి యొకతోటజొచ్చి యందొకమూల దాగికొనెను. ఆవనయజమానులగు మహమ్మదీయ సోదరులిరువురు తోటలో నిట్టటుఁ దిరుగుచుండ గోవిందుఁడు వారికంటఁ బడియెను. వారొండొరుల నానవాలుబట్టిరి. నిజమతద్వేషులైన కరకుతురకలం జూడగానె తన్నువారు పట్టుకొనిపగతుర కప్పగింతురని గోవిందుఁడు సందేహించెను. కాని యాతురకలు పూర్వపరిచితు లగుటచేత నట్లుచేయఁ దలఁచుకొనలేదు. ఆతురకలు గుఱ్ఱాలవర్తకులు. ఎన్నోసారులు గోవిందునకు గుఱ్ఱములమ్మినవారు. అందుచేత స్వమతద్వేషియైనను వారాయననుబట్టి యప్పగించుట యధర్మమని తలఁచి యభయమిచ్చి యాతిథ్యమిచ్చి విశ్వాసముగల మనుష్యులను సాయమిచ్చి భల్లాలపురము పంపించిరి. చముకారకోటనుండి గురువు తప్పించుకొని పోయినప్పుడు వానితో జనక తమదారిం దాముపోయి తురకవేసములు వైచుకొని తిరుగుచుండిన సీఖులు భల్లాలపురమున గోవిందుం గలిసికొనిరి. గులాబుసింగను నొకసీఖుఁడు మొట్టమొదట గురువును తనగృహమునకు రమ్మని యాహ్వానముజేసి యధికారుల కావిషయము దెలిసినయెడల తన తలమీఁద వచ్చునని భయపడి తనయింటికి రావలదనిచెప్పి గోవిందునకు సహాధ్యాయియు భల్లాలపురపు ఖాజీయునైన మీఁరు మహమ్మదనునాతని గృహ

మునకు బంపెను. అతఁడు తనపూర్వసహపాఠిని మిక్కిలి యాదరించి ప్రియభాషణంబుల సంతుష్టింజేసి భోజనమిడెను. గోవిందుఁడు మహమ్మదీయుల చేతివంటకము తినగూడదని పూర్వము నియమము గలవాఁడయ్యుఁ దనమిత్రుఁడు స్నేహభావమున నిడినయన్నము గడుసారదని నాటంగోలె నాపత్సమయమున సిక్కులు తురకలచేతికూడు తినవచ్చునని శాసించెను. గురుగోవిందుఁడు శత్రుసైన్యము బారిబడకుండ రక్షించు టెట్లని ఖాజీమున్నగు మిత్రులు వితర్కించి గోవిందుఁడు తురకపీరువేసము వేసికొనునట్లు నిర్ణయించిరి. అతని శిష్యులుగూడ తురకవేసములు వేసికొని గురువును సవారీలో గూర్చుండబెట్టి యత డెవ్వరని దారిలో నెవ్వరైన నడిగిన పక్షమున ఖాజీయుచెప్పుచు మెల్లమెల్లగా మాళవదేశము ప్రవేశింపవలసినదని వారలకుపదేశించిరి. గురువు తురకగురువువలె షరాయిలు నీలియంగీలు తొడిగికొని పల్లకిలోగూర్చుండెను. శిష్యులె యాపల్లకి మోసిరి. అందుచేత నెవ్వరి కేవిధమైన యనుమానము గలుగలేదు. ఆకారణమున నతఁడు సురక్షితముగ మాళవదేశముజేరి గంఘురాలయను గ్రామము బ్రవేశించెను. తురకవేసములు దీయకయె యతడచ్చట నాయుధములువిడిచి యాయూరు విడిచి హీరగ్రామమునకుఁ బోయి కృపాళదాసు మహంతుయొక్క గృహమున విడిసియుండ దలఁచెను. కాని యామహంతు పరమభీరువగుటచే రాజద్వేషియైన గురుగోవిందుని దనయింట నిలుపుకొన్న పక్షమున రాజాగ్రహమునకుఁ దాను పాత్రుఁడు గావచ్చునని చకితస్వాంతుఁడై

గురువున కాతిథ్య మీయజాలకపోయెను. అనంతర మతఁడా యూరు విడిచి రేయికోట యను మఱియొక జనపదము జేరి జమీందారుఁడైన యొక మహమ్మదీయున కతిథియయ్యెను. ఆమహమ్మదీయుఁడు మిక్కిలి ప్రసన్నుఁడై గురువును సగౌరవముగ గొన్ని దినములు తనయింట నుంచుకొని యామంత్రణము చేసెను. వారనేక గ్రామములు గడచిగడచి యొట్టకేలకు దన యను గ్రామము జేరిరి. ఆగ్రామమునగొన్ని దివసంబులుండి గొంత మనస్స్థిమితము గలుగుటయుఁ దనవ్యవహారము జూచుకొని కొందఱు సైనికులం గూర్చుకొని యాయూరు విడిచి కోట్కపూరాయను గ్రామము జేరెను. ఆయూరిప్రభువు గోవిందుని మిక్కిలి యాదరించి కొన్ని యాయుధములను గుఱ్ఱములనునిచ్చి కొంతద్రవ్యమిచ్చి తనభక్తిం బ్రకటించెను. కాని చిరకాలము దనగ్రామమున నుండవద్దనియుఁ జెప్పి దన సైనికులను సాయమిచ్చుట దనకిష్టములేదనియుఁ జెప్పి యాజమీందారు గురువును దనయూరనుండి సాగనంపెను. ఆజమీందారునివచనములు గురువునకు గొంత యసంతుష్టిని నాశాభంగమును గలిగించెను. అతఁడు విధిలేక యాయూరువిడిచి దాల్వానను గ్రామముజేరి యచ్చట శోధకల్వాలను సజ్జనుని సాంగత్యముజేసెను. అతఁడు మిక్కిలి పలుకుబడి గలవాఁడు. అతఁడు గురువంతవఱకు దాల్చిన నీలిగుడ్డలు విసర్జింప వలసినదనికోర గోవిందుఁడు సమ్మతించి యాగుడ్డలు పరశురామప్రీతి గావించెను.

తొల్లి యానందపురమును తురకలు ముట్టడించినప్పుడు కొందఱుసిక్కులు గురువుమాటల కెగురాడి మేము సిక్కులమే

కామని వ్రాసియిచ్చి లేచిపోయిరిగదా! అట్టు వారు గురుద్రో హముజేసి పోయిన పిదప వారిని జుట్టములు కాకులుపొడిచినట్లు పొడిచి తిట్టి చీవాట్లుపెట్టి మరల గురుసేవజేసి దోషము బాపికొన వలసినదని నిర్బంధించిరి. అందుచేత వారు పశ్చాత్తప్తులై తాము మున్నుగావించినమహాదోషమునకు ప్రాయశ్చిత్తము గురుచరణసే వయెయనినమ్మి యతఁడున్నచోటువెదకికొనుచువచ్చి కొలువులో వొడియుం జేర్చికొమ్మని పాదములపైబడి ప్రార్థించిరి. వారి దీనాలాపములు హృదయమును గరగింప గురువు వారికోరిక నిరాకరింపలేక వారిని స్వసైన్యమున జేర్చికొనెను.

గోవిందుఁడు స్వదేశము విడిచి విదేశములపాలై పోయి నను మొగలాయీసైన్యము లాతనిని విడువదలఁచుకొనలేదు. గోవిందుఁడు మాళవదేశమున నున్నాఁడని తెలిసికొని సరే హిందూదేశ పరిపాలకుఁడైన వజీరుఖాను గొప్పసైన్యము వెంట బెట్టుకొని మాళవదేశము జొచ్చెను. సమరప్రీతి గలిగి శత్రువులు వచ్చుచున్నపుడు వారికి సమరభిక్ష పెట్టకపోవుట యధర్మమని గోవిందుఁడు తనస్వల్పసైన్యముతోనె వారినెదిరించి కాలోచిత మైన సన్నాహము జేసెను. ఉభయసైన్యములు గలసికొనెను. ఘోరసంగ్రామము జరిగెను. సింగులకన్న తురకలు తురకకన్న సింగులు శ్లాఘాపాత్రముగఁ బోరు సలిపిరి. విజయంబు తనకు తప్పక సేకూరునని గరువతనముఁ బూనియున్న వజీరుఖాను తప్పక పరాజయము నొందెను. తురకబలము పోయినపోకగాఁ బోయెను. సింగులు రెండుమూడు క్రోసులవఱకు వారిని దరిమికొట్టి వారికి

గొప్పనష్టము గావించి లబ్ధవిజయులై వెనుకకుమరలిరి. యుద్ధము
ముగిసినవెనుక గోవిందుఁడు పోటికలను జూడబోయెను. పోయి
సీకుయొక్క కళేబరము కనఁబడగానె యచ్చట కొన్నినిముషము
లాగి యతనిం గొండొక ప్రశంసించును. అట్లు పోవబోవ ముంజస
స్థానప్రభువును దనపక్షమువాఁడునగు మానసింగతని కంటబడెను.
అతఁడు చావలేదు. వచ్చెడుప్రాణముతో బోయెడుప్రాణముతో
నవసానదశలో నుండెను. గోవిందుని కంఠధ్వని చెవిని బడగానే
యారాజు కన్నులు తెరచి యాయనను జూచి మ్రొక్క దలచెను
కాని చేతులు రాకపోయెను. గోవిందుఁడు జాలిపడి నీకోరిక
యేమని యతని నడిగెను అతఁడిట్లనియె. "ఆనందపురమందు
నాడు ద్రోహులై మిమ్ము విడిచిన యాసీకులపేళ్ళుగల కాగితము
మీరు చింపువేయుదురేని నాప్రాణము సుఖముగా బోవును."
అట్లు చేసెదననిఁ గురువుఁ మాటయిచ్చి తనవాగ్దానప్రకారము
గావించెను. ఆడితప్పనివాఁ డగుటచేతనే గురుగోవిందునియందు
శిష్యునికంతభక్తి గలిగెను.

---

## కు మా ర వీ రు లు.

గురుగోవిందుని నలుగురు కొడుకులలో మొదటియిద్దరు
కుమారులు సంగ్రామ నిహతులైరని యదివఱకే చెప్పబడియె.
నాఁడు సర్సానదీతీరమున గోవిందుఁడు శత్రువులకోడి పాఱిపోవు
నప్పుడు యతని తల్లిని సల్లాంద్రను జిన్నకొడుకుల నిరువురను

సేవకు లెట్టెటో బహుకష్టముమీఁద నది దాటించి పగతుర బారినుండి తప్పించిరి గదా! ఆయన భార్యలు చనినదారినే తల్లియు నిరువురుకొమరులుఁబోవ యత్నించుచుండ వారియింట జిరకాలమునుండి సేవకుఁడుగనున్న యొకబ్రాహ్మణుఁడు గోవింద మాతనుజూచి తనయూరక్కడకు సమీపమున నున్నదనియుఁ జిన్నమనుమలను దోఁడ్కొని తనయింటికి వచ్చినయెడల వారు సురక్షితముగనుండవచ్చుననియు నామెకునచ్చచెప్పి తనగ్రామము వచ్చునట్లామె నొడంబరచెను. చిరకాలమునుండి తమ్ము సేవించుచు దమ బిడ్డలవలెనున్న యాబ్రాహ్మణుని యుపదేశము తమకు క్షేమకరమని తలంచి యాయవ్వ కోడండ్రను దక్కిన పరిజనంబును బోయినదారినిబోవక యాబ్రాహ్మణునితో జనెను. గ్రామము చేరునప్పటికి రాత్రియయ్యెను. ఆయవ్వకు మనుమలకు బ్రాహ్మణుఁడొక గదియిచ్చి యాహారమిడి యోపినకొలది సపర్యలుచేసి పండుకొనుటకొక గడ్డిపరుపిచ్చెను. మార్గాయాసఖిన్నులై మనోవేదనాపీడితులై యున్న కతమున యాబాలకులిరువురు కన్నుమూసి వెంటనే నిద్రించిరి. ఆముసలమ్మ దగ్గర కొంతరొక్కము కొన్నినగలు నుండుటచే నామె నిద్రింపక మేలుకొని యుండఁదలచెను. కాని యట్లుండుట కామెకగునా! కొంతసేపటికి ప్రయత్నముగ నామెకన్నులు మూతలువడెను. ముగ్గురు గుఱ్ఱుపెట్టి నిద్రపోయిరి. అప్పుడా బ్రాహ్మణుఁడు చప్పుడు గాకుండ బొటనవ్రేళ్ళమీఁద నడచి గదిజొచ్చి యొడలు మరచి నిద్రించుచున్న యాయవ్వతలయెత్తిగించి తలక్రిందనున్న నగలపెట్టె సంగ్రహించి యది దొడ్డిలో నొకచో బాతిపెట్టి తన

మీఁద ననుమానము లేకుండునట్లు దొంగలుదొంగలని పెద్ద
పెట్టున నరచెను. ఆయరవుని గోవిందమాత యదరిపడిలేచి
పెట్టె వెదకికొని కానక విప్రుఁదనయెదుటం నిలువంబెట్టి తత్క్షణమే
తనపెట్టె దెచ్చియిమ్మని కఠినముగ నడిగెను. అట్లడుగుటకుఁ
గారణమేమన దొంగలు పడినజాడ లేమియు నామెకు గనబడ
లేదు. మీఁదుమిక్కిలి పారుని వాలకము మాఱుటతీరుజూడ నామె
కనుమాన ముదయించెను. అప్పలుకులువిని యక్కపటబ్రాహ్మ
ణుఁడు తొల్లింటి వినయమును గౌరవంబును విడిచి యేమేమీ
నాయింటికివచ్చి నాకెదురు దొంగతనము గట్టెదరా! ఇటువంటి
మాటలన్నయెడ జాగ్రత్తయని బెదిరించెను. ధనముపోయిన
బోయెగాక దుష్టబ్రాహ్మణుఁ డేమిదౌర్జన్యము చేయునోయని
భయపడి లోకానుభవముగల యావృద్ధాంగన శాంతభావము
వహించి నీవు దొంగతనము గట్టలేదు. దొంగలు వచ్చినప్పుడు
నాపెట్టె జాగ్రత్తపెట్టితివేమో యనుకొని మునుపు నీయెడ నాకు
గల చనువుచేత నిట్లంటినని ప్రత్యుత్తరమిచ్చెను. ఆదురాచా
రుఁడు దొంగిలించినసొమ్ము తనకు దక్కునో దక్కదో యని
సంశయించి వారినెట్లయిన గడతేర్చినగాని తనకు సేమములేదని
కనిపెట్టి వారిని వదలించుకొను నుపాయమువెదకి తత్క్షణమే
యిల్లువిడిచి గోవిందునియెడల నతిద్వేషము బూనిన యిరువురు
కరకుతురకల వెంటఁబెట్టుకొని బోయి యాగదిలోఁ బ్రవేశపెట్టెను.
ఆదురాత్ములు బాలకుల నిరువురను బలవంతముగ దీసికొని
పోయిరి. ఆఘోరకృత్యము జూచి గోవిందమాత మూర్ఛ

బోయెను. మూర్ఛబోవుగాక మృతినొందుగాక ఆమెజోలి తురకలకు గావలెనా దుష్టబ్రాహ్మణునకుఁ గావలెను. ఆమహామ్మదీయు లాబాలకులను, దోడ్కొనిపోయి సర్ హిందూపరిపాలకుఁడైన వజీరుఖానున కప్పగించిరి. వజీరుఖాను మున్నుగు మహామ్మదీయులకు గోవిందునిమీఁద నెంతద్వేషము గలదో యాతని బిడ్డలమీఁదను నతనివాంఛమీఁదను నతని యనుచరులమీఁదను వేయేల నతని కుక్కలమీఁదఁగూడ నంతద్వేషము గలదు. అందుచేత నతనిచిన్నబిడ్డలు దొరకుట వజీరుఖానునకు నిక్షేపము దొరికినట్లుండెను. ఆయిరువురలో బెద్దవాఁడు పండ్రెండేండ్ల వాఁడు రెండవయతఁడెనిమిదేండ్లవాఁడు పెద్దవాని పేరు జోరావారసింగు. రెండవవానిపేరు నతేసింగు. ఆ కుమారసింహములను దనయెదుటకు రావించి మీరు మహామ్మదీయమతము స్వీకరించినచో మీప్రాణములు నిలుచును. లేనియెడల మిమ్ముల జంపించెదనని కఠినముగ బలికెను. ప్రాయమున బండ్రెండేండ్ల యర్భకుఁడయ్యు శౌర్యమున నతివృద్ధుఁడగు జోరావారసింగు నిర్భయముగాను నిశ్శంకముగాను వానికిట్లనియె. పతితులను నజ్ఞానులను నుద్ధరించుటకై యాదేశమున గురునానకు నెలకొల్పిన పరిశుద్ధాస్తికమతమునందే మాకు విశ్వాసము గలదు. సత్యము జయించు కొరకును హిందూజాతి వృద్ధిపొందుటకును మనఃపూర్వకముగ దనప్రాణమును బలియిచ్చిన మహానుభావుఁడగు తేజబహాదూరు యొక్క సంతతివారము మేము. సత్యముకొమిత్తము భగవంతుని నిమిత్తము తన సర్వస్వము గోలుపోయిన గురుగోవిందుని పుత్రు

లము. అట్టి యుత్తమరాజ వంశాంకురములగు మేము తురకల మత మవలంబించుట ఇది ఈశ్వరేచ్ఛకు విరుద్ధముచేయుట మా పితృపితామహులయొక్కయు మావంశముయొక్కయు పేరు చెడగొట్టుట మేమిప్పుడు తురకల మైనయెడల బ్రతుకవచ్చు భాగ్యవంతులము కావచ్చు కాని యెప్పుడో యొకప్పుడు చావక చిరంజీవులము కాగలమా! ఇంతమాత్రమునకు మేము స్వమత ద్రోహుల మేలకావలయును? ఆడింభకులు తనవంటివాని కట్టి ప్రత్యుత్తర మొసంగుదురని ఖాను తలంపలేదు. ఆయుత్తరము వినఁగానే యతఁడు కోపఘూర్ణిత నయనుఁడై కోపావేశమున గద్గదస్వరుఁడై యీ బుడుతలను దీసికొనిపోయి తల తెగవేయు డని యానతిచ్చెను. ఆబాలకులు సుకుమార శరీరములు ముద్దులు మూటగట్టు మొగములు వీరరసగర్భితములైనమాటలు సభాస్థు రుల హృదయములు గగిగించెను. ఆసభలోనున్న మీరుమహా మ్మదుఖాననునట్టి గొప్పతురక మిక్కిలిజాలిపడి యాఘోర కృత్యము జేయవలదని వారించెను. వజీరుఖానుఁ డతనియుప దేశమున దా దలపెట్టిన దుష్కార్యము మానదలఁచెను. కాని శచీచంద్రుఁడనెడు నొక హిందువుఁడు గురుగోవిందుని శత్రుఁడు వజీరుఖానున కాప్తుఁడు లేచి యిట్లనియె. "పాముంజంపి పిల్ల లను విడుచుట వివేకమా అవి పెరిగి కాలక్రమమున కొంప తీయవా?" అప్పలుకులు విని వజీరుఖాను బాలకులంజూచి మహమ్మదీయమతము స్వీకరింపవలసినదని మరల కోరెను. ఆపలు కులకు వారు మునుపటికన్న కఠినముగ బ్రత్యుత్తరమిచ్చిరి.

అప్పలుకులు దుస్సహము లగుటయు వజీరుఖాను కోపము పట్ట జాలక యీ బాలకులను పునాదిలో వైచి వారిమీఁద గోడకట్టు డని యాజ్ఞాపించెను. అతనినోట నమ్మాట వచ్చుటే తడవుగ సేవకు లామానవులను గొంటుకొనిపోయి ప్రాతగోడయొకటి పడ గొట్టి పునాదిత్రవ్వి బాలకులనందు బడవైచి గోడకట్ట మొదలు పెట్టిరి. గోడ మోఁకాళ్ళవఱకు వచ్చునప్పటికి వేడుక చూచు టకై వచ్చిన వజీరుఖాను వారినిజూచి యిప్పుడైనను మీరు తురకలైనయెడల మిమ్ముఁగాచెదనని యాసగొలిపెను. చచ్చె దముగాని మతము విడువమని వారు గంభీరముగ బలికిరి. అట్ల యిన జావుఁడని వెడలిపోయెను. గోడ గుండెలవఱకువచ్చునప్పటి కెనిమిదేండ్లయీడుగల ఫతేసింగు మిక్కిలి యాయాసపడి కొంచెము భయపడెను. అది కనిపెట్టి భయమెట్టిదో యెఱుఁగని జురవారసింగు వత్సా! ఫతేసింగు భయపడకు. వహా! గురూ జీకే ఫతే యనుమాటలు స్మరించుకొనుము. నీశరీరములో మహా వీరులైన మన పితృపితామహుల రక్తము ప్రవహించుచున్నది. వీరమాతయైన మనయమ్మపాలు త్రాగి నందుకు పిరికితనముఁ జూపి నీవప్రతిష్ట తేకుము. అని యెల్లవారు నచ్చెరువడ పలికెను. అనంతరము గోడ కంఠము మీఁద నుఁ మొగము మీఁద నుఁ గట్టబడ క్షణముసేపు వారూపిరి సలుపక బాధపడి భౌతికదేహ ములువిడిచి యశఃకాయములదాల్చిరి. ప్రపంచమునందు బాలకు లనేకులు పగతురచేజిక్కి దుర్మరణము నొందిరి. కాని యింత పరమశాంతముతో నింతమహా ధైర్యముతో నింతస్వమతవిశ్వా

సముతో మృతినొందినవారులేరు. ఈఁడుజూడ నెన్మిదేండ్లవాఁడొకఁడు. పండ్రెండేండ్లవాఁడొకఁడు. వారినోట వెడలిన మహాద్భుత వచనములు వయసుచెల్లిన శూరశిఖామణులకైన లోకోత్తరమైన గౌరవమును సముపార్జించినవి. అట్టి మహాశూరులను గన్నతల్లియెతల్లి. తండ్రియెతండ్రి ఆగుణరత్నములు జన్మించిన వంశమేవంశము. ఈమహాపురుషులచరిత్ర మింతటితో ముగించి వీరికీదుర్గతిదెచ్చిన యాబ్రాహ్మణుని నొక్కమాఱు దలంచుకొనుఁడు. వాఁడు బ్రాహ్మణుఁడా? వానికన్న కటికివాఁడు వేయిమడుగు లుత్తముఁడు. వానికన్న కుక్కనుతిను చండాలుడు పూజ్యుఁడు. వానికన్న గోహంతకులు మంచివారు. ఆ పాపాత్మునివంటి కృతఘ్నులు లోకమునలేరు. చిరకాలము గురుగోవిందునియింటనుండి వానిసొమ్ము దిని తుదకు వారితల్లిని బిడ్డలను వంచించి తనయింటికే తీసికొనిపోయి ధనమూహరించి పసిబిడ్డలను పగవారి కప్పగించి మహాపాతకమున కొడిగట్టిన యా దురాచారునిగుండె రాయి గాని హృదయముకాదు. వాని దలచుటయుపాతకమేపితామహీ మనుములదుర్గతివిని తలఁగోడకు గొట్టుకొని ప్రాణము వదలెను. తన చిన్నబిడ్డలయొక్కయు దల్లియొక్కయు దుర్మరణవార్తవిని ధైర్యసంపన్నుఁడును జ్ఞాననిధియునైన గురుగోవిందుఁడు కంట దడివెట్టక పరమేశ్వరుని యిచ్ఛ జరుగుగాకయని భక్తిజ్ఞానప్రదములైన కొన్నిపద్యములజెప్పి యూరకుండెను.

వజీరుఖానుతో జరిగిన యుద్ధమున నిహతులైన స్వజనులకు దహన సంస్కారములు చేయించి తన్నుగురించి ప్రాణములు

విడిచిన జోదులపేరులు జ్ఞాపకముండునట్లా స్థలమున నొకయూరు కట్టి దానికి ముక్తిరసమను పేరుపెట్టి యనంతర మతఁడు దేశాటనమున కరిగెను. ఈసంచారమున నతఁడు పెక్కుగ్రామములు చూచెను. కొన్నియూళ్ళ జనులతనిని మిక్కిలి గౌరవించిరి. కొన్ని యూళ్ళవారు తిరస్కారభావము జూపిరి. ధనము తగినంత లేకపోవుటచే సైనికులకు జీతమిచ్చుట యాలస్యమగుచువచ్చెను. అందుచేత సైనికులు గోలపెట్టిరి. ధనము దగ్గఱనున్నపుడాయన దాచుకొనక యెప్పటికప్పు డతఁడు జీతము లిచ్చుచుండెను. లేనప్పుడు కొంచె మాలస్యమగుచు వచ్చెను. దివానుసింగను నతఁడు మాత్రము తనకు జీత మక్కఱలేదనియు గురుపాద సేవయె గొప్పజీతమనియుఁ జెప్పెను. ఈప్రయాణములలో నొక తురకఫకీరతనిని సందర్శించి సీకుమతములో జేరదలచు కొనెను. అతడు మ్లేచ్ఛుఁడనిసందేహింపక గోవిందుఁడు తినమతసిద్ధాంతము ప్రకార మతనిని శుద్ధుంజేసి స్వమతమున గలుపుకొని కీజమిారు సింగని పేరుపెట్టెను. అనంతరమాయన కొంతకాలమునకు నానకు జన్మభూమియైన తాల్వొండి జేరెను. చిరకాలము క్రిందట నెడబాసిన కుటుంబ మాయన నక్కడ కలసికొనెను. కొడుకులందఱు గతించుటచే గోవిందుని మనస్సు పరిపక్వమై యైహికవాంఛలు విడిచి పారలౌకిక విషయముల మిాదనే నిలిచెను. తాల్వొండి నుండి యతఁడు దండమయమను గ్రామముఁజేరెను. దండమయ మనుపేరు గోవిందుఁడే పెట్టెనని కొందఱందురు. ప్రాతపేరేయని కొందఱందురు. ఈగ్రామమునం దుండఁగా మొగలాయి చక్ర

వర్తియగు నౌరంగజేబు తనదర్బారునకు రమ్మని యతనినాహ్వా
నముచేసెను. మొట్టమొదట మెత్తవడి యతఁడు వెళ్ళదలచెను.
కాని పౌర్వాపర్యములు విమర్శించిన తరువాత హిందూమత
ద్వేషియైన యాతని సన్నిధికి బోవుట శ్రేయము గాదని మాను
కొనెనుఁ ఔరంగజేబు తనప్రయత్నము మానక తనకొలువునకు
రమ్మని మరల సందేశమంపెను. ఆసందేశమునుగూడ నతఁడు
నిర్భయముగ నిరాకరించెను. మొగలాయిదర్బారునకుఁ బోవుట
తనకిష్టములేదని యౌరంగజేబున కతఁడు పద్యరూపముగ నొక
జాబు వ్రాసెను. ఆజాబు కొంత పారసీకభాషలోను కొంత పం
జాబు భాషలోను నున్నది. దానిపేరు జాఫరునామా యందురు.
జాబనగా బదిబంతుల వ్రాతగాదు. అదియొక చిన్నగ్రంథము.
ఆదంకమగ్రామములోనున్న కాలమునని గురుగోవిందుఁడు సీకుల
వేదమైన యాదిగ్రంథమును తిరుగ వ్రాయించెను. పూర్వగ్రంథ
ములో దనయొక్కయు దనదండ్రియు దొమ్మిదవ గురువునగు
తేజబహదూరు యొక్కయు నుపదేశములు లేవు. అవి చేర్చి
యితఁడు గ్రంథము సమాప్తము చేసెను. ఇదిగాక విచిత్రనాటక
మని యతఁడు మరియొక గ్రంథము చేసెను. ఇది వెనుకటి
తొమ్మండ్రుగురు గురువులయొక్కయు దనయొక్కయు చరి
త్రము. ఈవిధముగ నతఁడిహలోకసౌఖ్య పరాఙ్ముఖుఁడై స్వమత
వ్యాప్తిజేయుచు ధర్మమార్గ పరాయణుఁడై యుండెను. గోవిం
దుని శత్రువులబలము మహాసముద్రమువలె పారములేనిది. అతని
సైన్యము మిక్కిలిస్వల్పము. సీకులెంత ధీరులైనను నెంతశూరు

లైన సంఖ్యలో నధికులైన మహామ్మదీయులముందర నిలువ గలరా ! ఇరువురసైన్యములు సమానసంఖ్య గలిగినప్పుడు నీకు శౌర్యము పగరకు దుస్సహమై యుండును. సైన్యము కావలె నన్న ధనము కావలెను. అతనియొద్ద ధనములేదు. సైన్యము లేదు. కాని హృదయమున దేశాభిమానము స్వమతాభిమానము మేరమీఱియున్నవి. ఎన్ని యభిమానములున్న నేమి ? ధనమూల మిదం జగత్తనుమాట నిజము. ఈధనదారిద్ర్యము సైన్యదారి ద్ర్యము దీర్చికొని మొగలాయి సైన్యములతో బ్రతిఘటించి నిలచి హిందూస్థానమున దనమతము బాదుకొలుపుటకై యతఁ డొక్క యుపాయ మాలోచించెను. రాజపుత్రులు మహావీరు లనియు వారిలోననేకులు దేశమునిమిత్తము మతమునిమిత్తము ప్రాణములు విడిచిరనియు మొగలాయి చక్రవర్తికి నిత్యవిరోధు లనియునతఁడువినుచుండుటచే వారియొద్దకుబోయి తనయవస్థ వారి కెఱిగించినపక్షమున వారుతప్పక తమపక్షముఁబూని తనకు ధనము సైన్యము నిత్తురనియు వారొకవేళ నిరాదరము జూపినపక్షమున స్వదేశోద్ధరణము నిమిత్తమై నెత్తురు ధారవోయుచున్న మహా రాష్ట్రులు తనకు మహోపకారము జేయుదురనియు నతఁడు తలంచి మొట్టమొదట రాజపుత్రస్థానమునకు జనెను. రాజపుత్ర ప్రభువులలోని గొందఱు మొగలాయిలకు విధేయులై చక్ర వర్తిమాట జవదాటకుండిరి. కొందఱు చక్రవర్తితో బోరాడు చుండిరి. ఈర్ష్యాసూయలచే బ్రేరితులై కొందఱు స్వజనస్వదేశ నాశనము జేసికొనుచుండిరి. గురుగోవిందుఁడు సందర్శించినప్పుడు

వారాయనయెడల దిరస్కారభావము జూపక మిక్కిలి గౌరవించిరి. కాని తమ వ్యవహారములె తమకు సరిపోవుచుండుటచే వారాయనకు ధనసహాయముగాని జనసహాయముగాని చేయజాలరైరి. అక్కడస్థితి తన కనుకూలముగ లేకపోవుటచే గోవిందసింగు రాజస్థానము విడిచి దక్షిణాపథమునకుఁ బయనమై మహారాష్ట్రదేశము జొచ్చెనుకాని యప్పటికి వైదికమతోజ్జీవకుడైన శివాజీమహారాజు వానికుమారుఁడైన శంభాజీయు మృతినొందుటచేతను శివాజీ మనుమడైన సాహూ ఢిల్లీచక్రవర్తిచేత వధింపఁబడుటచేతను మహారాష్ట్రసామంతులు భిన్నాభిప్రాయులై పరస్పర విరోధములు గలిగియుండుటచేతను గోవిందునకు రాజస్థానమున నెంతయాలంబనము గలిగెనో మహారాష్ట్రమునగూడ నంతియె యాలంబనము గలిగెను. అతఁడు నాందేరను పట్టణమున నుండగా హిందూమతనిరంతర ద్వేషియు గోవిందునకు మనశ్శూలమునైన యౌరంగజేబు చక్రవర్తి దక్షిణదేశమునందు మృతినొందెనని యాయనకు తెలిసెను. అంతటి మహావిరోధి పోయినాఁడని విన్నప్పుడాయన సామాన్యమానవునకువలె మితిమీఱిన సంతోషము నొందక పరమశాంతముతో నవార్తనాలకించెను.

---

## బహాదూరుషా.

నిజసోదరులరక్తము కంట జూడకుండ స్వకుటుంబనాశనము జేయకుండ నొకరిద్దఱుతప్ప సింహాసనమెక్కిన మొగలాయీ చక్రవర్తులులేరు. షాజహాను గద్దెనెక్కినప్పుడు తన యన్నదమ్ముల నందఱను గత్తికెఱజేసెను. షాజహానునియొక్క నలుగురు కొడుకులు తండ్రి చావకముందె రోగపీడితుఁడైనంత మాత్రమున చక్రవర్తిపద మాక్రమించుకొనవలెనని యన్యోన్య సంహారణదీక్షితులై ఘాతుకమృగములవలె బోరాడిరి. మూర్ఖుడైన మురాదును ధైర్యశాలియైన దారాను వారికొడుకులను వేయిమాటలేల తన కన్నతండ్రినిగూడ గారాగృహమున బెట్టించి చంపించెను. అవశ్యం పితాచార మన్నమాట మొగలాయి కుటుంబమునందు నిక్కమైనట్లు మఱియే కుటుంబమునందుఁగాలేదు. షాజహానుయొక్క యాచార మౌరంగజీబవలంబించెను. ఔరంగజీబుయొక్క పద్ధతి నతనికొడుకు లవలంబించిరి. ఆచక్రవర్తి కాలధర్మము నొందునప్పటికి వానికి మువ్వురుకొడుకు లుండిరి. పెద్దవానిపేరు ముజాము. రెండవవానిపేరు రజాము. మూడవవాని పేరు కామరభక్షు. ఔరంగజేబు తన తమ్ముఁడైన మురాదు నెట్లువంచించెనో యజాము తన తమ్ముఁడైన కామరభక్షునట్లువంచించి చెఱబెట్టించి తుదముట్టించి యన్నగారైన ముజాము సింహాసన మెక్కకుండఁ జేయవలెనని ప్రయత్నించెను. తండ్రి పోవునప్పటికి ముజాము గాబూలులో నుండెను. పితృమరణ వార్త వినినతోడనె తన తండ్రివలన దనపెదతండ్రియైన దారాకు

నెట్టియవస్థ సంభవించెనో యట్టియవస్థయె తానాలస్యము చేసిన యెడల దనకుగూడ సంభవించునని భయపడి వెంటనే ఢిల్లీకి బయనమయ్యెను. హిందూస్థానము జేరినతోడనె ముజాము ముందుగానొక తెలివైనపని జేసెను. తనతండ్రికి విరోధియై దేశమున మిక్కిలి పలుకుబడి గలిగిన గురుగోవిందుసింగుయొక్క స్నేహము సంపాదించుకొనట తనకు శ్రేయోదాయకమని యాతఁడు తలంచి తనకు సహాయము చేయుమని కోరుచు నతని యొద్దకిద్దరు హిందూరాయబారుల నంపెను. గోవిందసింగునకు ముజాము గద్దెయెక్కినను నజాము గద్దెయెక్కిన నొక్కటె. అయినను శత్రువైన యౌరంగజేబుకొడుకులలో నొకనికి సాయము చేసి రెండవవానిని గడతేర్చుట కొంత శత్రునాశనము చేయుటయె యని తలంచి యతఁడు ముజామునకు సహాయముచేయ నిశ్చయించెను. అజాము ముజాముల కాగ్రానగరమువద్ద గొప్ప యుద్ధము జరిగెను. గోవిందసింగు తనసైన్యముతో ముజాము పక్షముచేరి యతనికి విజయము కల్పించెను. ఇందతిశయోక్తి లేదు. గురుగోవిందుని వింటినుండి వెడలిన యొకబాణము హౌదాలోనున్న యజామునకుఁ దగుల నతఁడు మృతినొందెను. నాయకుఁడు మృతినొందగానె సైన్యమంతయు చెల్లాచెదరయ్యెను ముజాము బహదూరుషాయను బిరుదుతో ఢిల్లీచక్రవర్తి యయ్యెను. గురుగోవిందు గావించిన మహాసహాయము మనసులో నుంచుకొని బహదూరుషా వానియెడ మిక్కిలికృతజ్ఞుఁడై యతనికొక్క జాగీరు నిచ్చెననియుఁ దనకు జాగీరక్కఱలేదని

గోవిందుఁడు నిరాకరించెననియు జరిత్రకారులు వ్రాసియున్నారు తన చిన్నబిడ్డలను దుర్మరణము పాలుచేసిన కొండరాజులను వజీరుఖానును దనకుబట్టి యప్పగించవలసినదని గోవిందసింగు గోరెనట. ఒక సంవత్సరము గతించిన తరువాత నట్లు చేయుటకు చక్రవర్తి యొడఁబడెనట. కాని చక్రవర్తి వారి నెన్నఁడు బట్టి యప్పగింపలేదు. గోవిందసింగు బహదూరుషాయొద్దనె కొంత కాలముండెను. ఆచక్రవర్తి దక్షిణదేశమునకు దండు వెడలి నప్పుడు సీకుగురువుకూడ నిజసైన్యముతో వానివెంట జనియెను. ప్రాతపగతురను దనకుపట్టి యప్పగింపక పోవుటచే గురువునకు బహదూరుషామీఁద కోపమువచ్చెను. ఆపని చేయజాలనందుకు బహదూరుషా మిక్కిలి చింతించి కావలయునంత ధనమిచ్చెద నని సికిగుతో జెప్పెను. కాని సింగు ధనమక్కఱలేదని నిరాకరించి మొగలాయి సైన్యమును విడిచి తనబలగమును దీసికొని వెడలిపోయెను. బహదూరుషా చక్రవర్తియై సింహాసనముమీఁద స్థిరముగా గూర్చుండెను. కావున గురుగోవిందు వెడలిపోయినను నతనికి భయములేదు. ఏరుదాటి తెప్పతగులవేయు స్వల్పమతులు లోకమున నెందరో గలరు. అందులో బహదూరుషాయొకఁడు.

## బాందుఁడు.

గోవిందసింగు చక్రవర్తిసైన్యమును విడిచి దక్షిణదేశమున గ్రుమ్మరుచుండఁగా గోదావరితీరమున నాదరను నొకగ్రామముఁ జూచెను. అది గౌతమీతీరమున మిక్కిలి సుందరమైన స్థానమున నుండుటచే నచ్చట కొంతకాలము వసియింపవలెనని నిశ్చయించుకొని కొంతప్రదేశము ధనమిచ్చి నిలిచి యచ్చట కొన్ని మందిరములు గట్టి యందు గాపురముండెను. అచ్చట నుండగా నొకనాడొకబైరాగి యాతని సందర్శించెను. ప్రసంగవశమున గోవిందుడతనితో హిందూమతమునకు మహమ్మదీయులు చేసిన దుర్ణయములనుజెప్పి ధైర్యముతో మతపక్షముఁబూని పనిచేయువారు లేరని విచారించెను. ఆకార్యమునందు దన్ను నియోగించినపక్షమున దాను తురకలతో బ్రతిఘటించి స్వమతరక్షణముచేయగలననిచెప్పెను. ఆతనిపేరు బాందుఁడు. అతడు దృఢమనస్కుడు. గొప్పశరీరదార్ఢ్యము గలవాఁడు. ఆతనిశరీరదార్ఢ్యమును మనోనిశ్చయమునుజూచి యమ్మహాకార్యభారమతడు వహియింపజాలునని చేయవలసినపని పంజాబుదేశమందుండుటచే గొన్ని జాబులు వ్రాసియిచ్చి యతని నా దేశమున కంపెను. బాందుఁడు పంజాబున కరిగి సీకులం గలియుగట్టుకొని ముందుగా సర్‌హిందు మీదికి బోయెను. గోవిందసింగుయొక్క చిన్నబిడ్డలను, గోడ పునాదిలోనైచి దురాత్ముఁడైన వజీరుఖాను వారిమీఁద గోడ పెట్టించిన దిచ్చోటనేయని యాయూరుపేరు వినఁగానే యానాట

మనకే మర్యాదవిషాదము గలుగుచుండఁగా బాందునకు విషాద క్రోధములు గలుగుట యాశ్చర్యముకాదు. సర్‌హిందులో నడుగుపెట్టినది మొదలుకొని బాందుఁడు కనబడిన యిల్లెల్లగాల్చి యీామతస్థు డామతస్థుఁ డనక దొరికినవారినెల్ల గత్తికెరజేసి యతి ఘోరముగ విహరించెను. రెండుమూడుదినములలో పట్టణ మంతయు భస్మపటలమయ్యెను. అతనినామశ్రవణము ప్రాంత భూముల వసియించువారికి హృదయనిర్భేదక మయ్యెను. ఆతఁడు సర్‌హిందు విడిచి వచ్చుచున్నాఁడని వినగానే దారిలోనున్న పల్లియలజనులు గృహారామక్షేత్రములు విడిచి యడవులలో దాఁగొనబోయిరి. సర్‌హిందునగర నాశనమైన తరువాత నతఁడు సట్లెజి బియాసునదులుదాటి బాటలనగర వినాశనమున కరిగెను. ఆపురపాలకుఁడైన షేకుపులుహాదు నగర మెంతకాపాడినను తుదకది బాందుని చేతఁబడియెను. పురపాలకుడు యుద్ధములో మృతినొందెను. ఆపట్టణమున బాందుఁడు మొట్టమొదటగా కాల్చినయిల్లు ఖాజీయబ్దుల్లాది దీనింబట్టి మహమ్మదీయులయెడ నెంతద్వేషమున్నదో తెలియవచ్చును. అక్కడనుండి యతఁడు లాహోరునకుఁబోయి యాపట్టణముగూడ నిప్పులకుప్ప జేసెను. అనంతర మతఁడు రావీనదిదాటి జామూనగరమునకుఁబోయెను. అప్పటికి బహదూరుషా చక్రవర్తి మృతినొందెను. ఫెరుక్సియరు ఢిల్లీపాదుషా యయ్యెను. అతఁడు బాందునియొక్క దుండగములనువిని పంజాబుపరిపాలకుఁడైన యబ్దులుసమ్మదనువానిని

బాందుని బట్టుకొమ్మని పంపెను. అతఁడు గొప్పసేనతో నతని మీఁదికి బోయెను. కాని బాందుని ప్రతాపాగ్ని యతనిముందర చల్లబడియెను. అతఁడు పరాజితుఁడై కోటలో డాఁగొనవలసి వచ్చెను. మొగలాయీయి ముట్టడించి యూపిరి పుచ్చుకొనుట కైన నెడమీయనందున బాందుఁడు కోటలోనుండి పాఱిపోవుటకు వీలులేక పోవుటకు సామర్థ్యము లేక శత్రువులచేతిలో జిక్కెను. అతనిని బట్టువడిన తక్కినవారిని పంజాబుపరిపాలకుఁడు ఢిల్లీకిపంపెను. అవ్వల బాందునియొక్కదుర్గతి నేమని చెప్ప వచ్చును. ఎన్ని చిత్రవిధముల నరునిజంపవచ్చునో యన్నివిధము లాతనియెడ బ్రయోగింపబడెను. అతఁడు తన స్వహస్తములతో దురకల యాజ్ఞప్రకారము కన్నకొడుకులను చంపవలసివచ్చెను. అట్టి సమయమునసైత మతఁడు కంటదడిబెట్టక చేయి వడక నీయక యతి ధైర్యముతో నిలిచి యాదారుణకృత్యము నెరవేర్చెను. తరువాత నతనిచర్మ మొలిపింపవలసినదని చక్రవర్తి యాజ్ఞాపించెను. కరకుతురకలు కత్తులతో జర్మము చీరి మేను నారింజపండువలె వొలుచునప్పుడు సయితే మతఁడు దుఃఖపడక దయదలఁచి రక్షింపుమని దేవురింపక మూలుగక పర్వతమువలె నిలిచి యాబాధసహించి దారుణమరణమును నొందెను. బాందుఁడు ధైర్యమునను గాంభీర్యమునను బాధా సహనమునను శ్లాఘాపాత్రుఁడే కాని యతఁడు చేసిన దారుణకృత్యమున కతని నెవ్వరు క్షమింపజాలరు. పంజాబుదేశమున నతఁడు నెరపినవి

మున నతఁడు స్నానముచేసి యీశ్వరధ్యానము జేసికొని భజనలు చేయును. మధ్యాహ్నము భోజనముజేసి పేదల కన్నదానము చేయించును. సాయంకాలము శిష్యులకును దన్నుజూడ వచ్చు వారికిని బ్రహ్మజ్ఞానోపదేశము చేయుచుండును. రాత్రి మరల భగవధ్యానముజేసి భజనలు చేయుచుండును. ఈవిధముగ నతఁడు గోదావరీతీరమున గొన్ని సంవత్సరములు కాలక్షేపము జేసెను. మహావీరుఁడైన యాతనికి శస్త్రమరణమే సంభవించెను పఠానుజాతివాఁడైన యొకతురక చదరంగమాడుచుండఁగా నొక నాఁడాయనను ఖడ్గముతో గడుపులో బొడిచెను. ఈపొడుచుటకనే కులనేక కారణములు చెప్పుచున్నారు. గురుగోవిందుఁడు తనపై నలిగి తన్నువిడిచి పోవుటచేత నతఁడు ససైన్యముగ బ్రతికియుండుట తనకు క్షేమముగాదని బహదూరుషా చక్రవర్తి స్వామత్థునిచేత నీపని జేయించెనని కొందఱి యభిప్రాయము. ఈపొడిచిన పఠానుజాతివాని తండ్రి యేడువేల రూపాయలకు గురుగోవిందునకు గుఱ్ఱముమ్మెను. ధనము దగ్గఱ లేకపోవుటచే గోవిందుఁ డరువుబేరముజేసి యప్పుడప్పుడు కొంతసొమ్మిచ్చి పలుమారు వానిని త్రిప్పుచువచ్చెనట. అందుకా తురక కోపించి కత్తిఁపుచ్చుకొని గురుగోవిందునిపై బడెను. గోవిందుడువానిపోటు తప్పించుకొని తనఖడ్గముతో వానిశిరస్సు నేలబడ నరకెను. అతని కొడుకు గురుగోవిందుని కొలువులో చిరకాలమునుండి పనిచేయుచుండియుతనియనుగ్రహమునకు బాత్రుడైయుండెను. అతఁడే పితృ

మున నతఁడు స్నానముచేసి యీశ్వరధ్యానము జేసికొని భజనలు చేయును. మధ్యాహ్నము భోజనముజేసి పేదల కన్నదానము చేయించును. సాయంకాలము శిష్యులకును దన్నుజూడ వచ్చు వారికిని బ్రహ్మజ్ఞానోపదేశము చేయుచుండును. రాత్రి మరల భగవద్ధ్యానముజేసి భజనలు చేయుచుండును ఈవిధముగ నతఁడు గోదావరీతీరమున గొన్ని సంవత్సరములు కాలక్షేపము జేసెను. మహావీరుఁడైన యాతనికి శస్త్రమరణమే సంభవించెను పరానుజాతివాఁడైన యొకతురక చదరంగమాడుచుండఁగా నొకనాఁడాయునను ఖడ్గముతో గడుపులో బొడిచెను. ఈపొడుచుటకనేకులనేక కారణములు చెప్పుచున్నారు. గురుగోవిందుఁడు తనపై నలిగి తన్నువిడిచి పోవుటచేత నతఁడు ససైన్యముగ బ్రతికియుండుట తనకు క్షేమముగాదని బహదూరుషా చక్రవర్తి స్వామ తస్థునిచేత నీపని జేయించెనని కొందఱ యభిప్రాయము. ఈపొడిచిన పరానుజాతివాని తండ్రి యేడువేల రూపాయలకు గురుగోవిందునకు గుఱ్ఱమమ్మెను. ధనము దగ్గఱ లేకపోవుటచే గోవిందుఁ డరువుబేరముజేసి యప్పుడప్పుడు కొంతసొమ్మిచ్చి పలుమారు వానిని త్రిప్పుచువచ్చెనట. అందుకా తురక కోపించి కత్తిపుచ్చుకొని గురుగోవిందునిపై బడెను. గోవిందుడువానివేటు తప్పించుకొని తనఖడ్గముతో వానిశిరస్సు నేలబడనరకెను. అతని కొడుకు గురుగోవిందుని కొలువులో చిరకాలమునుండి పనిచేయుచుండియుతనియనుగ్రహమునకు పాత్రమైయుండెను. అతఁడే పిత్

మరణమునకుఁ బ్రతీకారము చేయఁదలచియో మఱియేకారణముచేతనో గురుగోవిందుని బొడిచెను. గోవిందుని కోరికం బట్టియే యాతురక పొడిచెనని కొందరనుచున్నారు. ఏలయన గోవిందుఁడు బిడ్డలులేక శూన్యమైన సంసారమును జూచి విసిగి మరణమున కెదురు చూచుచు దనచే నిహతుఁడైన తురకవాని కొడుకును బిలిచి "నీతండ్రిని నేను జంపితినిగదా నీవు నన్ను జంపి పగ దీర్చికొనరాదా" యని పలుమారులు పలుకుచు వచ్చెనఁట. ఎన్నిమారులావని జేయుమని గురువు వానిని బురికొల్పినను వాడట్టి దుష్కార్యము జేయఁదలఁచుకొనలేదఁట. కాని యొకనాఁడా పఠానుకుఱ్ఱవాఁడును గోవిందుఁడును జదరంగ మాడుచుండఁగా గోవిందుఁడు వానికి కోపమెక్కునట్లు తండ్రింజంపినవానిని జంపలేకపోయితివిగదా యని పరిహసించెనఁట. ఆపరిహాసము భరింపలేక వెంటనే యాతఁడు మొలలోనున్న కత్తిఁదీసి గురువుపొట్టలోఁ బొడిచెనఁట. తురకపిల్లవాఁడు గురువుం బొడిచెనని తెలియఁగానే యాపట్టణమందున్న సిక్కులందఱు పరుగుపరుగున యచ్చోటికిబోయి పఠానును ముక్కముక్కలుగ నరుక యత్నించిరి. కాని గోవిందుఁడు వారి సంరంభమును వారించి తనపిత్రుమరణంబునకు ప్రతిక్రియజేసికొనెను. కాని యాబాలుఁడు దోషము జేయలేదనిచెప్పి వారిని శాంతపఱచెను. వెంటనే ప్రసిద్ధవైద్యులా గాయమునకుట్లు ఒకకుట్లు వేసి యపాయకరమైనది గాదని చెప్పిరి. గాయముమానకట్టెను కాని సంపూర్ణముగ మానకుండఁగనే

గోవిందుఁ డొకనాఁడు తనవిల్లువంచి యెక్కుపెట్టెను. ఆప్రయత్నములో గాయపుకుట్లు విడిపోయెను. చికిత్స నిష్ప్రయోజనమయ్యెను. అచిరకాలములోనే సిక్కుమతమునకు దశమ గురువును మహవీరుఁడు పరిశుద్ధాస్తిక మతప్రచారకుఁడును గాఢదేశాభిమానియు మేటి స్వార్థత్యాగియునైన గురుగోవిందుఁడు పరమపదము జేరెను. ఆయనసమాధి యిచ్చటికి నతిదూరమునందున్న యబ్జుల్ నగరమందున్నది. అక్కడి కేఁటేట నేనవేలు సిక్కులు యాత్రకై పోవుచుందురు. ఆతీర్థవాసుల యన్నపానములకు గావలసిన ద్రవ్యమంతయు మహమ్మదీయమతస్థులైనను హైదరాబాదు నవాబులే వ్యయము చేయుచుందురని చెప్పుచున్నారు.

గోవిందుని శరీరచ్ఛాయ పచ్చనిది. మేను లావుగా నున్నను చేవగలది. అతఁడు వేఁటయందు మిక్కిలి తమకము గలవాఁడు. వేటయందు దేహపరిశ్రమలయందు నధికాశక్తి గలిగి చాకచక్యము శరీరబలము పౌరుషము గలవారియందతనికి మిక్కిలి ప్రీతి. అతఁడు మాంసాహారి. పంజుఁడులేక యొక్క ప్రాణినైన భుజించి యెఱుఁగఁడఁట. తఱుచుగా నతఁడు వేటాడి చచ్చుకొన్న మృగముల పలలమే భుజించువాఁడఁట. అడవి పందివేట యతనికి మిక్కిలియిష్టము. అతఁడుమిక్కిలి పండితాదరణముగలవాఁడు. పండితులం బలువురఁ జేర్చుకొని వారిచే సంస్కృత గ్రంథములను వినుచుండును. సంస్కృతభారతరామాయణములు నతఁడు తఱుచుగా చదివించుకొని విని యోధుల విక్రమ సాహ

రములు మెచ్చుచుండును. అతఁడు హిందీభాషలో గొప్పకవి. అర్థగాంభీర్యము శబ్దసౌష్ఠవము గలుగునట్లతఁడు కవిత్వము చెప్ప గలఁడు వేదశాస్త్రములం జదువుకొని రమ్మని బ్రాహ్మణుల వారణాసి బంపి వారు మరల వారివలన వేదశాస్త్రపురాణ ములు నుపనిషత్తులవిని సిక్కుసభలలో గూడ సిక్కులజ్ఞానాభివృద్ధి నిమిత్తము వారిచేత నాగ్రంథముల జదివించుచుండును. అతఁడు మిక్కిలి ధర్మాత్ముఁడు. ధనమున్నసమయమున గొప్పదాత. అతనిదగ్గఱ నొకనాఁడు పుష్కలముగ ధనముండును. మఱి యొకనాఁడు క్రొత్తడబ్బైననుండదు. యౌవననిమిత్త మాతని కడకు బోవువారు వట్టిచేతులతో నెన్నఁడు జనలేదు. అతనికి ధనకాంక్షలేదు. సైన్య సంరక్షణమును కొఱకు నాత్మసంరక్షణము కొరకు నతఁడు ధనమార్జించుచుండెను. కాని నిలువ జేసికొని భోగము లనుభవించుటకొఱకుగాదు. ధనవిషయమున నతఁడెంత నిస్పృహుఁడో తెలియజేయుటకొక చిన్నకథ గలదు. ఒకనాఁ డొక శిష్యుఁడు రత్నఖచితములై యేబదివేలరూపాయలు విలువ గల బంగారుమణికట్లు తెచ్చి యాతనికి సమర్పించెను. అవి తన కక్కఱలేదని యాయన యెంతచెప్పినను వినక యాశిష్యుఁడు యవి గురువుచేతిలో బెట్టెను. అవి కొంతసేపుంచుకొని గురువుం వానిలో నొకదానిని గోదావరినదిలో బడవైచెను. శిష్యుఁడును గురువారి కృత్రిమకోపములు చూచి నగయేమైనదని యడిగిన గంగపాలైనదనివిని నీటమునుగగల జాలవాళ్ళం బిలిపించి వెదకే

కింపదలఁచి యది పాఱవైచిన చోటేదియని యడిగెను. గోవిందుఁడు రెండవచేతి మణికట్టుతీసి నదిలోఁ విసిరి పాఱవైచి యదిగో నక్కడ పాఱవైచితినని చెప్పెను. అదిచూచి శిష్యుఁడు మిక్కిలి నక్కజంపడి రెండుమణికట్లయెడ నాసవదలుకొని వెదకించుట మానెను. అతనికి పండుగలన్న మిక్కిలియిష్టము. దీపావళి హోళీ మొదలయిన పండుగలతనికి మిక్కిలి యానందకరము. ఇతఁడు గొప్ప రాజనీతివేత్త. రాజ్యాంగవ్యవహార పరిజ్ఞానము మిక్కిలిగలదు. ఆర్యుల మతాచారములను నడంచునట్టి విదేశీయుల పరిపాలనలో మాతృదేశముండగూడదని యాతనియభిప్రాయము. ఇది మనసులోఁ బెట్టుకొని మొదటినుండి యతఁడు పనిచేసెను. మిక్కిలి భూతదయ చూపవలసిన మతస్థాపకుఁడయ్యు కత్తియేల పట్టెనని కొందఱికి సందేహము తోఁచవచ్చును. హిందూమతములోనున్న కొన్ని పద్ధతులను నిరాకరించుటచే గొండరాజులు మొదలగు కొందఱు హిందువులును మహమ్మదీయమతధర్మములను ఖండించుటచే మహమ్మదీయులును నతని యెడల విరోధము వహించి హింసించుటచే నతఁడు ఖడ్గము దాల్చి తన మతమునంతను వీరరసప్రధానమగు మతముగా జేసెను. కాని లేనిచో నతఁడు నానకువలె మతబోధముతోనే కాలము బుచ్చియుండును. కత్తిబట్టుట యతని తప్పుగాదు. ఆయన మరణసమయమున శిష్యులు చుట్టుంజేరి తరువాత మతగురు వెవ్వరని యడిగిరి. ఇకమీఁద గురువెవ్వరు నుండగూడదు

భగవంతుఁడే గురువు. భగవదర్పితమైన యాదిగ్రంథమే గురువు. ఇంతకంటె గురువులు లేరు. ఇఁకమీఁద మానవగురువు పాదములకు మీరు నమస్కారము లెన్నఁడు చేయవద్దని యతఁడుపదేశించెను.

ఇట్టి మహాపురుషులు ప్రపంచమునకు నరుదుగ జన్మించుచుందురు. ధర్మసంస్థాపనమే వీరిసంకల్పము. లోకానుగ్రహమే వీరిపరమావధి. ఇతఁ డసాధారణ మేధావంతుఁడనియు రాజతంత్రజ్ఞుఁడనియు నాంగ్లేయ చరిత్రకారులు వ్రాసియున్నారు. భారతమాతృగర్భమున నిట్టి మహాదేశాభిమానులనేకు లుద్భవింతురుగాక !

సంపూర్ణము.